
V3 NEWS
లక్ష్యం సమాజహితం

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
07-06-2024
సంపుటి : 01 | సంచిక : 34 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD



# చట్టసభల్లోకి క్రిమినల్స్

## నేరగాళ్లకు అడ్డగా భారత పార్లమెంట్

- హత్యలు, అత్యాచారం చేసిన వాళ్లు ఎన్నిక
- మ్యాజిక్ ఫిగర్‌కు చేరువలో క్రిమినల్స్
- ఐదేళ్లకోసారి పెరుగుతున్న నేరస్తుల సంఖ్య
- 2024లో 252 మంది క్రిమినల్స్ లోక్ సభకు..
- వీరిలో శిక్షలు పడ్డవాళ్లు 27 మంది ఎంపీలు
- క్రిమినల్స్‌తో పోటీపడ్డ కాంగ్రెస్, బీజేపీ
- నివేదికను విడుదల చేసిన ఏడీఆర్

**విశ్వంభర, హైదరాబాద్ :**

కొత్తగా ఎన్నికైన 543 మంది ఎంపీలలో 251 మంది (46 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని పోల్ హక్కుల సంఘం అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) పేర్కొంది. వీరిలో 27 మందికి శిక్షలు కూడా పడ్డాయి. ఇలాంటి వారు 2014లో 185 మంది ఎంపీలుండగా(34 శాతం), 2009లో 162 మంది(30 శాతం), 2004లో 125 (23 శాతం) మంది లోక్‌సభకు ఎన్నికయ్యారు. అంటే 2009 నుంచి క్రిమినల్ కేసులు ఉన్నఎంపీల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ఈ ఏడాది గెలిచిన 251 మంది అభ్యర్థుల్లో 170 మంది (31 శాతం) తీవ్రమైన నేరారోపణలు (అత్యాచారం, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్) ఎదుర్కొంటున్నారు.

మిగతా2లో...

> “ చట్టసభలకు ఎన్నికయ్యే వాళ్లు ఉన్నతంగా ఉండాలి. నలుగురికి ఆదర్శప్రాయంగా, ఐకాన్‌గా ఉండాలి. భావితరాలకు స్ఫూర్తినిచ్చే వారిగా ఉండాలి. కానీ హత్యలు, అత్యాచారాలకు పాల్పడ్డ క్రిమినల్స్‌కు చట్టసభల్లో అడుగుపెడుతున్నారు. ఐదేళ్లకు ఓసారి ప్రజలచేత ఎన్నికయ్యే ఎంపీలు, ఎమ్మెల్యేల్లో వీరి సంఖ్య యేటికేడు పెరుగుతూనే ఉంది. తాజాగా లోక్‌సభకు ఎంపికైన వారిలో దాదాపు సగం మంది నేరారోపణలున్న వారే ఉండటం విస్మయం కలిగిస్తోంది. వీరిలో కొంతమందిపై తీవ్ర నేరోపణలు కూడా ఉన్నాయి. పార్లమెంట్‌లో వీరి సంఖ్య మ్యాజిక్ ఫిగర్‌కు దగ్గరలో ఉండటం ఇప్పుడు భారత్‌లో ఆందోళన కలిగిస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుకు ఫోన్

- మంత్రుల సమీక్షా సమావేశం నుంచే కాల్
- బాబుకు శుభాకాంక్షలు తెలిపిన రేవంత్
- రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి
- పెండింగ్ అంశాలను సహృద్భావంతో పరిష్కరించుకుందాం
- చంద్రబాబును కోరిన రేవంత్ రెడ్డి



**విశ్వంభర, జూబ్లీహిల్స్:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టబోతున్న చంద్రబాబు నాయుడికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంపై మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్ తదితరులతో కలిసి సమీక్ష జరుగుతుండగా ఏపీలో టీడీపీ విజయం ప్రస్తావన రాగానే చంద్రబాబు నాయుడికి రేవంత్ రెడ్డి ఫోన్ చేసి మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకి అభినందనలు తెలిపిన రేవంత్ రెడ్డి, రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. విభజన చట్టానికి సంబంధించిన పెండింగ్ అంశాలను సహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకునేందుకు సహకరించాలని చంద్రబాబు నాయుడును సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# దేశంలోనే ధనిక ఎంపీలు తెలుగువాళ్లే..

- మొదటి స్థానంలో పెమ్మసాని చంద్రశేఖర్
- రెండో స్థానంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించిన నేతలు



2



# హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ షేర్ల పెరుగుదల

- నాలుగు రోజులుగా పెరుగుతోన్న షేర్లు
- గురువారం గరిష్టంగా 10 శాతం దాటిన షేర్లు
- 30 రోజుల సగటు కంటే 8.1 రెట్లు ఎక్కువగా నమోదు
- టీడీపీ విజయంతో రూ.601.15లకు ఎగబాకిన షేరు ధర

11

# దేశంలో అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణం

## ప్రధాని మోడీ, అమిత్ షా పాత్ర ఉంది

- స్టాక్ మార్కెట్స్‌లో పెట్టుబడులు పెట్టాలన్నది వాళ్లే
- ఎగ్జిట్ పోల్స్‌కు, బీజేపీకి సంబంధం ఏంటి?
- ఈ స్కామ్‌పై జేపీసీ ఏర్పాటు చేయాలి
- బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు



2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 147 | ₹ 169 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹245 | ₹279 |



# గృహజ్యోతి స్కీమ్ మళ్లీ స్టార్ట్

- ఎన్నికల కోడ్ ముగియడంతో అమలు
- 200 యూనిట్ల లోపు విద్యుత్‌కు సున్నా బిల్లు
- ప్రకటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- గురువారం నుంచే దరఖాస్తుల స్వీకరణ

2

# కంగనాపై మహిళా కానిస్టేబుల్ దాడి

- చండీగఢ్ ఎయిర్ పోర్ట్‌లో చెంపదెబ్బ
- రైతులను, వారి ఉద్యమాన్ని అవమానించారనే..
- సీఐఎస్ఎఫ్ అధికారులకు బీజేపీ ఎంపీ ఫిర్యాదు
- సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ సస్పెండ్



2



# టెన్షన్.. టెన్షన్..!

## 48 గంటలుగా కొనసాగుతున్న కౌంటింగ్

- ఇంకా తేలని గ్రాడ్యుయేట్ ఉపఎన్నిక భవితవ్యం
- మొదటి ప్రాధాన్యత ఓట్లల్లో తేలని రిజల్ట్
- 18వేల ఓట్ల మెజార్టీలో తీన్మార్ మల్లన్న
- సెకండ్ ప్రయారిటీతో గెలుపోటములు ఖరారు
- నేడు మధ్యాహ్నానికి తేలే అవకాశం
- ఏకపక్షంగా ఓట్ల లెక్కింపు.. బీఆర్ఎస్ అభ్యర్థి అభ్యంతరం
- గోల్‌మాల్ చేసి గెలవాలనుకుంటున్నారా.. తీన్మార్ మల్లన్న

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:**

ఉమ్మడి వరంగల్‌ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు మొదటి ప్రాధాన్యత ఓట్లను నాలుగు రౌండ్లలో లెక్కించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నాలుగు రౌండ్లు ముగిసేసరికి 18వేల ఓట్ల మెజార్టీలో కొనసాగుతున్నారు. అయితే నాలుగు రౌండ్లు ముగిసినా.. మొదటి ప్రాధాన్యత ఓట్లలో 50 శాతానికి ఎవ్వరూ చేరుకోపోవడం గమనార్హం. దీంతో సెకండ్ ప్రయారిటీ ఓట్ల లెక్కింపును చేపట్టారు. అయితే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేందుకు శుక్రవారం మధ్యాహ్నం అయ్యే అవకాశం ఉంటుంది. ఇదిలా వుంటే.. రాష్ట్రంలో గత నెల 27న జరిగిన వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

మిగతా2లో...

## దేశంలో అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణం

విశ్వంభర, ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ నరేంద్ర మోదీ, అమిత్ షా ఇద్దరూ ఎన్నికల ప్రచార సమయంలో ఇన్వెస్టర్లకు ఎందుకు సలహా ఇచ్చారని, ఇదొక పెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణమని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో (జేపీసీ) విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ఐదు కోట్ల కుటుంబాలకు పెట్టుబడి సలహా ఎందుకు ఇచ్చారంటూ రాహుల్ గాంధీ సందేహాలు వ్యక్తం చేశారు. పెట్టుబడి సలహా ఇవ్వడం వారి పనా అని నిలదీశారు. సెబీ విచారణలో ఉన్న ఒక బిజినెస్ గ్రూపునకు చెందిన ఒకే మీడియా గ్రూపునకు ఇద్దరూ ఎందుకు ఇంటర్వ్యూలు ఇచ్చారని, స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేయడానికా అని రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు. బీజేపీకి ఎగ్జిట్ పోల్స్ సంబంధం ఏంటని, ఎన్నికల ఫలితాలు వెలువడడానికి ఒక రోజు ముందు పెద్ద ఎత్తున స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టిన విదేశీ నకిలీ ఇన్వెస్టర్లతో బీజేపీకి సంబంధం ఏంటని ప్రశ్నించారు. జీతాలపై ఆధారపడిన ఐదు కోట్ల మంది ఇన్వెస్టర్ల పెట్టుబడులతో వారు లాభపడ్డారని పేర్కొన్నారు. ఈ స్కామ్‌పై జేపీసీ ఏర్పాటు చేయాలని, ఇది స్కామ్ అని తాను భావిస్తున్నామని, భారతీయ రిటైల్ పెట్టుబడిదారుల సొమ్ముతో ఎవరో వేల కోట్ల రూపాయలు సంపాదించారని రాహుల్ ఆరోపించారు. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి ఇద్దరూ పెట్టుబడుల సలహా ఇచ్చారు కాబట్టి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం దేశీయ స్టాక్ మార్కెట్లు సరికొత్త గరిష్ఠాలను తాకుతాయని మే 23న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. జూన్ 4న బీజేపీ రికార్డు స్థాయి విజయం సాధిస్తుందని, స్టాక్ మార్కెట్ కూడా కొత్త రికార్డులను సృష్టిస్తుందని తాను నమ్మకంగా చెప్పగలనని అన్నారు.

## దేశంలోనే ధనిక ఎంపీలు తెలుగువాళ్లే..

**విశ్వంభర, హైదరాబాద్:** 2024 లోక్ సభ ఎన్నికలకు కొత్తగా ఎన్నికైన ఎంపీల్లో అత్యధిక ధనవంతులు ఎవరనే ఆసక్తి అందరిలోనూ ఉంది. అయితే ఈ అవకాశం మన తెలుగు వారికే దక్కింది. ఇద్దరు తెలుగు వాళ్లే టాప్ 1, 2 స్థానాల్లో ఉన్నారు. వారు ఎన్నికల కమిషన్ కు అందించిన వివరాల ప్రకారం..ఏపీలోని గుంటూరు ఎంపీగా గెలిచిన టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్ దేశంలోనే అత్యధిక తనవంతుడైన ఎంపీగా నిలిచారు. ఈయన తన ఆస్తులను రూ. 5,705 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించారు. ఈయన వృత్తిరీత్యా డాక్టర్. అయితే ఒక డాక్టర్ కు ఇన్ని వేల కోట్లు ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ఎవరికీ అర్థం కావట్లేదు. ఆయన పేరు మీద రూ.2వేల కోట్లు, భార్య పేరు మీద మరో రెండువేల కోట్లు, కొడుకు, కూతురు పేరు మీద కలిపి మరో వెయ్యి కోట్లు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఇక తెలంగాణలోని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర రెడ్డి రూ.4,568 కోట్లతో రెండో ధనిక ఎంపీగా నిలిచారు. ఆయన 2019 ఎన్నికల్లో అఫిడవిట్ లో తన ఆస్తులు రూ.895 కోట్లుగా చూపించారు. కానీ ఈ ఐదేళ్లలోనే ఆయన ఆస్తులు అమాంతం పెరిగిపోయాయి. ఇలా వీరిద్దరూ దేశంలోనే ధనవంతులైన ఎంపీలుగా రికార్డు నెలకొల్పారు.

## గృహజ్యోతి స్కీమ్ మళ్లీ స్టార్ట్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ముగిసింది.ఈ నేపథ్యంలో గృహ జ్యోతి పథకానికి అప్లై చేసుకున్న వారికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుభవార్త చెప్పారు. అర్హులైన వారికి గురువారం నుంచి గృహజ్యోతి స్కీమ్ కింద సున్నాబిల్లులు జారీకి నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. కోడ్ ముగియడంతో తిరిగి ప్రతి ఒక్కరికి సంక్షేమం అంటూ ఎక్స్(ట్విట్టర్) లో ట్వీట్ చేశారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు సున్నా బిల్లులను ప్రభుత్వం జారీ చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం అర్హులైన అందరికీ సంక్షేమం అందించనుందని తెలిపారు. కాగా ఇంటి అవసరాల నిమిత్తం 200 యూనిట్లకంటే తక్కువ కరెంటు వాడుకునే వారికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ స్కీమ్ ను రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఫిబ్రవరి 27న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, రంగారెడ్డి జిల్లాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఈ పథకం అమలు కాలేదు. ఇక నేటితో కోడ్ ముగియడంతో నేటి నుంచి సున్నా బిల్లులు జారీ చేస్తామని మంత్రి ప్రకటించారు.

## ఆరు నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత..: కిషన్ రెడ్డి



**విశ్వంభర, ఢిల్లీ:** తెలంగాణలో బీజేపీ 8 సీట్లు సాధించడంతో.. ఆ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని.. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారాలు చేసిందని విమర్శలు చేశారు. ' లోక్‌సభ ఎన్నికల్లో 47 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువ ఓట్లు వచ్చాయి. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పోటీ చేయలేదు. ఎంఐఎం పార్టీ పోటీ చేసింది. ఆరు నెలల్లో కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత ప్రారంభమైంది. బీజేపీకి తెలంగాణ ప్రజలు 35 శాతానికి పైగా ఓట్లు వేసి ఎక్కువ స్థానాల్లో గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేవలం ఒక్క శాతం మాత్రమే ఓటింగ్ పెరిగింది. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రాలేవు. గత ఎన్నికల్లో రేవంత్ గెలిచిన మల్కాజ్‌గిరిలో కూడా మేము గెలిచాం. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిద్దపేట ఉన్న మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలో కూడా గెలిచాం. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌పై అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎలా అమలుచేస్తారో బీజేపీ ప్రశ్నిస్తోంది. అమిత్ షా పై తప్పుడు కేసు పెట్టారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తామని' కిషన్ రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన మహారాష్ట్ర సంగ్లీ లోక్‌సభ స్వతంత్ర ఎంపీ

**విశ్వంభర, ఢిల్లీ :** రోజులు గడుస్తున్నా కొద్దీ దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు రసవతారంగా మారుతున్నాయి.కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కొద్ది మంది సభ్యులు మాత్రమే తక్కువగా ఉండటంతో..ఆ సభ్యులను భర్తీ చేసేందుకు చేరికలను ప్రోత్సహిస్తోంది. తాజాగా మహారాష్ట్ర సంగ్లీ లోక్‌సభ స్వతంత్ర ఎంపీ విశాల్ ప్రకాష్‌బాబు పాటిల్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమక్షంలో ఎంపీ విశాల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. విశాల్ చేరికతో కాంగ్రెస్ ఎంపీల సంఖ్య 100కు చేరింది.ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 99 ఎంపీ స్థానాల్లో గెలుపొందింది. ఇండియా కూటమి మొత్తం కలిపి 232 లోక్ సభ స్థానాల్లో గెలిచింది. అధికారం చేపట్టాలంటే 272 సీట్లు అవసరం. అయితే, ఆ మేజిక్ ఫిగర్‌కు ఇంకా 40 సీట్లు అవసరం. ఇప్పుడు ఒక ఎంపీ చేరడంతో క్రమంగా కాంగ్రెస్ బలం పెరుగుతోంది. మరికొంత మంది ఎంపీలు కూడా చేరే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి.

# చట్టసభల్లోకి క్రిమినల్స్

(మొదటి పేజీ తరువాయి)

15 మంది ఎంపీలు ఐపీఎస్ సెక్షన్ 376 కింద అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మరో నలుగురిపై కిడ్నాప్‌కు సంబంధించిన కేసులున్నాయి. 43 మందిపై ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన కేసులున్నాయని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో క్రిమినల్ కేసులున్న అభ్యర్థికి గెలిచే అవకాశాలు 15.3 శాతం ఉండగా..ఎలాంటి నేరారోపణలు లేని అభ్యర్థులు కేవలం 4.4 శాతం మాత్రమేనని విశ్లేషణలో తేలింది.

**ఏ రాజకీయ పార్టీ వాటా ఎంత..?**

18వ లోక్‌సభకు బీజేపీ తరుపున 240 మంది గెలిచారు. దీంతో ఆ పార్టీ దేశంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఇప్పుడు గెలిచిన బీజేపీ అభ్యర్థుల్లో 94 మందిపై(39 శాతం) క్రిమినల్ కేసులున్నాయి. అలాగే కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన 99 మంది అభ్యర్థుల్లో 49 మంది (49 శాతం) క్రిమినల్ కేసులున్నాయి. సమాజ్ వాదీ పార్టీకి చెందిన 37 మంది అభ్యర్థుల్లో 21 మంది (45శాతం),టీఎంసీకి చెందిన 29 మందిలో



13 మంది (45 శాతం), డీఎంకేకు చెందిన 22 మందిలో 13 మంది (59 శాతం), టీడీపీకి చెందిన 16 మందిలో ఎనిమిది మంది (50 శాతం), శివసేన ఏడుగురు గెలిచిన అభ్యర్థుల్లో ఐదుగురు (71 శాతం) పై నేరారోపణలున్నాయి. తీవ్రమైన కేసులున్న వారిలో 63 మంది (26 శాతం) బీజేపీ అభ్యర్థులు కాగా, 32 (32 శాతం) మంది కాంగ్రెస్ అభ్యర్థులు,17 మంది (46 శాతం) ఎస్పి అభ్యర్థులు ఉన్నట్లు విశ్లేషణలో తేలింది. అలాగే ఏడుగురు (24 శాతం) టీఎంసీ అభ్యర్థులు, ఆరుగురు (27 శాతం) డీఎంకే అభ్యర్థులు, ఐదుగురు (31 శాతం) టీడీపీ అభ్యర్థులు, నలుగురు (57 శాతం) శివసేన అభ్యర్థులు తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

### కొత్త ఎంపీల్లో 19 శాతం మంది చదివింది 5వ నుంచి 12వ తరగతే

లోక్‌సభ ఎన్నికల తాజాగా గెలిచిన ఎంపీల విద్యార్హత వివరాలను ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్) రిపోర్ట్ వెల్లడించింది. మొత్తం 543 మంది ఎంపీలు లోక్‌సభలో అడుగుపెట్టనుండగా.. అందులో 19 శాతం (105) మంది 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు మాత్రమే చదివారని నివేదిక తెలిపింది. ఇద్దరు 5వ తరగతి వరకు, నలుగురు 8వ తరగతి వరకు, 34 మంది 10వ తరగతి వరకు, 25 మంది 12వ తరగతి వరకు చదువుకున్నారని తెలిపింది. ఇక 420 మంది (77 శాతం) గ్రాడ్యుయేషన్ లేదా అంతకంటే ఎక్కువ చదువుకున్నారని పేర్కొంది. నూతన ఎంపీల్లో 17 మంది డిప్లొమా చేశారని, ఒక ఎంపీ కొద్దిపాటి అక్షరాస్యుడు మాత్రమేనని ఏడీఆర్ రిపోర్ట్ వివరించింది. కాగా లోక్‌సభ ఎన్నికలలో మొత్తం 121 మంది నిరక్షరాస్యులు పోటీ చేయగా వారందరూ ఓటమి పాలయ్యారు.కాగా పీఆర్ఎస్ అనే మేధో సంస్థ లెజిస్లేటివ్ రీసెర్చ్ రిపోర్ట్ ప్రకారం.. కొత్తగా గెలిచిన ఎంపీలకు వ్యవసాయం, సామాజిక సేవ సాధారణ వృత్తులుగా ఉన్నాయని విశ్లేషించింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ ఎంపీల్లో 91 శాతం, మధ్యప్రదేశ్ ఎంపీల్లో 72 శాతం, గుజరాత్ నుంచి గెలిచిన ఎంపీల్లో 65 శాతం మందికి వారి వృత్తుల్లో వ్యవసాయం ఒకటిగా ఉందని రిపోర్ట్ పేర్కొంది. ఇక ఎంపీలలో 7 శాతం మంది లాయర్లు, 4 శాతం మంది వైద్యులు ఉన్నారని వివరించింది.

# టెన్షన్.. టెన్షన్..!

(మొదటి పేజీ తరువాయి)

మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఇప్పటి వరకు నాలుగు రౌండ్లు పూర్తయ్యాయి. ఈ నాలుగు రౌండ్ల పూర్తయిన తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అయితే మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవ్వరికీ మెజార్టీ దక్కకపోవడంతో సెకండ్ ప్రయారిటీ ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

**ఫస్ట్ ప్రయారిటీతో తేలని భవితవ్యం..**

ఉమ్మడి నల్లగొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసింది. కానీ ఏ అభ్యర్థికి 50 శాతం ఓట్లు రాకపోవడంతో అధికారులు సెకండ్ ప్రయారిటీ ఓట్ల కౌంటింగ్ చేస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి 1,04,248 ఓట్లు, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి 43,313 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్‌కు 29,697 ఓట్లు వచ్చాయి. నాలుగు రౌండ్లు పూర్తి అయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 18,565 ఓట్లు మెజార్టీతో ఉన్నారు. అయితే గెలుపు కోటాకు కావాల్సిన 1,55,095 ఓట్లు ఎవ్వరికీ రాలేదు. ప్రస్తుతం అధికారులు రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తున్నారు. కాగా రెండో ప్రాధాన్యత ఓట్లు పూర్తయ్యేసరికి గెలుపోటములు దాదాపు ఖరారు అవుతాయి. ఈ ప్రక్రియ శనివారం సాయంత్రానికి పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.



### కౌంటింగ్‌పై బీఆర్ఎస్ అభ్యంతరం

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు ఏకపక్షంగా జరుగుతోందని, అవకతవకలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి ఆరోపించారు. కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలు లేకుండానే లీడ్ ప్రకటించారని, సందేహాలు నివృత్తి చేయకుండా ఆర్ఓలు ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడం లేదని, ఇదేంటని అడిగితే పోలీసులు బయటకు నెట్టారని, దాదాపు వెయ్యి ఓట్లు గోల్‌మాల్ అయ్యాయని ఆక్షేపించారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఖండించారు. అధికారుల పనితీరుపై బీఆర్ఎస్ నేతలు అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఓట్ల లెక్కింపు ఫలితాలు ఆ పార్టీ నేతలకే ముందుగా తెలుస్తున్నాయని చెప్పారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి గెలవాలని కేటీఆర్ ప్రయత్నించారని ఆరోపించారు. గతంలో మాదిరి గోల్‌మాల్ చేసి గెలవాలనుకుంటున్నారని విమర్శించారు. ఓటమి భయంతోనే ప్రస్తుతం అధికారులపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని చూస్తే.. ఓటమిని ముందుగానే అంగీకరించినట్లు తెలుస్తోందన్నారు.





## హైదరాబాద్‌లో చేప మందు ప్రసాదం పంపిణీకి విస్తృత ఏర్పాట్లు

హైదరాబాద్‌లో చాలా సంవత్సరాలుగా ఆస్తమాతో సహా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి చేప మందును పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా చేప మందు ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేసేందుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. మృగశిరకార్తె ప్రారంభం కానున్నందున ఈనెల 8వ తేదీ నుంచి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపల ప్రసాదం పంపిణీ చేయనున్నారు. బత్తిన కుటుంబీకుల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఈ మందు దివ్యౌషదంలా పనిచేస్తుందని తెలుగు రాష్ట్రాల ప్రజల విశ్వాసం. దీంతో తెలంగాణ, ఏపీతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివస్తుంటారు. ఈ మేరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వాహకులు కౌంటర్లు ఏర్పాటు చేసి సీక్వెన్షియల్ ఆర్డర్‌లో ఈ మందును అందజేసే విధంగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## పవన్, లోకేష్ మంత్రి పదవులు చేపట్టరా..?

- ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలని పవన్ భావిస్తున్నారా..
- పార్టీ కార్యక్రమాలు చూడనున్న లోకేష్..?



**విశ్వంభర, విశాఖపట్నం :** ఏపీలో ఇప్పుడు కూటమి తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. అయితే కూటమిలో టీడీపీ సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ ను క్రాస్ చేసింది. కాబట్టి జన సేన, బీజేపీ అవసరం లేకున్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. కానీ ఈ మూడు పార్టీలు కలిసే ఉన్నాయి. అయితే అటు టీడీపీలో కీలక నేతగా లోకేష్, ఇటు జన సేనలో పవన్ ఉన్నారు. వీరిద్దరి మీదనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. రేపటి రాజకీయాలు వీరిద్దరి చుట్టే తిరగబోతున్నాయి. అయితే వీరిద్దరూ కచ్చితంగా మంత్రి పదవులు తీసుకుంటారిన అంతా అనుకున్నారు. కానీ తీరా చూస్తే వీరిద్దరూ వాటికి దూరంగా ఉండనున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే మొన్న పవన కల్యాణ్ మాట్లాడుతూ.. తాను బాధ్యతగల ప్రతిపక్ష హోదాలో ఉంటానని చెప్పడం గమనార్హం. వైసీపీకి ప్రతిపక్ష హోదా రాలేదు కాబట్టి.. ఆ బాధ్యతను జన సేన తీసుకుంటే.. భవిష్యత్ లో పార్టీ బలంగా మారుతుందని పవన్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అటు లోకేష్ విషయానికి వస్తే.. ఆయన పార్టీలో ఇంకా పట్టు పెంచుకోవడం కోసం ప్రభుత్వంలో కాకుండా పార్టీ కార్యక్రమాలను చూసుకోవాలని భావిస్తున్నారంట. ఈ కారణాల వల్ల వీరిద్దరూ ప్రభుత్వంలో ఉండరని ప్రచారం జరుగుతోంది. చూడాలి ఏం జరుగుతుందో.

# కంగనాపై మహిళా కానిస్టేబుల్ దాడి

**విశ్వంభర, ఢిల్లీ:**

ఎంపీగా గెలిచిన ఆనందం బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు ఎక్కువ సేపు నిలవలేదు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన కంగనా రనౌత్‌కు ఎయిర్ పోర్ట్‌లో చేదు అనుభవం ఎదురైంది. చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ ఆమెను చెంపదెబ్బ కొట్టారు. గురువారం ఢిల్లీ వెళ్లాల్సిన విమానం కోసం కంగనా వేచిచూస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. రైతు చట్టాలకు వ్యతిరేకంగా 15 నెలల పాటు కొనసాగిన ఉద్యమాన్ని, రైతులను అగౌరవ పరిచారంటూ కుల్విందర్ కౌర్ అనే సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కంగనాతో తీవ్ర వాగ్వాదానికి దిగిందని, ఆ ఆవేశంలో ఆమె చెంపపై కొట్టినట్టు తెలుస్తోంది. ఈ అనూహ్య పరిణామంతో షాక్‌కు గురైన కంగనా అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లాక సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నీనా సింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చండీగడ్ ఎయిర్‌పోర్టులోని నిషేధిత ప్రదేశంలో ఉన్న సమయంలో తనపై కానిస్టేబుల్ చేయి చేసుకున్నట్టు కంగనా ఆరోపించారు. దీంతో నిందిత కానిస్టేబుల్‌ను కమాండింగ్ ఆఫీసర్ గదిలో





విచారించడంతోపాటు చండీగడ్ విమానాశ్రయంలో ఘటన జరిగిన ప్రదేశంలోని సీసీ ఫుటేజీలను అధికారులు పరిశీలించి మహిళా కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారి తెలిపారు.

**'నేను క్షేమంగానే ఉన్నా'**

ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా కంగన స్పందించారు. తాను బాగానే ఉన్నట్లు పేర్కొంటూ ఓ వీడియోను విడుదల చేశారు. సెక్యూరిటీ చెకింగ్ వద్ద ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. సెక్యూరిటీ చెకింగ్ పూర్తయి పాస్ కోసం వేచి చూస్తుండగా మహిళా ఆఫీసర్ తన వైపు వచ్చి కొట్టినట్లు తెలిపారు. తనను దూషించారని కూడా చెప్పారు. ఎందుకిలా చేశారని అడగ్గా, రైతులకు మద్దతుదారని ఆమె చెప్పినట్లు కంగన వెల్లడించారు. తాను క్షేమంగానే ఉన్నానని కాకపోతే పంజాబ్‌లో ఉగ్రవాదం, హింసను ఎలా ఎదర్కోవాలనే అంశంపైనే ఆందోళనగా ఉందన్నారు.

# జేడీయూ నుంచి బీజేపీ కోర్కెల చిట్టా!

**విశ్వంభర, పాట్నా:**

కేంద్రంలో మూడోసారి టీడీపీ, జేడీయూ మద్దతుతో ఏర్పాటు చేయబోతున్న బీజేపీకి బిహార్ సీఎం నీతీశ్ కుమార్ పార్టీ నుంచి అప్పుడే భారీ డిమాండ్లు మొదలయ్యాయి! అగ్నిపథ్ పథకాన్ని సమీక్షించాలని జేడీయూ నేత కేసీ త్యాగి అన్నారు. ఆ స్కీమ్‌ను చాలా మంది వ్యతిరేకించారని చెప్పారు. ఎన్నికల్లో దాని ప్రభావం పడిందని తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో కేసీ త్యాగి ఈ వ్యాఖ్యలు చేశారు. "అగ్నివీర్ పథకంపై ప్రజలకు అభ్యంతరాలు ఉన్నాయి. ఈ స్కీమ్‌ను తీసుకొచ్చినప్పుడే సాయుధ దళాలకు చెందిన కుటుంబాలు వ్యతిరేకించాయి. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల వేళ ఆయా కుటుంబాలు నిరసనలు తెలియజేశారు" అని త్యాగి గుర్తు చేశారు. యూనిఫాం సివిల్ కోడ్‌కు జేడీయూ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కానీ వివిధ పార్టీల నేతలను సంప్రదించి తీర్మానం చేయాలని కోరారు. దీంతో పాటు బిహార్‌కు ప్రత్యేక హోదా, దేశవ్యాప్త కులగణన వంటి అంశాలపైనా జేడీయూ తన డిమాండ్లను బీజేపీ అధిష్ఠానం ముందు ఉంచినట్లు సమాచారం.

**మోదీ కూడా వ్యతిరేకించలేదు!**

దేశంలోని ఏ పార్టీ కూడా కులగణనను వ్యతిరేకించలేదని కేసీ త్యాగి తెలిపారు. ఈ విషయంలో బిహార్ అన్ని రాష్ట్రాలకు మార్గం చూపిందని చెప్పారు. ప్రధాని కూడా వ్యతిరేకించలేదని, కులగణన అవసరమని వెల్లడించారు. దానిని భవిష్యత్తులో ముందుకు తీసుకెళ్తామని పరోక్షంగా తెలిపారు. బిహార్‌కు ప్రత్యేక హోదా దక్కాలనేది తమ హృదయాల్లో ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు.



## నూజివీడు నడిరోడ్డుపై కత్తులతో దాడి చేసుకున్న రౌడీ షీటర్లు

**విశ్వంభర, నూజివీడు జూన్ 06:** ఏలూరు జిల్లా నూజివీడు పెద్దగాంధీ బొమ్మ సెంటర్ లో పాతకక్షల నేపథ్యంలో కత్తులతో ఇద్దరు యువకులు నడికుదురు గిరీష్, నూకాల కిరణ్ దాడి చేసుకున్నారు. నడిరోడ్డుపై పరుగులు పెట్టుకుంటూ కత్తులతో పొడుచుకున్న రౌడీ షీటర్లను చూసి స్థానిక ప్రజలు, వాహనదారులు భయాబ్రాంతులకు గురయ్యారు. సినిమా షూటింగ్ తరహాలో రెచ్చిపోయి, రౌడీ షీటర్స్ పోలీసుల కంటి ముందే నరుకున్నారు. దాడిలో తీవ్ర కత్తిపోట్లకు గురైన రౌడీ షీటర్లు గిరీష్, కిరణ్ లను పోలీసులు ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లోక్ సభ ఫలితాలపై ఆత్మపరిశీలన చేసుకో రేవంత్ : ఎంపీ లక్ష్మణ్



**విశ్వంభర, హైదరాబాద్:** లోక్ సభ ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆత్మ పరిశీలన చేసుకోవాలని రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. తాము ఎవరి దయా దాక్షిణ్యాలపై గెలవలేదని, ప్రధాని మోడీపై ఉన్న నమ్మకంతో ప్రజలు తమ అభ్యర్థులను గెలిపించి లోక్ సభకు పంపారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అటకెక్కించినందునే కాంగ్రెస్ ను జనం ఛీ కొట్టారని అన్నారు. మరో ఆరు నెలల్లో హస్తం పార్టీపై ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయమని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికే చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవినీతిపై ఏ కాంగ్రెస్ నాయకుడు మాట్లాడటం లేదని ఆయన మండిపడ్డారు. చీకటి ఒప్పందానికి పాల్పడింది ఎవరో ఇక్కడే తెలిసిపోతోందని అన్నారు. చరిత్రలో ఇప్పటి వరకు బీఆర్ఎస్ బీజేపీ పొత్తు పెట్టుకోలేదని.. ఇక మీదట కూడా పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దొంగే దొంగ అన్నట్లుగా ఉన్నాయని, చావుతప్పి కన్ను లొట్టపోయినట్లుగా ఆ పార్టీకి సీట్లు వచ్చాయని అన్నారు.

## సీఐడీ, సిట్ ఆఫీసులు సీజ్




**విశ్వంభర, విజయవాడ:** ఏపీ ఫైబర్ ఆఫీస్‌ను విజయవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ బయటకు పంపించి ఆఫీస్‌ను సీజ్ చేశారు. మరోవైపు తాడేపల్లిలో సీఐడీ సిట్ ఆఫీస్‌ను సైతం అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వం మారుతున్న సమయంలో సిట్ ఆఫీస్‌ను సీజ్ చేయాలని గవర్నర్ ఆదేశాల్లో భాగంగానే కార్యాలయానికి తాళాలు వేశారు. ఇప్పటికే చీఫ్ సెక్రటరీలు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు, విభాగాధిపతి ఆఫీస్‌లలో డాక్యుమెంట్లను భద్రపరచాలని గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి సీఐడీ పోలీసులు ఇక్కడే విచారించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ కంపెనీ డాక్యుమెంట్లను సిట్ పోలీసులు దహనం చేశారు. చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించేందుకే తప్పుడు డాక్యుమెంట్లను సిద్ధం చేశారని దీనిపై టీడీపీ నేతలు ఆరోపించారు. సిట్ ఆఫీస్ సమీపంలో హెరిటేజ్ డాక్యుమెంట్లు దహనం చేయడంపై అప్పట్లో గవర్నర్ నజీర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

## నరసింహ స్వామి ఆశీస్సులతో మంగళగిరిని నంబర్ 1గా నిలుపుతా: నారా లోకేశ్



**విశ్వంభర, మంగళగిరి:** నరసింహ స్వామి చల్లని ఆశీస్సులతో మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ 1గా నిలబెడతానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. గురువారం ఆయన తన భార్య నారా బ్రాహ్మణితో కలిసి మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు కూడా పాల్గొన్నాయి. కాగా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలో రికార్డు స్థాయి మెజారిటీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. మంగళగిరిలో 72 ఏళ్ల ఎన్నికల చరిత్రలో తిరుగులేని మెజారిటీ సాధించారు. తన ప్రత్యర్థి మురుగుడు లావణ్యపై ఏకంగా 91,413 ఓట్ల మెజారిటీతో గెలిచారు. దీంతో 1952లో మంగళగిరి నియోజకవర్గానికి జరిగిన తొలి ఎన్నిక నాటి నుంచి ఇప్పటివరకూ అత్యధిక మెజారిటీ సాధించిన ఎమ్మెల్యేగా ఆయన నిలిచారు.



# 9న గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షలు

- ఏర్పాట్లపై సీఎస్ శాంతకుమారి సమీక్ష
- 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 4.03 లక్షల మంది విద్యార్థులు



**హైదరాబాద్, జూన్ 06:** ఈ నెల 9న నిర్వహించనున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షల ఏర్పాట్ల పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో విత్తనాలు, ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ, గ్రామాల్లో ఇంటింటి సర్వే, జిల్లాల్లో పాఠశాలలకు స్కూల్ యూనిఫాంల పంపిణీ తదితర అంశాలను కూడా సీఎస్ ప్రస్తావించారు. రాష్ట్రంలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి తెలిపారు. 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 4.03 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్లతో పాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని కూడా నోడల్ ఆఫీసర్ గా నియమించినట్లు చెప్పారు. ప్రతి 20 కేంద్రాలకు ఒక రీజినల్ కోఆర్డనేటర్ను కూడా నియమించినట్లు తెలిపారు. బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ఏదైనా సమస్య తలెత్తితే తగిన సంఖ్యలో బయోమెట్రిక్ పరికరాలను కూడా అందుబాటులో ఉంచామన్నారు.జిల్లా కలెక్టర్లకు కూడా పరీక్షల ఏర్పాట్ల పై తగు ఆదేశాలు జారీ చేశామని, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయిందని సి.ఎస్ తెలిపారు. గ్రూప్1 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పరిస్థితిని నిశితంగా పరిశీలించేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసు, ఇతర అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

**కలెక్టర్లకు సీఎస్ అభినందనలు**

బ్లాక్ మార్కెటింగ్, విత్తనాల నిల్వలను అరికట్టడంలో సమర్థవంతమైన చర్యలు తీసుకున్నందుకు జిల్లాల కలెక్టర్లను సి.ఎస్ అభినందించారు, రాబోయే మూడు వారాల పాటు ఇదే నిఘా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ప్యాక్ చేసిన విత్తనాలను కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు సీజన్ ముగిసే వరకు విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను భద్ర పరుచుకునేలా చూడాలని తద్వారా అవసరమైతే నష్ట పరిహారం క్లెయిమ్ చేసుకునేందుకు వీలవుతుందని సి.ఎస్ సూచించారు. కేంద్ర గోడౌన్ల నుంచి మండల స్థాయి వరకు ఎరువుల తరలింపును పర్యవేక్షించి సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్లను సి.ఎస్ ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, దుకాణాల్లో నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆమె కోరారు.

### ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే విషయాన్ని నిర్ణీత గడువులోగా సర్వే చేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభించే నాటికి ఒక జత స్కూల్ యూనిఫాం విద్యార్థులకు అందేలా చూడాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు. మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ దివ్య, టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్, ఇతర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. డీజీపీ రవిగుప్తా, ఇతర పోలీసు అధికారులు పోలీస్ అకాడమీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో భారీ వర్షం

- ఒక్కసారిగా మారిన వాతావరణం
- రోడ్లపై నిలిచిపోయిన వాహనాలు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈ రోజు పూర్తిగా రుతుపవనాలు తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చాయి. దాంతో రాష్ట్రంలో పలు చోట్ల ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాజధాని హైదరాబాద్ లో ఒక్కసారిగా కుండపోత వర్షం మొదలైంది. నగరంలోని చాలా చోట్ల వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం సమయంలో వర్షం పడటంతో రోడ్లపై నీళ్లు నిలిచిపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే వారికి ఇబ్బందులు తప్పలేదు. అమీన్‌పూర్, కిష్టారెడ్డి పేట, కూకట్ పల్లి, లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. అటు వనస్థలిపురం, ఎల్బీనగర్, నాగోల్, ఉప్పల్, సరూర్ నగర్ లో భారీగానే వర్షం పడింది. సికింద్రాబాద్, హైదరాబాద్ వ్యాప్తంగా శుక్రవారం కూడా వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.



## గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి

- దెబ్బతిన్న రోడ్లను నాణ్యతతో మరమ్మతులు
- అన్ని వసతులతో మౌళిక సదుపాయాలు
- నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- సచివాలయంలో అధికారుల సమీక్షలో మంత్రి సీతక్క

**విశ్వంభర, హైదరాబాద్:** సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధుల ఉపయోగించి గ్రామీణా రహదారుల అభివృద్ధి కోసం కృషి చేయాలని మంత్రి సీతక్క కోరారు. పంచాయతీలు, గ్రామీణ స్థానిక సంస్థలలో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశాలించారు. పంచాయతీరాజ్ శాఖపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క గ్రామీణ రహదారుల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల మౌలిక సదుపాయాల కోసం కొత్త పనులను ప్రతిపాదనలు పంపాలని కోరారు. పంచాయతీల్లో ఇప్పటికే పాడైన రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం వంటి అంశాలపై అంచనాలు తయారు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల్లో నాణ్యత పెంచే విధంగా తీసుకోవాలని త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయితీ రాజ్ ఇఎన్‌సి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గర్వంగా ఉంది.. అకీరా, పవన్ ఫొటోపై రేణూ దేశాయ్ ఎమోషనల్..!

- నరేంద్రమోడీని కలిసిన పవన్, అకీరా
- తాను బీజేపీ వ్యక్తినే అంటున్న రేణూ దేశాయ్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఏపీలో కూటమి అధికారంలోకి రావడంతో అందరి చూపు ఇప్పుడు పవన్ కల్యాణ్ మీదనే ఉంది. అయితే పవన్ కల్యాణ్ కూడా తాను ఎక్కడకు వెళ్తే అక్కడకు తన కొడుకు అకీరా నందన్ ను తీసుకెళ్తున్నారు. మొన్న చంద్రబాబు నాయుడును కలిసినప్పుడు, ఆ తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఇంటికి వెళ్లినప్పుడు కూడా అకీరా వెంట ఉన్నాడు. ఇక తాజాగా గురువారం సాయంత్రం పవన్ కల్యాణ్ తన కొడుకు అకీరా, భార్య అన్నా లెజినోవాతో కలిసి కాబోయే ప్రధాని నరేంద్రమోడీని కలిశారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేశాయి. దాంతో రేణూ దేశాయ్ కూడా ఎమోషనల్ పోస్ట్ చేశారు. నేను మొదటి నుంచి బీజేపీ వ్యక్తిని. నాకు ప్రధాని మోడీ అంటే ఎంతోఇష్టం. ఆయన్ను ఎప్పటి నుంచో కలవాలని అనుకున్నాను. కానీ ఈ రోజు నా కొడుకు అకీరానందన్ మోడీ పక్కన ఉండటం చూస్తే గర్వంగా ఉంది. మోడీని కలిసిన తర్వాత అకీరా నాకు ఫోన్ చేశాడు. మోడీలో మ్యాజిక్ ఉందని.. ఆయన చుట్టూ పాజిటివ్ ఎనర్జీ ఉంటుందని.. అందుకే ఆయన స్ట్రాంగ్ లీడర్ గా ఉన్నారని అకీరా చెప్పాడు. నాకు చాలా ఆనందంగా ఉంది అంటూ రేణూ దేశాయ్ ఎమోషనల్ పోస్ట్ చేసింది.



# సికింద్రాబాద్‌లో కారు పల్టీలు

**హైదరాబాద్, జూన్ 6:**

సికింద్రాబాద్‌లోని జేబీఎస్ సిగ్నల్ వద్ద గురువారం (జూన్ 6) ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేసేందుకు యత్నించిన కారు మరో కారును ఢీకొట్టింది. అనంతరం రోడ్డుపై పల్టీలు కొట్టుకుంటూ తిరగబడింది. కంటోన్మెంట్ సికింద్రాబాద్ క్లబ్ వద్ద ఈ రెండు కార్లు ఢీకొన్నాయి. అసలేం జరిగిందంటే.. గురువారం ఉదయం సికింద్రాబాద్ క్లబ్ వద్ద సిగ్నల్ పడిన సమయంలో రోడ్డు దాటుతున్న నల్లని కియా కారెన్స్ కారు.. మరోవైపు నుంచి అడ్డుగా వచ్చిన మరో తెల్లని టొయోటా ఇన్నోవా కారును వేగంగా ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన కియా కారు రోడ్డుపై మూడు సార్లు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదానికి సంబంధించిన సీసీ ఫుటేజీ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్, స్థానికులు హుటాహుటిన కారులో చిక్కుకున్న వారిని రక్షించి సురక్షితంగా బయటకు తీశారు. ప్రమాదానికి గురైన కారులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రాణనష్టం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గాయాలపాలైన డ్రైవర్‌తోపాటు కారులోని ఇతర ప్రయాణికులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.



# హస్తిన బాట పట్టిన తెలంగాణ బీజేపీ ఎంపీలు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు ఢిల్లీకి పయనమయ్యారు. డీకే అరుణ, కొండా విశ్వేశ్వరరెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన రావు, నగేష్, ధర్మపురి అర్వింద్ గురువారం ఢిల్లీ వెళ్లారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇప్పటికే ఢిల్లీలో ఉన్నారు. రేపు ఉదయం 11 గంటలకు ఢిల్లీలో జరిగే బీజేపీ ఎంపీల సమావేశానికి వీరు హాజరవుతారు. అనంతరం సంవిధాన్ భవన్ సెంట్రల్ హాల్ లో ఎన్డీఏ పక్ష ఎంపీల సమావేశంలో పాల్గొంటారు. ఇదే సమావేశానికి బీజేపీ జాతీయ పదాధికారులు కూడా హాజరవుతారు. రేపు ఉదయానికి పార్టీ జాతీయ పదాధికారులు అంతా ఢిల్లీ చేరుకోవాలని ఇప్పటికే పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం పంపించారు.



**నేను ఎప్పుడూ రేసులో ఉండను: డాక్టర్ కె. లక్ష్మణ్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తను ఏ బాధ్యత ఇచ్చిన నిర్వహిస్తానని బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ తెలిపారు. కేంద్రమంత్రి రేసులో ఉన్నారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. పార్టీ ఏది ఆదేశిస్తే అది నిర్వహిస్తా. నేను ఎప్పుడూ రేసులో ఉండను. ఎవరికీ ఏం ఇవ్వాలనేది పార్టీ నిర్ణయమని సమాధానమిచ్చారు.

# మోదీ సంకీర్ణం ఎలా నడుపుతారు?

"2024 ఎన్నికలు దేశ చరిత్రలో చాలా విచిత్రమైనవి. దేశస్థాయిలో మోదీ నాయకత్వంలోని బీజేపీని సంకీర్ణంలోకి నెట్టాయి. నరేంద్రమోదీ తన జీవిత కాలంలో మొదటిసారిగా సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించబోతున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 3 సార్లు పూర్తి మెజారిటీతో అధికారం అనుభవించి, కేంద్రంలో 2014, 2019లో బీజేపీ 272 పైచిలుకు సీట్ల సంపూర్ణ మెజారిటీతో అధికారం అనుభవించిన మోదీ, సంకీర్ణం ఎలా నడుపుతారు అనేది చాలా మంది మదిలే మెదిలే ప్రశ్న.

2024 ఎన్నికలు దేశ చరిత్రలో చాలా విచిత్రమైనవి
మోదీ నాయకత్వంలోని బీజేపీని సంకీర్ణంలోకి నెట్టాయి
సంపూర్ణ మెజారిటీతో అధికారం అనుభవించిన
మోదీ, సంకీర్ణం ఎలా నడుపుతారు
పరిస్థితులు మారడం కాదు, పరిస్థితి మారినందు వల్ల తాను మారాలి
లోక్ సభ ఫలితాలలో కొత్త ఏమీ లేదు.. కొనసాగింపు మాత్రమే.
ఎన్డీఏ సంకీర్ణం ప్రభుత్వంలో చక్రం తిప్పనున్న చంద్రబాబు



ఇండియా కూటమి మోదీకి వ్యతిరేకంగా పోరాడినా, విజయం అంచులదాకా వెళ్ళలేక పోయింది. మోదీని మాత్రం నిలువరించగలిగింది. ఇంతా చేసి జరిగింది ఏమి లేదు. ఆయనే మళ్ళీ ప్రధాని అవుతున్నారు. కాకపోతే మునుపటిలాగా ఉండలేరు. బహుశా కొంత ఒదిగి ఉండాలి. అదుపులో ఉంటారు. అరువు రెక్కలతో మాత్రమే ఎగురుతారు. నవ్వుతూ మాట్లాడతారు. ముఖంలోకి ప్రసన్నత తెచ్చుకుంటారు. ఆయనలో మార్పు వచ్చి పరిస్థితులు మారడం కాదు, పరిస్థితి మారినందు వల్ల తాను మారాల్సి వస్తోంది.

ఎవరు అధికారంలోకి వస్తున్నారు అన్నదే ముఖ్యం అనుకుంటే ఈ లోక్ సభ ఫలితాలలో కొత్త ఏమీ లేదు. కొనసాగింపు మాత్రమే. ఇది ముచ్చటగా మూడోసారి నెహ్రూ తర్వాత నరేంద్ర మోదీ చరిత్ర పుటల్లో నిలవనున్నారు. ఫలితాల సారాంశం చూస్తే ఏకపక్షం నుంచి తిరిగి సంకీర్ణం తీవ్ర జాతీయ వాదానికి, కర్కశ నిర్బంధ విధానాలకు ప్రత్యర్థుల వేధింపులకు విరామానికి ఆస్కారం ఉంటుందని ప్రజాస్వామ్య వాదులు ఆనంద పడుతున్నారు.

**10 ఏళ్ల తర్వాత సంకీర్ణ యుగం:**

మనం చరిత్రలోకి తొంగి చూసినట్లయితే 1984లో రాజీవ్ గాంధీ అపూర్వ విజయం. 400 పై చిలుకు స్థానాల్లో విజయం సాధించాక మళ్ళీ అలాంటి విజయం బీజేపీకి 303 వరకు మాత్రమే తెచ్చుకోగలిగారు. 400 పై చిలుకు నినాదంతో వచ్చిన బీజేపి ఈ ఎన్నికల్లో చతికిలపడి 240 స్థానాలకే పరిమితమైంది. 1989లో జరిగిన ఎన్నికల్లో రాజీవ్ గాంధీకి వ్యతిరేకంగా కాంగ్రెసేతర పార్టీలన్నీ ఏకమై రాజీవ్ గాంధీని 193 స్థానాలకే పరిమితం చేసాయి. అప్పట్లో అప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో బీజేపీ లెఫ్ట్ పార్టీలు వి.పి.సింగ్ ని ప్రధాని పదవిలో కూర్చోబెట్టారు. మొదటిసారిగా సంకీర్ణ ప్రభుత్వం జనతాదళ్ నేతృత్వంలో, ప్రాంతీయ పార్టీల భాగస్వామ్యంతో, లెఫ్ట్, రైట్ బయటి నుండి మద్దతుతో ఏర్పడిన ప్రభుత్వం సంవత్సరానికే కుప్పకూలింది. మందిర్, మండల వివాదాలు జనతాదళ్ అంతర్గత సంక్షోభం కారణంగా ప్రభుత్వం పతనం అయింది. జనతాదళ్ ని చీల్చిన చంద్రశేఖర్ ను కాంగ్రెస్ పార్టీ బయట నుండి మద్దతు ఇస్తూ కేవలం 6 నెలల పాటు మాత్రమే అధికారంలో కూర్చోబెట్టింది.

**యునైటెడ్ ఫ్రంట్‌కు చంద్రబాబు బీజం**

1991లో మధ్యంతర అన్నికాల సందర్భంగా రాజీవ్ గంధీ హత్య సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న పి.వి. నరసింహారావు 220 స్థానాలు గెలిచినా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ప్రభుత్వాన్ని, మెజారిటీగా మార్చుకొని 5 ఏళ్ళు పాలించగలిగారు. 1996 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పి.వి. నేతృత్వంలో పరాజయం పాలవడం బీజేపీ అతి పెద్ద పార్టీగా 161 స్థానాల్లో నిలవడంతో రాష్ట్రపతి సింగల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న బీజేపీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అయితే బీజేపీకి ఏ ఇతర పక్షాలు మద్దతు ఇవ్వకపోవడంతో 13 రోజులకే వాజ్ పేయి రాజీనామా చేసారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు చక్రం తిప్పి యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేసారు. ప్రాంతీయ పార్టీలతో కూడిన యునైటెడ్ ఫ్రంట్ కి కాంగ్రెస్ పార్టీ మద్దతునివ్వగా దేవెగౌడ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. ఒక్క సంవత్సరం మాత్రమే దేవెగౌడ ప్రధానిగా కొనసాగగా, ఐ.కే. గుజ్రాల్ మరో సంవత్సరం మాత్రమే అధికారంలో ఉండడంతో 2 సంవత్సరాల కాలంలోనే ఇద్దరు ప్రధానులు మారి ప్రభుత్వం పతనమైంది.

**ఎన్డీఏకు రూపునిచ్చిన వాజ్ పేయి**

1996 అనుభవం దృష్టిలో పెట్టుకున్న బీజేపీ వాజ్ పేయి నేతృత్వంలో విస్తృత కూటమిని ప్రాంతీయ పార్టీలను కలుపుకొని ఎన్డీయేగా రూపుదిద్దుకుంది. యునైటెడ్ ఫ్రంట్ చైర్మన్ గా ఉన్న చంద్రబాబు యునైటెడ్ ఫ్రంట్ కి గుడ్ బై చెప్పి ఎన్డీయేలో చేరి వాజ్ పేయి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచారు. అయితే జయలలిత మద్దతు ఉపసంహరణ కారణంగా ఒక్క సంవత్సరానికే వాజ్ పేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో కుప్పకూలిపోయింది. అయితే అప్పుడు జరిగిన కార్గిల్ దాడిలో వాజ్ పేయి ఆ దాడిని తిప్పికొట్టడం. ఒక్క ఓటుతో ఓడిపోవడం కారణంగా 1999లో మరోసారి ఎన్డీయే అధికారం చేపట్టింది. 5 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 2014లో "షైనింగ్ ఇండియా" అంటూ ముందస్తు ఎన్నికలకు వెళ్ళిన ఎన్డీయే ఓటమి పాలై, బీజేపీ కేవలం 138 స్థానాలకే పరిమితమైంది. అప్పుడు కాంగ్రెస్ పార్టీకి 141 స్థానాలు రావడం, లాలూ, ములాయం, కరుణానిధి, సీపీఎం, సీపీఐ లాంటి పార్టీలతో యూపీఏ ఏర్పడడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి 5 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఉభయ కమ్యూనిస్టులు విభేదించి విడిపోయినప్పటికీ 2009లో 203 స్థానాలు కాంగ్రెస్ పార్టీ సాధించి, యూపీఏ 2 ని ఏర్పాటు చేసి 10 సంవత్సరాలు సంకీర్ణాన్ని నడపగలిగింది. 2014లో ప్రభుత్వం వ్యతిరేకత మోదీ ప్రచారం కారణంగా బీజేపీకి సొంతంగా 283 స్థానాలు వచ్చినప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు అయింది. 10 సంవత్సరాలు పేరుకే ఎన్డీయే అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వంగా మనుగడసాగింది. 2024 ఎన్నికల్లో బీజేపీ 370 సీట్లు, ఎన్డీయే 400 అని టార్గెట్ పెట్టుకున్న బీజేపీకి 240 స్థానాలకే పరిమితం అయింది. ఇండియా కూటమికి 283 స్థానాలలో గట్టి పోటి ఇవ్వగలిగింది. అయితే ఎన్డీయే కూటమి 393 స్థానాలు రావడంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడనుంది.

బీజేపీ వాజ్ పేయి నేతృత్వంలో ఏర్పడ్డ ఎన్డీయే ప్రభుత్వం కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడ్డ యూపీఏ ప్రభుత్వాలు పూర్తి కాలం పాటు అధికారంలో ఉండగలిగాయి. ఎన్.ఎఫ్. ఫ్రంట్ ప్రభుత్వం సన్నద్యం యునైటెడ్ ఫ్రంట్ ప్రాంతీయ పార్టీల కూటమి కేవలం 2 సంవత్సరాలు నిలవగలిగాయి. ఎన్.ఎఫ్. లో ఇద్దరు ప్రధానులు యునైటెడ్ ఫ్రంట్ లో ఇద్దరు ప్రధానులు మారారు. అదే బీజేపీ నేత్రుత్వంతో ఏర్పడ్డ ఎన్డీయే వాజ్ పేయి 7 సంవత్సరాలు నడిపించారు. కాంగ్రెస్ నేతృత్వంలో యూపీఏ 10 ఏళ్ల పాటు ప్రభుత్వం నడిచింది. కాంగ్రెస్ లేదా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వాలు ఏర్పాటు జరిగితే పూర్తి కాలం పని చేసిన చరిత్ర ఉంది.

- తిరిగి మూడోసారి అధికారంలోకి వస్తున్నాం అని బీజేపీ సంబరాలు చేసింది.
- 100 సీట్ల మార్కు దగ్గరికి వచ్చాం బీజేపీని నిలువరించాం అని కాంగ్రెస్ సంబరాలు చేసుకుంది.
- మా ఓటు బ్యాంకు మాకు నిలిచింది అని ఎస్.పి, ఆర్.జే.డి, శివసేన, ఉద్దవ్, పవార్ లు సంబరాలు చేసుకున్నాయి.
- బీజేపీని నిలువరించాం అని టి.ఎం.సి. సంబరాలు చేసుకుంది.
- ఎవరిని ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టాం అని ఓటర్లు సంబరాలు చేసుకున్నారు.
- మొదటిసారిగా అన్ని పార్టీ ఆఫీసులు సంబరాలు చేసుకున్నారు.

వాజ్ పేయి 1998 ఒకే ఒక్క ఓటుతో ఓడిపోయి ప్రభుత్వాన్ని తృణప్రాయంగా వదిలేసిన చరిత్ర. విలువైన నైతికత ఆధారంగా వాజ్ పేయి జయం నడిచింది.

అందుకే వాజ్ పేయి అద్వానీ బీజేపీకి ఇప్పుడున్న మోదీ షా బీజేపీ పార్టీలు విలువలు నైతికత విషయంలో తేడా స్పష్టం. 32 స్థానాలు మ్యాజిక్ మార్క్ కు దూరంగా ఉన్నప్పటికీ 272 స్థానాలు టచ్ చేస్తే అవకాశం మోదీ షా కి ఉంది.

### చక్రం తిప్పనున్న చంద్రబాబు:



యునైటెడ్ ఫ్రంట్ హయాంలో ప్రధాని అభ్యర్థులను నిర్ణయించిన చంద్రబాబు, ఎన్డీయే వాజ్ పేయి హయంలో ఢిల్లీ రాజకీయాల్లో చక్రం తిప్పారు. 2014లో ఎన్డీయేతో పొత్తు ఉన్నప్పటికీ బీజేపీ 283 స్థానాలు ఉండడంతో బీజేపీని చంద్రబాబు పెద్దగా పట్టించుకోలేదు. 20 సంవత్సరాల తర్వాత చంద్రబాబు మరోసారి ఢిల్లీలో చక్రం తిప్పే అవకాశం వచ్చింది. కారణం 16 సీట్లు గెలిచినా టీడీపీ మద్దతు ఇపుడు బీజేపీకి కీలకం. అమావాస్య మబ్బులు తొలగిపోయి చంద్రబాబు మరోసారి ఢిల్లీ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ తెలుగు ప్రజలకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. మోదీకి పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే చంద్రబాబు ప్రాధాన్యం అత్యంత పరిమితంగా ఉండేది. మోదీ ప్రభుత్వ మనుగడకు చంద్రబాబు కీలకం కావడంతో ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. బీజేపీతో కూటమి కట్టడానికి టీడీపీకి నిన్న ఒక కారణం ఉన్నట్టే. తెగదెంపులు చేసుకోవడానికి కూడా రేపు ఒక కారణం ఏర్పడింది. అప్పటి వరకు చంద్రబాబు మిత్ర దర్మానికే కట్టుబడి ఉండవచ్చు కొన్ని షరతులతో.. కూటమిగా మెజారిటీ లభించినప్పటికీ ఏ ఒక్క పార్టీకి ఉద్దేశం లేకపోవడాన్ని పరిగణించాలని తాము కూడా అధికారాన్ని కోరుకోవడంలో తప్ప లేదని ఇండియా కూటమి వాదిస్తోంది. ఎన్నికల ముందు ఏర్పడిన కూటములు ఫలితాలు వెలువడిన వెంటనే విచ్ఛిన్నం కావు. బలమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తే ప్రభుత్వం నుంచి మెరుగైన పాలన అయినా వస్తుంది. లేదా అధికార కూటమి అంతర్గత సంక్షోభంలో పడే అవకాశం ఉంటుంది. సమయం కోసం వేచి ఉండడం మంచిది. ప్రపంచమంతా గుర్తిస్తున్నట్లు ఇప్పుడు మోదీ ప్రభుత్వానికి ఊత కర్రలుగా మారిన రెండు పార్టీలు ఇండియా కూటమికి కూడా సహజ మిత్రులే. మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారు అనే దానిపైనే ప్రభుత్వం మనుగడ ఆధారపడి ఉంది.



- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్ చైర్మన్,
సీఎండీ విశ్వంభర తెలుగు దిన పత్రిక

# నీటి పారుదల రంగానికి కె.ఎల్.రావు ఎనలేని సేవలు



నీటిపారుదల రంగంలో అపర భగీరథుడిగా కీర్తించబడే తెలుగు ప్రజలు గర్వించ దగిన డా. కానూరి లక్ష్మణరావు (జూన్ 6, 1902 మే 18, 1986) భారత దేశం లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన పనులు చేసిన గొప్ప ఇంజనీరు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య తర్వాత గొప్ప వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 1902 జూలై 14న కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో జన్మించిన కె.ఎల్. రావు మద్రాసు విశ్వ విద్యాలయములో ఇంజనీరింగు (బీ.ఈ) డిగ్రీ పూర్తి చేసి, గిండీ ఇంజనీరింగు కళాశాల నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఇంజ నీరింగులో మాస్టరు డిగ్రీ (ఎం.ఎస్.సి ఇన్ ఇంజనీరింగ్) పొందిన తొలి వ్యక్తిగా నిలిచారు.

చదువు పూర్తయిన తర్వాత విశాఖ జిల్లా బోర్డు అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేశారు. తదనంతరం రంగూన్ కూడా ఉద్యోగం చేశారు. కొంత కాలం తర్వాత రావు గారు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధ కుడిగా చేరారు. ఇంగ్లండ్ లోని బర్మింగ్ హోమ్ విశ్వ విద్యాలయం నుండి 1939 లో డాక్టరేట్ డిగ్రీ పొందారు. కొంత కాలం పాటు ఇంగ్లాండ్ లో ప్రొఫెసర్ గా పనిచేసిన ఆయన 1946లో భారత దేశం తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్ గా చేరారు. 1950 54 మధ్యకాలంలో భారత ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ గా పని చేశారు. ప్రభుత్వంలో ఇంజనీర్ గా పని చేస్తున్న సమయాన, దేశం లోని అనేక నీటిపారుదల ప్రాజెక్టు లకు నమూనాలు తయారు చేశారు. నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ఎన్నో సుప్రసిద్ధ నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేశారు. గంగా, బ్రహ్మపుత్ర తదితర నదుల వరదల నివారణకై అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే గాంధీ సాగర్ , జవహర్ సాగర్ రాణా ప్రతాప్ సాగర్ వంటి నిర్మాణాలు సిద్ధం చేశారు. నాటి ప్రభుత్వం నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్ట్ విషయంలో పిలిపించిన విదేశీ ఇంజనీర్లు కూడా రావు ను సంప్రదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. జనీరింగ్ విషయాలకు సంబంధించి ఈయన రాసిన "ఇండియాస్ వాటర్ వెల్త్" అనే పుస్తకం నేటి తరాల శాస్త్రవేత్తలకు ప్రామాణిక గ్రంథంగా ఉంది.

**"నేషనల్ వాటర్ గ్రిడ్" పథకానికి రూపకల్పన**

ఉద్యోగ విరమణ అనంతరం నాటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి పిలుపు మేరకు 1962, 1967 ,1971 లో విజయవాడ నుంచి పార్లమెంటుకు పోటీ చేసి గెలిచారు. నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే గంగా బ్రహ్మపుత్ర నదిలో వర్షాకాలంలో చేరుతున్న నీటిని నిల్వ ఉంచి భారతదేశంలో క్షామ ప్రాంతాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నీటి సౌకర్యం కల్పించే "నేషనల్ వాటర్ గ్రిడ్" పథకానికి రూపకల్పన చేశారు.

### కె.ఎల్.రావు సేవలకు రాష్ట్రపతి పురస్కా రం

1963లో పద్మభూషణ్, రూర్కీ, ఆంధ్రా మరియు జే ఎన్ టీ విశ్వ విద్యాలయాల డాక్టరేట్లు పొందారు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్, అలాగే ఆల్ ఇండియా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్ గా, రంగూన్ (బర్మా, ఇప్పుడు మయన్మార్)లో ప్రొఫెసర్‌గా, యునైటెడ్ కింగ్‌డమ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంజనీరుగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కా రం లభించింది. ఆయన జ్ఞాపకార్థం పులిచింతల ప్రాజెక్టుకు కె.ఎల్.రావు ప్రాజెక్టు అని నామ కరణము చేయ బడింది. ఒక ఇంజనీరు పేరును ప్రాజెక్టుకు పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇదే ప్రథమం. 1986 మే 18 న 84 సంవత్సరాల వయసులో మృతి చెందారు.

# "శనీశ్వర పూజతో అంతా శుభమే"



భారతీయుల జ్యోతిష శాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు మరియు కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్న గ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝుడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది.

నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు భిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనై: క్రమతీతి అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్ర వాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికరమయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూప బోతున్నాడో అని నిరూపించడానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది.

దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమ ధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు వారి వారి కర్మ ఫలములను బట్టి జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపు కుంటారు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. శని దశ దుష్ప్రభావాలతో బాధపడే వారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినపప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి. చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు.



## బలగం మొగిలయ్యకు జిల్లా వైద్యాధికారి పరమార్శ

**విశ్వంభర, వరంగల్ జూన్ 06 :** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలతో సంరక్ష హాస్పిటల్ హైదరాబాద్‌లో మూత్ర సంబంధిత వ్యాధులతో బాధపడుతూ.. వైద్యం పొందుతున్న బలగం మొగిలయ్యను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే వెంకటరమణ పరామర్శించి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకొని వారికి అందిస్తున్నారు. సంరక్ష హాస్పిటల్ మేనేజ్మెంట్ తో మొగిలయ్యకు మెరుగైన చికిత్స చేయాలని ఆయన సూచించారు. అనంతరం బలగం మొగిలయ్యకు ఆయన ధైర్యం చెప్పి వారి కుటుంబ సభ్యులకు మానసిక ధైర్యం చెప్పారు.

## చేప మందు పంపిణీకి ఏర్పాట్లను పరిశీలించిన ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్



**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 6:** హైదరాబాద్‌లో చేప మందు ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేసేందుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. మృగశిర కార్తె ప్రారంభం కానున్నందున ఈనెల 8వ తేదీ నుంచి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపల ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్లో నాంపల్లిలో జరిగే చేప ప్రసాద పంపిణీ ఏర్పాట్లను ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఫిషరీస్ జాయింట్ కమీషనర్ శంకర్ రాథోడ్ మరియు ఏసీపీ చంద్రశేఖర్‌లతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బత్తిన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తారని, ఈ మందు దివ్యౌషదంలా పనిచేస్తుందని తెలుగు రాష్ట్రాల ప్రజల విశ్వాసం అని తెలిపారు. దీంతో తెలంగాణ, ఏపీతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివస్తుంటారు. ఈ మేరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సీక్వెన్షియల్ ఆర్డర్‌లో ఈ మందును అందజేయడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## మానవత్వం చాటుకున్న పంచాయతీ సెక్రటరీ



**విశ్వంభర చింతపల్లి జూన్ 06 :** చింతపల్లి మండలం తీర్మాలపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ చంద నాగేంద్ర మరోసారి మానవత్వం చాటుకున్నారు. తీర్మాలపురం గ్రామానికి చెందిన చెట్టిపల్లి ముత్తమ్మ అనే వృద్ధురాలి పరిస్థితి చూసి చలించారు. కూడు, గూడు, గుడ్డ లేని వృద్ధురాలిని చూసి ఏదో ఒక సహాయం చేయాలని కంకణం ఆయన అనుకున్నారు. దీంతో సెక్రటరీ చంద నాగేంద్ర తన 10 వ తరగతి స్నేహితులత సహాయంతో రూ.10 వేలు జమచేశారు. రెండు వేలతో వంట సామగ్రి, 8000 రూపాయలు వృద్ధురాలికి సాయం అందించారు. దీంతో గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి చంద నాగేంద్రను అభినందించారు. వృద్ధురాలి గుడిసె పూర్తిగా వర్షానికి దెబ్బతినడంతో ఇంట్లో పడుకునే పరిస్థితి కూడా లేదు. ఉండటానికి చిన్న రూం నిర్మాణనికి దాదాపు 40 వేల నుంచి 50 వేలు రూపాయలు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. కావున పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన 8000 వేళకు తోడుగా ఇంకెవరైన ప్రజాప్రతినిధులు ప్రభుత్వం నుంచి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న చింతపల్లి ఎంపీడీఓ సీ సుజాత తీర్మాలపురం గ్రామానికి వచ్చి వృద్ధురాలి ముత్తమ్మ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## రాయికల్‌లో బడిబాట అవగాహన




**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 6 :** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట అవగాహన కార్యక్రమ ర్యాలీని జడ్పీహెచ్ఎస్ రాయికల్ ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. చిన్నారులను బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ఎంఈఓ శంకర్ రాథోడ్, పంచాయతీ సెక్రటరీ శ్వేత, అంగన్వాడీ టీచర్లు మమత, సుజాత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యురాలు యశోదమ్మ, ఎంపీడీవో బన్సీలాల్, అంబేద్కర్ యువజన సంఘం కార్యకర్త చింతకాయల వెంకటేష్, అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ మాచగల శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**




**విశ్వంభర, ఖైరతాబాద్ :** బీసీల న్యాయపరమైన రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం మిలిటెట్ పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కామారెడ్డి డిక్లరేషన్ సమగ్ర కులగణన అనే అంశంపై బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా అవకాశం ఇవ్వని ఆధిపత్య కుల పార్టీలు కనీసం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధంగా లేకపోవడం బాధాకరమని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం బీసీ సంఘాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీకి ఏం మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేల్లో తేలిన బీసీల లెక్కల ఆధారంగానైనా ఆర్డినెన్స్ తెచ్చి బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వొచ్చని అన్నారు. అయితే ఎన్నాళ్ళు ప్రత్యేక అధికారులను పెట్టి గ్రామాలను పరిపాలించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు సిద్ధం అవుతారని చెప్పారు. బీసీలను మరోసారి మోసగించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందన్న ఆయన బీసీల రిజర్వేషన్ల సాధన కోసం ఎలాంటి కార్యాచరణ తీసుకున్నా తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఎలాంటి త్యాగలకైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సమగ్ర కులగణనతో పాటు కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని రాజారాం యాదవ్ ప్రకటించారు. ఇక ఈ నెల 15న ఇందిరాపార్కు దగ్గర బీసీ జనసభ తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి బీసీ కుల, సంఘాల ఐక్య వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ సంజీవ్ నాయక్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి రమేష్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రమణ కుమార్, టి.జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, అడ్వాకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, బీసీ ఐక్యవేధిక చైర్మన్ కాటం నర్సిహ్మ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఓట్ల తోనే బీజేపీకి ఎంపీ సీట్లు వచ్చాయి

### చనగాని దయాకర్ టీపీసీసీ అధికార ప్రతినిధి

**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 06:** నిన్న జరిగిన పార్లమెంట్ పలితాల్లో తెలంగాణ లో బీఆర్ఎస్ ఓట్ల తోనే బీజేపీ 8 స్థానాలు వచ్చాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. బీఆర్ఎస్ ఓట్ బ్యాంకు బీజేపీకి బదిలీ చేసింది కేసీఆర్ అన్నారు. బీజేపీ 8 సీట్లు గెలిచినంత మాత్రాన తెలంగాణకు ఒరిగిందేమీ లేదని అన్నారు. 10 ఏండ్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తెలంగాణకు చేసిందేమీ లేదనీ, 8 మంది ఎంపీ సీట్లు గెలిచినా పార్లమెంట్ లో నిద్ర పోవడానికి తప్ప ఉపయోగం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు 37.35 శాతం వోట్ బ్యాంకు సాధిస్తే, పార్లమెంట్ ఎన్నికల్లో 16.68 కు తగ్గిందని అన్నారు. బలహీనమైన అభ్యర్థులను ఎంపిక చేసుకుని నామమాత్రంగా ఎన్నికల్లో పోటీచేశారని అన్నారు. బీజేపీకి 13.90 శాతం అసాంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ వస్తే పార్లమెంట్ ఎన్నికలకు మాత్రం 35.08 వచ్చిందని అన్నారు. మోడీ గాలి లేదు సూడి గాలి లేదు అదంతా బీఆర్ఎస్, బీఆర్ఎస్ రాజకీయ డ్రామా అన్నారు చనగాని దయాకర్. దేశ వ్యాప్తంగా లేని మోడీ గాలి తెలంగాణ లో ఎలా ఉంటదని అన్నారు. ఆర్.జే.డీ, చంద్రబాబుల మద్దతుతోనే ఎన్డీఏ కూటమి గద్దె నెక్కనుందని అన్నారు.






ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుని మర్యాద పూర్వకంగా కలిసిన మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి.
- విశ్వంభర, గజ్వేల్



ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి వారిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
- విశ్వంభర, యాదగిరిగుట్ట

## కంగ్రాట్స్ చంద్రబాబు సార్: పీవీ సింధు



**విశ్వంభర, హైదరాబాద్ జూన్ 6:** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు తన ఎక్స్‌లో అభినందనలు తెలిపారు. 'మీ దార్శనిక నాయకత్వం నిస్సందేహంగా ఏపీని పురోగతి వైపు నడిపిస్తుంది. నా కెరీర్ తొలినాళ్లలో మీ నుంచి నాకు అమోఘమైన మద్దతు లభించింది. అప్పుడు మీరు చూపిన ఆప్యాయత ఎప్పటికీ గుర్తుంటుంది. మిమ్మల్ని మళ్లీ సీఎంగా చూస్తుండటం సంతోషాన్నిస్తోంది సార్' అంటూ ట్వీట్ చేశారు. అలాగే పవన్ కళ్యాణ్, పురందీశ్వరికి కంగ్రాట్స్ చెప్పారు.



మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్ కుమార్‌రెడ్డిని తెలంగాణ భవన్‌లో అభినందించిన మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాదరావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి. ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత తొలి సారి తెలంగాణ భవన్‌కు వచ్చిన సందర్భంగా తనకు సహకరించిన పార్టీ అధిష్టానానికి, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.
- విశ్వంభర, హైదరాబాద్

# ఘనంగా ఆచారి జన్మదిన వేడుకలు

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 6:** రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఆమంగల్ పట్టణ ప్రజలు, ఆచారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లోజు ఆచారి పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలందరూ ఎన్డీఏ కూటమిని గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్, బీజేవైఎం తాలూకా కన్వీనర్ పద్మ అనిల్ కల్వకుర్తి అసెంబ్లీ కోకన్వీనర్ గోరేటి నరసింహ, కౌన్సిలర్లు సుందూరి శేఖర్, శ్రీశైలం యాదవ్, లక్ష్మణ్, విజయ్ కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్లు రవి రాథోడ్, ప్రశాంత్, కండే సాయి, గోజే ఆనందు, ఎర్రవోలు మహేశ్, వరికుప్పల




శ్రీను, ఎర్రవోల్లు రాజు, భగవాన్ రెడ్డి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

**విశ్వంభర, మెట్పల్లి జూన్ 6:** ఇబ్రహీంపట్నం మండలం సత్తక్కపల్లి గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ అనే యువకుడు ఆటో నడుపుతూ జీవితం గడుపుతున్నాడు. మద్యానికి, జల్సాలకు ఇస్మాయిల్ బానిసైయ్యాడు దీంతో ఆటో నడపడం ద్వారా వచ్చిన డబ్బులు సరిపోక దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ డబ్బులతో జల్సాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో సుమారు 25 ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. దొంగిలించిన వాహనాలను స్క్రాప్ కింద రూ.5000 నుంచి రూ.10000కు అమ్ముతూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. జగిత్యాల కోరుట్ల మెట్పల్లి గంగాధర పలు ప్రాంతాల్లో బ్యాంకులు హాస్పిటల్ పోస్ట్ ఆఫీస్‌ల వద్ద హ్యాండిల్ లాక్ చేయని ద్విచక్ర వాహనాలను సులువుగా దొంగలిస్తూ గత 18 నెలలుగా సుమారు 25 వాహనాలు దొంగిలించి పోలీసుల కళ్ళు కప్పి తిరుగుతున్నాడు. మెట్పల్లి పాత బస్టాండ్ చౌరస్తా వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా షేక్ ఇస్మాయిల్ ద్విచక్ర వాహనంపై పట్టుబడ్డాడు. ఇతడు దొంగతనం చేసిన ద్విచక్ర వాహనాలను కోరుట్ల మెట్పల్లి ఆర్మూర్ మోర్తాడ్ ప్రాంతాల్లో స్క్రాప్ కింద 15 షాపుల్లో అమ్మేవాడు. వారి వద్ద నుంచి ఆరు లక్షల రూపాయలు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు రికవరీ చేశారు. దొంగిలించిన వాహనాలు కొన్న వారిలో ఆర్మూర్ పట్టణానికి చెందిన మునిసిపల్ వైస్ చైర్మన్ మున్నా అను వ్యక్తి తోపాటు 14 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన భూమిక పోషించిన మెట్పల్లి సీఐ నవీన్, ఎస్ఐ చిరంజీవి బేగు అంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుల్ సంతోష్లను మెట్పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు అభినందించారు.

## కడ్తాల్ మండలంలో ఇద్దరు యువకుల దారుణ హత్య




**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 6 :** కడ్తాల్ మండలంలో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురైన సంఘటన చోటు చేసుకుంది. మండల పరిధిలో గోవిందాయపల్లికి చెందిన శేషిగారి శివ(24), గుండెమోని శివ(29)లు కడ్తాల్ మండలంలోని అతి పెద్ద వెంచర్ బటర్ఫ్లై సిటీలోని ఒక విల్లాలో ఈ హత్య జరిగింది. ఇదే విల్లాలో రెండు రోజుల క్రితం ఓ రాజకీయ నాయకుడి జన్మదిన వేడుకలు నిర్వహించారని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంలోనే పోలీసులు సంఘటనకు గల కారణాలపై విచారణ చేపడుతున్నారు. కాగా మృతురాలి కుటుంబ సభ్యులు కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై కూర్చుని తనకు న్యాయం చేసి బాధ్యులను అరెస్టు చేయాలని రాస్తారోకో నిర్వహిస్తున్నారు.

## బోర్ గుంతలో పడ్డ ఆవు

**విశ్వంభర, లింగంపేట్:** బోర్ బావిలో నీరు రాకపోవడంతో వృధాగా వదిలేసిన బోరు గుంతలో ఆవు పడిన సంఘటన లింగంపేట్ మండలం పోతాయిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది.సంఘటనకు సంబంధించిన వివరాలు లో ఉన్నాయి. మండలంలోని పోతాయిపల్లి గ్రామానికి చెందిన పెద్దన మల్లయ్య తన వ్యవసాయ భూములు బోరు గుంత తవ్వించినట్లు గ్రామస్తులు తెలిపారు. బోరుబావిలో నీరు రాకపోవడంతో గుంతను పూడ్చి వేయకుండా అలాగే వదిలేశారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి బోరుబావిలో నీరు వచ్చాయి. గురువారం ఉదయం సోనబోయిన అంజయ్యకు చెందిన ఆవు మేత కోసం వెళ్ళి ప్రమాదవశాత్తు బోరు గుంతలో పడి విలవిల్లాడింది. బోర్ గుంతలో పడ్డ ఆవును గమనించిన స్థానికులు... గ్రామస్తులకు సమాచారం అందించగా గ్రామస్తులు బోర్ గొంతులో నుండి ఆవును బయట తీశారు. వృధాగా వదిలేసిన బోరుబావులను పూడ్చి వేయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అమ్మనబోలు వాస్తవ్యులు ఇటుకల బాలాజీ తండ్రి మీరయ్య ( చెన్నై), కట్టంగూరు కాటమయ్య కూతురు లావణ్య సేవాభావంతో వికలాంగురాలుకు బ్యాటరీ వెహికల్ అందజేశారు. వికలాంగురాలు కుటుంబసభ్యులు దాతలకు ధన్యవాదములు తెలియజేశారు. **- విశ్వంభర, హైదరాబాద్**

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

## సీఎస్‌ను కలిసిన కోదండ రాం, టీఎన్జీవో, టీజీవో నేతలు



విశ్వంభర, మెహిదీపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని త్రిసభ్య కమిటీ సభ్యులు చిన్నారెడ్డి, కోదండరాం తో కలిసి టీఎన్జీవో, టీజీఓ అధ్యక్షులు వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా ఉద్యోగుల పెండింగ్ డి ఏ ల మంజూరు, హెల్త్ కార్డ్స్, 317 జివో సమస్యలు, సీపీఎస్ రద్దు, ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగుల 144 మందిని వెనక్కి తేవడం, గచ్చిబౌలి ఇండ్ల స్థలాలు బీటీఎన్జీవో సొసైటీకి ఇప్పించడం, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరు, నూతన జిల్లాలకు అదనపు కేడర్ స్ట్రెంత్ మంజూరు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్, నగర శాఖ శ్రీకాంత్, బీటీఎన్జీవో మల్లారెడ్డి టీజీఓ అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పరమేశ్వర రెడ్డి, నరహరి రావు, శ్రీనివాస మూర్తి, సచివాలయం సంఘం నేతలు శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నరసింహ రావు, నాలుగో తరగతి అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, డ్రైవర్ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రితో కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని అంశాల వారీగా చర్చించడం జరిగింది. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులలో ఇద్దరు డాక్టర్ జి చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం తో నాయకులు, ప్రతినిధులు సమావేశమయ్యారు. గురువారం నాంపల్లి లోని టీ.జె.ఎస్. కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో పలు అంశాలపై వారు చర్చించారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తామని చిన్నారెడ్డి, కోదండరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

### మండల విద్యాశాఖ అధికారుల పిలుపు

**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 06:** షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయశంకర్ బడిబాట కార్యక్రమం ఎంపీడీఓ రవిచంద్ర ప్రకాష్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి టి.మనోహర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు లలితమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆరవ తరగతిలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కొరకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవలసిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

### మండల వ్యవసాయ అధికారి కుర్మయ్య



**విశ్వంభర, వనపర్తి :** నకిలీ, నాసిరకం విత్తనాలను అమ్మితే కేసులు నమోదు చేస్తాని వ్యవసాయ అధికారి కుర్మయ్య,ఎస్సై జయన్న హెచ్చరించారు. గురువారం వ్యవసాయ శాఖ అధికారి కుర్మయ్య, టౌన్ ఎస్సై జయన్న, రెవెన్యు శాఖ అధికారులతో కూడిన మండల టాస్క్ ఫోర్స్ బృందం వనపర్తి పట్టణంలోని విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. విత్తన, పురుగుమందుల, ఎరువుల అమ్మకాలకు సంబంధించిన రిజిస్టర్లు,రసీదులు పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి కుర్మయ్య మాట్లాడుతూ రైతులు విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు కొనే సమయంలో విక్రయదారుల నుండి తప్పక రసీదు తీసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మాలని అమ్మకందారులను సూచించారు. కొన్న వస్తువులకు రసీదు ఇవ్వని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు ఎఎస్ ఐ బుచ్చయ్య పాల్గొన్నారు.

## ప్రజల మనిషి చంద్ర రాజేశ్వర్ రావు

### సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**విశ్వంభర, దేవరకొండ జూన్ 06:** దేవరకొండ సీపీఐ కార్యాలయంలో అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్ రావు 110వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు 28 సంవత్సరాల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అమరజీవి చంద్ర రాజేశ్వరరావు పని చేశారని అన్నారు. ఆయనకు ఉన్న వందల ఎకరాల భూమిని పేదలకు పంచడం జరిగిందని అన్నారు. పార్టీ కార్యాలయంలోనే ఉంటూ జీవనం కొనసాగించారని అన్నారు.

ఆయన ఆశయ సాధన సమ సమాజ స్థాపన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. భూమి లేని నిరుపేదలకు భూపోరాటల ద్వారా భూమిని సాధించి ఇప్పించారని తెలిపారు. తీవ్రవాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రామస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల ఆంజనేయులు సీపీఐ మండల నాయకులు పల్లా రంగారెడ్డి, జూలూరు వెంకట రాములు కిన్నెరి యాదయ్య, కందుకూరి శ్రీను, నీల వెంకటయ్య, కాటం గోవర్ధన్, నగేష్, ఏ మల్లయ్య, లాలయ్య, భక్కయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు



**విశ్వంభర, యాదగిరిగుట్ట జూన్ 06:** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. పేదల నాయకునిగా సుమారు 50వేల మెజార్టీతో గెలుపొందిన తర్వాత బీర్ల ఐలయ్య మొదటి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సైదాపూర్ గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయం, యాదగిరిగుట్ట పట్టణం లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన నివాసంలో తన తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత యాదాద్రి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది ఆలయ అర్చకులకు నిత్యవసర సరుకులను అందజేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశంతో కలసి గుట్టలోని పాదాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజగోపాల్ రెడ్డితో సహా ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్యకి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండ నర్సన్న(గద్దర్) ఆట పాటలతో ఉర్రూతలుగించారు. కాగా ముఖ్యంగా బీర్ల ఐలయ్య ప్రకటన చూసి చాలా మంది అభిమానులు, నాయకులు, కార్యకర్తలు నోట్ బుక్స్ అందజేసారు. దీంతో పాటు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 100 మంది అభిమానులు రక్త దానం చేశారు.

## నీట్ ర్యాంకర్ లక్ష్మీప్రియకు సన్మానం



**విశ్వంభర, షాద్‌నగర్ జూన్ 6:** బీజేపీ సీనియర్ నాయకులు ఆర్ టీసీ కాలనీ చెందిన మల్చలం మేఘన మురళి దంపతుల కూతురు లక్ష్మీప్రియ ఆల్ ఇండియా నీట్ మెడిసన్ లో 6650 ర్యాంకు సాధించి, తెలంగాణాలో ఉన్నత మెడికల్ కాలేజీలో సీటు సాధించబోతున్న శుభసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. వీరితో పాటు ప్యాట అశోక్, వంశీ కృష్ణ, విజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం, కిషోర్ రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నిజంగా లక్ష్మీప్రియ కృషి పట్టుదల వల్లనే తెలంగాణలో ఉన్నత మెడికల్ కాలేజీలో సీటు సాధించబోతుందని అన్నారు. లక్ష్మీప్రియను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, అదేవిదంగా ఈ అమ్మాయి భవిష్యత్ లో డాక్టర్ చదువు పూర్తి చేసుకుని షాద్‌నగర్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీ గా బీజేపీ

### మీర్ ఫిరాసత్ అలీ బక్రీ



**విశ్వంభర, బషీర్ బాగ్ జూన్ 06:** ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీ గా బీజేపీ ఆవిర్భవించిందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బక్రీ అన్నారు. 18 లోక్‌సభ ఎన్నికలలో మూడవసారి నేరుగా విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీర్ ఫిరాసత్ అలీ బక్రీ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకీ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలందరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వరుసగా 3వ సారి ప్రధాన మంత్రి అయిన తొలి నేతగా చరిత్రలో నిలిచారని అన్నారు. యూపి మాజీ తాత్కాలిక ఉప ముఖ్యమంత్రి డాక్టర్ అమ్మర్ రిజ్వీ, మైనారిటీ సంక్షేమం, ముస్లిం వక్ఫ్, హజ్, ప్రభుత్వ శాఖ మంత్రులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. డానిష్ ఆజాద్ అన్సారీ, యుపి రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ శ్రీ సయ్యద్ అలీ జైదీ లక్నోలో కలిశారు. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలిచిన చరిత్రాత్మకమైన రోజు అన్నారు. ఈ చారిత్రాత్మక ఆదేశం గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పై తమ సంపూర్ణ విశ్వాసాన్ని ఉంచినందుకు భారతదేశ ప్రజలకు బక్రీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## కేసీఆర్ బీజేపీ దగ్గర సుపారీ తీసుకుండు

### ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

**విశ్వంభర, నాంపల్లి జూన్ 06:** సీఎంకు సొంత జిల్లా అంటూ ఏదీ ఉండదని రాష్ట్రం అంత సీఎం దేనని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేసీఆర్ బీజేపీ దగ్గర సుపారీ తీసుకుండని, తమ కుటుంబం కోసం లక్షల మంది బీఆర్ఎస్ కార్యకర్తలను మోసం చేసిండని, అందుకే మహహబూబ్‌నగర్ పార్లమెంట్లో కాంగ్రెస్ ఓడిపోయిందని ఆయన విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా అసెంబ్లీ ఎన్నికల్లో 65 స్థానాల్లో కాంగ్రెస్ ను ప్రజలు గెలిపించారని తెలిపారు. బీజేపీ రాములవారి పేరు మీద ఓట్లు అడిగినా 8 పార్లమెంట్ సీట్లలో ప్రజలు గెలిపించారని అన్నారు. మేము బీజేపీతో కొట్లాడలేదు దేవుడి విగ్రహం తో కొట్లాడినమన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు శాతం పెరిగిందని తెలియజేశారు. కేసీఆర్ సపోర్ట్ తో బీజేపీకి ఓటింగ్ పెరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు సామాజిక న్యాయం చేయలేదని, బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిని మార్చి దళితుడికి పార్టీ పగ్గాలు అప్పజెప్పి సామాజిక న్యాయం చేయండని యెన్నెం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అహం కారంతో విర్రవీగిన కేసీఆర్ కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిండ్రని ఎద్దేవ చేశారు. ఏపీలో వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసిన జగన్ కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు 70 శాతం ఓట్లు వస్తాయని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

### వీఎస్ఆర్ ఇటుక బట్టిలో మరో ప్రమాదం

## ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి

### నెలల వ్యవధిలో ముగ్గురు మృత్యువాత



**విశ్వంభర, మేడిపల్లి జూన్ 06:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలోని వీఎస్ఆర్ ఇటుక బట్టీలో ట్రాక్టర్ ఢీకొని 18 నెలల బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీఎస్ఆర్ ఇటుక బట్టీలో ఒరిస్సా కు చెందిన సారథి పోప్ అనే మహిళ కూలి పనిచేస్తుంది. గురువారం ఇటుక బట్టీలోని ఖాళీ స్థలంలో మహిళా కూలీ కొడుకు అయిన 18 నెలల నిఖిల్ పోప్ ఆడుకుంటూ ఉండగా కమల్ మజాహి అనే వ్యక్తి ట్రాక్టర్‌తో బాలుడిని ఢీకొట్టాడు. గాయపడిన బాలుడిని వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటుక బట్టీలో కనీస సౌకర్యాలు, రక్షణ ప్రమాణాలు కల్పించకుండా ఉన్న బట్టి యజమాని తో పాటు అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి తన కొడుకు మృతికి కారణమయ్యాడంటూ డ్రైవర్ పై బాలుడి తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా ఇటీవల కాలంలో ఇదే బట్టిలో పనిచేస్తున్న ఓ మహిళ కూలీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోగా.. అక్కడే పని చేసే మరో వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృత్యువాత పడ్డాడు. తాజాగా అదే బట్టిలో బాలుడి మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.



## సమ్మక్క బ్యారేజీ గేట్లు ఎత్తివేత

**విశ్వంభర, కన్నాయిగూడెం జూన్ 6:** మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్ గేట్లు ఎత్తేసిన ఇంజనీరింగ్ అధికారులు. దేవాదుల పంపు హౌస్ నిర్వహణ కొరకు బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. భారీగా వరద వచ్చే అవకాశముండటంతో దిగువన ఉన్న గ్రామాల ప్రజలకు, తగు సూచనలు చేస్తూ గోదావరి నది తీర ప్రాంత ప్రజలను చేపల వేటకు వెళ్లొద్దని మత్యకారులను అధికారులు అలెర్ట్ చేశారు.

## బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు



**విశ్వంభర, మెట్పల్లి జూన్ 06:** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్పల్లి బీడీ కార్మికులకు ప్యాకర్లకు, బట్టి, బీడీ టేకేదార్లకు, బీడీ కట్టలకు బుర్రలు పెట్టె, కార్మికులకు వేతనాలు పెరిగిన సందర్భంగా, మెట్టుపల్లి, మండల కేంద్రం, టెలిఫోన్ శివసాగర్ బీడీ సెంటర్లలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ సిద్దిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ జగశ్‌లను కార్మికులు శాలువాతో సన్మానం చేసి స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. బీడీ యాజమాన్యంతో చర్చలు సుమారు 7 గంటల పాటు జరుపి పలు డిమాండ్లకు ఒప్పందం చేసుకున్నారు. వాటిలో బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు కూలీ రూ. 4.25 లు, బీడీ ప్యాకర్లుకు నేలకు రూ. 3,650 లు. బట్టి, చటన్, ఉద్యోగులకు నేలకు రూ.1700 లు, ఎంఎస్ లాంగర్ బీడీ కంపెనీలో బీడీ కట్టలకు బుర్రలు, బాక్స్ లు పెట్టె కార్మికులకు నేలకు రూ.1600లు, బీడీ టేకేదార్లకు, ఉన్న కమిషన్ రెటు పై వెయ్యి బీడీలకు రూ. 4.50 లు పెరిగాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ శివసాగర్, రాజుకమల్, శివ శక్తి బీడీ ప్యాకర్లు, ఉప్పులు, టీ సత్తయ్య, అజీమ్, అశోక్, శంకర్, జీ శ్రీను, బీ సత్యం, ఎం శివశంకర్, ఎం హన్నండ్లు, సయ్యద్ అతిక్ తదిరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



**విశ్వంభర, చింతపల్లి జూన్ 06:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని చింతపల్లి మండల ఏపీవోకి మెమోరండం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు రోజుకి రూ. 600 ల వేతనం చెల్లించాలని ఉపాధి హామీ పథకంలో కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఇతర ఉపాధి సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు. రద్దు చేసిన సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు అయిన టెంటు మెడికల్ కిట్టు మంచినీళ్లు ఏర్పాటు చేయాలని, పని ప్రదేశంలో వడదెబ్బకు గాని ఇతర కారణాలతో కానీ చనిపోతే 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఉపాధి హామీ పథకానికి ప్రతి సంవత్సరం బడ్జెట్లో నిధులను తగ్గించుకుంటూ వచ్చి, పేదల కుటుంబ పోషణ కోసం ఉపయోగకరంగా ఉన్నటువంటి ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తుందని, అందుకే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే కూలి భూమి పోరాటాలలో ప్రజలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వుడుగుండ్ల రాములు, వనం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి

**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 06:** నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో పిడుగుపడి జంగమ్మ (40) మృతి చెందింది. కాగా భర్త కృష్ణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కృష్ణయ్యను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యవసాయ పొలంలో పత్తి విత్తనాలు నాటి వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లిన కుటుంబ సభ్యులపై పిడుగు పడింది.

# మోడీ వేవ్ ఉండటం వల్లే బీజేపీకి భారీ మెజార్టీ : కొండ విశ్వేశ్వర్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మోడీ వేవ్ ఉండటం వల్లే బీజేపీకి భారీ మెజార్టీ వచ్చిందని ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన హైదారబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలు నరేంద్ర మోడీ వస్తే.. రిజర్వేషన్లు తొలగిస్తుందని దుష్ప్రచారం చేసినా ప్రజలకు బీజేపీని నమ్మి ఓట్లు వేశారని తెలిపారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలే మళ్లీ నరేంద్ర మోడీ అధికారంలోకి రావడానికి దోహదపడ్డాయని తెలిపారు. వికారాబాద్, తాండూరు, పరిగిలో బీజేపీ బలమైన శక్తిగా ఎదిగిందని, గతంలో మూడు, నాలుగు వేల ఓట్లు కమలం పార్టీకి పడితే ఈ సారి 20 వేలు, 30 వేల ఓట్లు పడ్డాయని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ మోర్చా కమిటీలు తన తరఫున విస్తృతంగా పని చేశారని ఆ దెబ్బకు ప్రతిపక్షాల గల్లంతయ్యాయయని అన్నారు. శేరిలింగంపల్లిలో ఊహించని రీతిలో బీజేపీకి ఓట్లు పోలయ్యాయని అన్నారు. మెదక్‌లో కాంగ్రెస్, బీజేపీల లిక్కర్, డబ్బు పనిచేయలేదని, బీజేపీ అభ్యర్థి రఘునందన్ వైపే జనం మొగ్గు చూపారని పేర్కొన్నారు. ఈ సారి ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగాయని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు.




# హైదరాబాద్, ఒంగోలులో 8 చోట్ల ఈడీ సోదాలు

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్, ఒంగోలులో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. చదలవాడ ఇంఫ్రాటెక్ లిమిటెడ్ కంపెనీపై ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ ఎస్‌బీఐ బ్యాంకును బ్యాంకును చదలవాడ ఇంఫ్రాటెక్ కంపెనీ మోసం చేసినట్లు సమాచారం. బ్యాంకు నుంచి పొందిన నగదును దారి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆ కంపెనీ డైరెక్టర్ చదలవాడ రవీంద్రబాబు సహా ఇతరులపై ఏసీబీ, సీబీఐ కేసులు నమోదు అయ్యాయి. ఏసీబీ, సీబీఐ కేసు ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. నిధులు నేరపూరిత కుట్రలో రూ.166.93కోట్ల మేర మోసం చేసినట్లు గుర్తించారు. బ్యాంకు ఇచ్చిన నిధులతో డైరెక్టర్లు ఇతరులతో కలిసి కుట్ర చేసినట్లు ఈడీ వెల్లడించింది. బ్యాంకు రుణాల నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# ఇనార్బిట్మాల్లో ఫో రెస్టారెంట్ ప్రారంభం



**మాదాపూర్, జూన్ 6:** భోజన ప్రియులకు రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ప్రముఖ పాన్ ఏషియా ఫో (ఎఫ్ఏఓ) రెస్టారెంట్ను గురువారం హైటెక్ సిటీలోని ఇనార్బిటాల్లో ప్రారంభించారు. పెబెల్ స్ట్రీ హాస్పిటాలిటీ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రియాన్ థామ్, కో – ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కీనన్ థామ్లు హాజరై రెస్టారెంట్ను ప్రారంభించారు. మినీ ఇండియాగా ఉన్న హైటెక్సిటీ, ఐటీ కారిడార్లోని ప్రజలకు పాన్ ఇండియా వంటకాలను రుచి చూపించేందుకు తమ రెస్టారెంట్ సేవలను ప్రారంభిస్తున్నట్లు థామ్ బ్రదర్స్ తెలిపారు. అద్భుతమైన రుచితో పాటు పూర్తి ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించడంలో ఫో రెస్టారెంట్ పేరు గాంచిందన్నారు. ఇండియా బిజినెస్ సెంటరైన ముంబైలో తమ రెస్టారెంట్ ప్రథమ వరుసలో ఉందని, అదే తరహాలో ఇక్కడి ప్రజలకు కూడా ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెబెల్ స్ట్రీట్ హాస్పిటాలిటీ చీఫ్ కలినరీ ఆఫీసర్ చెఫ్ ఎర్రిక్ సీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# టీచర్లకు గుడ్ న్యూస్.. బదిలీల డేట్ ఫిక్స్..?

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఉపాధ్యాయ బదిలీల, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ ని మరో రెండు రోజుల్లో విడుదల చేస్తామని విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం తెలిపారు. జూన్ 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బదిలీల, పదోన్నతుల ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. ఈ పదోన్నతుల ద్వారా దాదాపుగా 5,563 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించనున్నాయన్నారు. ఇక 11,062 ఉపాధ్యాయ పోస్టులు.. డీఎస్సీ ద్వారా అదనంగా 11,062 ఉపాధ్యాయ పోస్టులు అందుబాటులోకి వస్తున్నాయని వెల్లడించారు. ఇక గతంలో అన్నింటినీ కలిపి హేతుబద్ధీకరణ చేపడతామని తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కూడా లేకుండా చేస్తామని బుర్రా వెంకటేశం తెలిపిన విషయం తెలిసిందే. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో రుసుములు నియంత్రణకు మూడు, నాలుగు నెలల్లో కొత్త చట్టం తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని వెల్లడించారు.

# భార్య గొంతు కోసిన భర్త



**విశ్వంభర, శేరిలింగంపల్లి :** అనుమానం పెను భూతంగా మారడంతో విచక్షణ కోల్పోయిన భర్త కట్టుకున్న భార్యను దారుణంగా గొంతు కోసి హత్యకు యత్నించిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ప్రాథమిక సమాచారం ప్రకారం.. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో నివాసం ఉంటున్న తులసి (45 ) భర్తకు దూరంగా ఉంటూ పిల్లలతో కలిసి స్థానికంగా కర్రీ పాయింట్ నడుపుతుంది. చాలాకాలంగా భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వేరు వేరుగా ఉంటున్నారు. గతంలో తులసిపై అనుమానంతో ఆమె భర్త జగన్నాథం గొడవలు పడేవాడు. పలుమార్లు ఇరువురికి పెద్దలు నచ్చచెప్పినా వీరి మధ్య సయోధ్య కుదరలేదు. భార్యపై అనుమానంతో రగిలిపోతున్న జగన్నాథం బుధవారం రాత్రి ఆమె ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఆమె గొంతు కోసి పారిపోయాడు. బాధితురాలి అరుపులతో అక్కడికి చేరుకున్న స్థానికులు తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న బాధితురాలిని నలగండ్ల లోని సిటిజెన్ హాస్పిటల్ కు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితురాలికి చికిత్స కొనసాగుతుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న చందానగర్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేర్ ఆఫ్ అడ్రస్ తెలంగాణ : సుధాజైన్

**హైదరాబాద్, జూన్ 6,2024 :** తెలంగాణ రాష్ట్రం నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని సోషలైట్ డాక్టర్ సుధాజైన్ అన్నారు. గురువారం హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాజైన్ మాట్లాడుతూ.. చేనేత కళా కారుల ఉత్పత్తులను దేశ, విదేశాలకు పంపి చేనేత కళాకారుల ప్రతిభను చాటిచెప్పడం తమ లక్ష్యమని, చేనేత వస్త్రాలను కోనేలాగా వారు చేనేత ఉత్పత్తులను ధరించేలా చేయడమే తమ కోహినూర్ స్టోరీ ఉద్దేశమని అన్నారు. చేనేత ఉత్పత్తులను తయారు చేసే వారిని ప్రోత్సహిస్తూ తమవంతుగా చేయూతనివ్వడమే తమ ధ్యేయమని, చేనేత కళాకారుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు తాము దోహద పడతామని శ్రీ పాండురంగ హ్యాండ్లూమ్స్ చిట్టిమల్ల పాండు చెప్పారు. విభిన్నమైన, అరుదైన చేనేత ఉత్పత్తులను వినియోగ దారులకు అందించడంతోపాటు వాటి పట్ల ఆదరణ పెంచడమే తమ ఉద్దేశ్యం అని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్నచేనేతనేత కార్మికులను గౌరవించడం, ప్రోత్సహించడమే ఈ కోహినూర్ ఉద్దేశ్యం అని తెలిపారు. మార్కెట్ లో లభించే నకిలీ పట్టు వస్త్రాలను ఎలా తెలుసుకోవాలో,నాణ్యమైన చేనేత వస్త్రాలను ఎలా గుర్తించాలో కూడా ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. కొంత మంది సింథటిక్ ను సిల్క్ గా అమ్ముతున్నారు. దీనిపై అవగా వాహన కల్పించడానికి తమ సంస్థ కృషి చేస్తోందని అన్నారు. చేనేత కళాకారుల డిజైన్లకు ఒక రూపు తెచ్చి వారు రూపొందించిన డిజైన్లను ఇతరులు కాపీ చేయకుండా ఒక ఆల్బమ్ ను ఈ సందర్భంగా విడుదల చేశామని సుధజైన్ వెల్లడించారు.

## వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించండి

**చేనేతకు చేయూతనివ్వాలని నంది అవార్డు గ్రహీత, టెలివిజన్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షులు, హైదరాబాద్ సమయ్ హిందీ డైలీ న్యూస్ పేపర్ ఎడిటర్ మహమ్మద్ షరీఫ్ రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వారంలో ఒక రోజు తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించి, చేనేతకు చేయూతనివ్వాలని ప్రజల అవసరాలకు అనుగుణంగా చేనేత డిజైన్లను రూపొందిచాలని, నైపుణ్యం కలిగిన చేనేతకారులను ప్రోత్సహించాలని షరీఫ్ చెప్పారు. నాణ్యమైన చేనేత వస్త్రాలను డైరెక్ట్ టూ కస్టమర్ అనే ఆలోచనతో తక్కువ ధరలకే అందిస్తూ చేనేత కళాకారులను ప్రోత్సాహి స్తున్నట్లు తాను చేయ బోయే తదుపరి చిత్రం గిరి పుత్రిక లోను చేనేత వస్త్రాలను కళాకారుల (కాస్ట్యూమ్స్) కోసం వినియోగిస్తామని నిర్మాత దర్శకుడు రమేష్ రాజ చెప్పారు.**



# మెడ్స్ ఫార్మసీలో వ్యక్తి మృతి..

**సీసీ పుటేజీ వైరల్**

**విశ్వంభర, మేడ్చల్ :** ఈ మధ్య కాలంలో గుండెపోటు మరణాలు పెరిగిపోయాయి. కొవిడ్–19 విజృంభించినప్పటి నుంచి హఠాన్మరణాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం కొవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టినప్పటికీ గుండెపోటు మరణాలు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ఎక్కడో ఒక చోట అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతిచెందుతున్నారు. తాజాగా అలాంటి మరో ఘటన వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్– మేడ్చల్ జిల్లా కీసర గ్రామంలోని మెడ్స్ ఫార్మసీలో ఈ ఘటన చోటుచేసుకుంది. మెడ్స్ ఫార్మసీ నిర్వాహకుడు కస్టమర్లకు మందులను అందించి బిల్లింగ్ చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో ఇద్దరు కస్టమర్లు బయట నలబడి ఉండగా లోపల బిల్లింగ్ చేస్తున్న వ్యక్తి ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అయితే వెంటనే అక్కడే లోపలే ఉన్న తోటి ఫార్మసీ నిర్వాహకులు సీపీఆర్ చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించిన సీసీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గుండెపోటు బారిన పడకుండా తగు జాగ్రత్తలు అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆహార నియమాలు పాటించడంతో పాటు రోజూ నడక, కొద్ది సేపు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు.



# నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

**విశ్వంభర, ఖానాపూర్ :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం ప్రజలతో ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ఫోన్ ఇన్ విత్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజల నుండే తెలుసుకొని, ఆ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు వినూత్న రీతిలో "ఫోన్ ఇన్ విత్ యువర్ ఎమ్మెల్యే" అనే కార్యక్రమానికి శ్రీకారం మొదలుపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఖానాపూర్, కడం, జన్నారం,పెంబి, దస్తురాబాద్, సిరికొండ మండలాల వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు, ఉద్యోగులు ఫోన్ ద్వారా మాట్లాడారని, వారు ఎదుర్కొంటున్న నీటి, రోడ్డు, డ్రైనేజీ, కరెంటు, మిషన్ భగీరథ, జీవో నంబర్ 3,జీవో నంబర్ 317, భూమికి సంబంధించిన సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు అని తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు అని తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదింటి బిడ్డయినా తనకు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు, నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.



# మెట్రో రైళ్ల రాకపోకలకు అంతరాయం.. ప్రయాణికులకు ఫైన్

**విశ్వంభర, హైదరాబాద్ :** బుధవారం(జూన్ 05) సాయంత్రం నగరంలో ఉరుములతో కూడిన వర్షం దీంతో మియాపూర్– ఎల్బీనగర్ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. సాంకేతిక కారణాలతోనే నిలిపివేసినట్టు లోకో పైలట్లు వెల్లడించారు. తిరిగి 10 నిమిషాల అనంతరం మెట్రో రైలు సర్వీసులు తిరిగి ప్రారంభించారు. కాగా.. గమ్యస్థానాలకు చేరుకున్న ప్రయాణికులకు వింత అనుభవం ఎదురైంది. మెట్రో స్టేషన్లలో ఎక్కువ సేపు ఉండి కాలక్షేపం చేశారని ఒక్కొక్కరి నుంచి బలవంతంగా రూ.15 చొప్పున వసూలు చేశారు. ఒక ప్రయాణికుడు తాను చెల్లించిన జరిమానా రసీదును సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.సాంకేతిక లోపంతో రైలు ఆగిపోతే, జరిమానా ఎందుకు చెల్లించాలని ప్రయాణికుడు తన పోస్టులో ప్రశ్నించాడు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మెట్రో రైల్ యాజమాన్యం క్షమాపణలు చెప్పింది. "ఓవర్‌స్టేనింగ్"పై ప్రయాణికులకు విధించిన ఛార్జీలను తిరిగి చెల్లించినట్లు వెల్లడించింది. అయితే, ఎంత మంది ప్రయాణికులపై ఛార్జీ విధించారు..? ఎంతమందికి తిరిగి చెల్లించారు అనే వివరాలు వెల్లడించేందుకు మెట్రో రైల్ యాజమాన్యం నిరాకరించింది.

# కొంగాల ఘటనపై మావోయిస్టు నాయకురాలి లేఖ



**విశ్వంభర, ములుగు :** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని కొంగాల అటవీ ప్రాంతంలో జరిగిన ఘటనపై మావోయిస్టు వాజేడు వెంకటాపురం ఏరియా కార్యదర్శి శాంత పేరిట సోషల్ మీడియా వేదికగా ఓ లేఖను విడుదల చేశారు. లేఖలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. 3వ తేదీన కొంగాల అడవుల్లో కర్రెగుట్టపై వేట కోసం వెళ్ళి బూబీట్రాప్ ని తొక్కడంతో అది పేలి జగన్నాధపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల ఏసు మృతిచెందడం, అతడి కొడుకు స్వల్పంగా గాయపడ్డారని, వారి కుటుంబానికి మా పార్టీ తరఫున సానుభూతి వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాదులకు, కార్పొరేట్ ప్రయోజనాలకు అడవులను కట్టపెట్టడానికి స్థానిక ప్రజలకు అడవులపై ఎలాంటి హక్కులు లేకుండా చేసి ఆదివాసులను అడవుల నుంచి తరిమివేయాలనే పథకం రూపొందించారని పేర్కొన్నారు. కగార్ పేరుతో మావోయిస్టు పార్టీపై, ప్రజలపై దాడులు చేస్తూ నరసంహారం కొనసాగి ప్రజల్లో భయంకర పరిస్థితులు కల్పిస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని గుర్తుచేశారు. అందులో భాగంగానే వాజేడు– వెంకటాపురం ఏరియాలో కూడా మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో దాడులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తమ దళాల సమాచారం కోసం కొంతమంది లంపెన్ సెక్షన్‌ను స్వల్ప ఆర్థిక ప్రయోజనాలతో ప్రలోభపెట్టి ఇన్ ఫార్మర్‌గా మార్చుకుంటున్నారని తెలిపారు. వేటగాళ్ల వేషంలో ఇన్ ఫార్మర్లకు సెల్‌ఫోన్లు ఇచ్చి అడ్డవుల్లోకి పంపుతున్నారని ఆ సమాచారం ఆదారంగా పోలీసులు నిరంతరం కూంబింగ్‌లు చేపడుతున్నారని పేర్కొన్నారు. తమ సహచర కామ్రేడ్ సహచర కామ్రేడ్స్ సంతోష్ (సాగర్)తో పాటు, మనీరామ్, లక్ష్మణ్‌లు అమరులయ్యారని, ఈ ఘటన తరువాత మరింత కూంబింగ్‌ను పెంచి అడవులను జల్లెడ పడుతూనే ఉన్నారని తెలిపారు. తమ ఆత్మరక్షణకు ప్రజలు నిత్యం పనులు చేసుకునే స్థలాల్లో కాకుండా ప్రజలు తిరగని ఎత్తయిన కొండలపై అనేక ట్రాపులను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీసులు మాత్రం మావోయిస్టు పార్టీ దళాల సమాచార సేకరణతో పాటు, పోలీసులు కూంబింగ్‌కు వెళ్లేదారులను క్లియర్ చేయడానికి వేట పేరుతో కొద్దిమంది అమాయక ప్రజలను అడవుల్లోకి పంపి తమ రక్షణ కవచంగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఈ ఘటనకు పోలీసులే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి పౌరుడు నేడు అభివృద్ధి నిరోధకులు బ్రాహ్మణీయ హిందుత్వవాదులు కొనసాగిస్తున్న క్రూరమైన కగార్ దాడికి వ్యతిరేకంగా పోరాడక తప్పని పరిస్థితి ఏర్పడిందని, ఈ దాడిని ఓడించడం ప్రజలందరి బాధ్యత కూడా పోరాడమని పిలుపునిచ్చారు.



# 76,290 మందికి దోస్త్ ఫస్ట్ ఫేజ్ సీట్లు కేటాయింపు

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ (డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ) రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ మేరకు ఉన్నత విద్యా మండలి ఇవాళ మొదటి విడత సీట్లను విడుదల చేశారు. ఫేజ్–1లో భాగంగా మొత్తం 1,04,784 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 76,290 మందికి సీట్లు కేటాయించారు. ఆర్ట్స్ గ్రూపుల్లో 7,766, కామర్స్ 28,655, లైఫ్ సైన్సెస్ 15301, ఫిజికల్ సైన్సెస్ 14964, డేటా సైన్స్ 2502, డీ ఫార్మసీ 90, ఇతర గ్రూపుల్లో 7012 మంది విద్యార్థులు సీట్లు సాధించారు.ఈ సంవత్సరం కూడా కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో ప్రవేశపెట్టిన స్కిల్ కోర్సులను పలు కాలేజీల్లో విస్తరించారని తెలిసింది. ఈ ఏడాది జూలై 8 నుంచి ఫస్టియర్ క్లాసులు ప్రారంభమవుతాయని సమాచారం. కాగా, రాష్ట్రంలో 1,066 డిగ్రీ కాలేజీల్లో మొత్తం కలిపి 4,49,449 సీట్లున్నాయి. వీటిల్లో 135 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, 86 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. గత ఏడాది 3,89,049 సీట్లకుగాను 2.05లక్షల సీట్లు దోస్త్ ద్వారా నిండాయి.

# వంద మంది మోడీలు వచ్చినా బీఆర్ఎస్‌ను ఏమి చేయలేరు : ఎర్రోళ్ల శ్రీనివాస్



**విశ్వంభర, జూబ్లీహిల్స్ :** సీఎం రేవంత్ రెడ్డి అడలేక మద్దెల ఓడు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడారు బీఆర్ఎస్పి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు. వాస్తవంగా బీజేపీకి ఓటు బదిలీ చేసింది కాంగ్రెస్ నేతలే అని అన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను దింపిందని విమర్శించారు. సిద్దిపేటలో హరీష్ రావు బీజేపీకి ఓట్లు బదిలీ చేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించడం కరెక్ట్ కాదని అన్నారు. రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డి పల్లిలో బీజేపీకే ఆధిక్యత వచ్చిందని గుర్తుచేశారు. అంటే అక్కడ బీజేపీకి రేవంత్ రెడ్డే ఓట్లు బదిలీ చేశారా? అని ప్రశ్నించారు. కొండంగల్ అసెంబ్లీ ఎన్నికల్లో 30 వేలకు పైగా మెజారిటీ తెచ్చుకున్న రేవంత్ ఈ ఎన్నికల్లో 22 వేలకు పడిపోయారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ వస్తే మహబుబ్ నగర్ లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచే వారని అన్నారు. రేవంత్ రెడ్డి బీజేపీకి ఓట్లు బదిలీ చేసి అక్కడ డీకే అరుణను గెలిపించారని ఆరోపించారు స్వయంగా రాష్ట్ర మంత్రులే బీజేపీకి అవయవదానం చేశారని అన్నారు. వెయ్యిమంది రేవంత్లు వంద మంది మోడీలు వచ్చినా బీఆర్ఎస్ ను ఏమీ చేయలేరని అన్నారు.

# చంద్రబాబు, రేవంత్ కలిసి పనిచేస్తారా..?

**గురు, శిష్యుల బంధం మరింత పటిష్టం**





**విశ్వంభర, హైదరాబాద్:** రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు మిత్ర బృందమే అధికారంలో ఉందని చెప్పుకోవాలి. ఎందుకంటే తెలంగాణలో రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారు. అటు ఏపీలో కూడా చంద్రబాబు సీఎం కాబోతున్నారు. వీరద్దరూ గతంలో కలిసి పని చేసిన వారే. ఒక రకంగా చెప్పాలంటే రేవంత్ కు రాజకీయ జీవితం ఇచ్చింది టీడీపీ పార్టీనే. చంద్రబాబు సపోర్టుతోనే రేవంత్ ఎదిగారనే వాదన ఉంది. ఈ క్రమంలోనే ఇప్పుడు తన అభిమాన నాయకుడు చంద్రబాబు సీఎం కాబోతుండటంతో స్వయంగా రేవంత్ రెడ్డి ఫోన్ చేసి మరీ అభినందనలు తెలిపారు. చంద్రబాబు పిలిస్తే ప్రమాణస్వీకారానికి వెళ్తానంటూ ఆయనే స్వయంగా చెప్పారు. అంటే చంద్రబాబుతో కలిసి పనిచేయడానికి రేవంత్ సిద్ధంగా ఉన్నారనేది అర్థం అవుతోంది. ఈ క్రమంలోనే వీరిద్దరూ ముస్ముందు కలిసి పనిచేస్తారని తెలుస్తోంది. చంద్రబాబు కూడా మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో టీడీపీని పోటీ చేయిచంకుండా రేవంత్ కు సహకరించారని అంటారు. కాబట్టి వీరిద్దరూ రాజకీయంగా అటు రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఒకరికొకరు సహకారం అందించుకుంటారని అంటున్నారు. రెండు రాష్ట్రాల నడుమ ఉన్న నీటి పంచాయితీని తీరుస్తారని అందరూ ఆశగా ఉన్నారు. దాంతో పాటు రెండు రాష్ట్రాల నడుమ ఉన్న చాలా పెండింగ్ సమస్యలను వీరిద్దరూ పరిష్కరించే అవకాశాలు కూడా ఉన్నాయి. దాంతో పాటు ఒకరికి ఒకరు రాజకీయంగా సపోర్టు చేసుకుంటారని తెలుస్తోంది. మరి వీరిద్దరూ ఎలా ముందుకు వెళ్తారో చూడాలి.

# పిన్ కోడ్ పేచి..!

**విశ్వంభర, కుక్కునూరు జూన్ 6:** జిల్లాలు మారినా..రాష్ట్రాలు మారినా..ఇప్పటికీ తెలంగాణ పిన్ కోడే కొనసాగుతుంది ఆ మండలానికి.ఇంతకీ అదెక్కడ ఉందనుకుంటున్నారా.? ఎక్కడో కాదండీ..మన ఏపీలోనే..అది కూడా ఏలూరు జిల్లాలో ఉంది. వివరాల్లోకెళ్తే..ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో ఇలాంటి విచిత్ర పరిస్థితి నెలకొంది.రాష్ట విభజన జరిగి పది సంవత్సరాలు కావస్తున్నా.. ఇప్పటికీ ఆ మండలానికి అదే పిన్‌కోడ్ కొనసాగుతుండటంతో ప్రజలలో అయోమయం నెలకొంది. ప్రస్తుతం ఆ మండలానికి కొత్త పిన్‌కోడ్ '534444' వచ్చినా.. ఆ పిన్‌కోడ్ పూర్తిస్థాయి అమల్లోకి రాకపోవడంతో ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. గతంలో '507114' పిన్‌కోడ్ ఉండేది.రాష్ట్ర విభజన తర్వాత కుక్కునూరు మండలం ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైంది.అయినప్పటికీ మొన్నటిదాకా పిన్‌కోడ్ మాత్రం మారలేదు. ఇటీవల కొత్త పిన్‌కోడ్ వచ్చినా.. ఎలాంటి ఉపయోగం లేదు.

**కోడ్ ఉన్నా ఊరు లేదు**

'534444' పిన్‌కోడ్‌ను మూడేళ్ల క్రితం కేటాయించారు. కానీ ఆ పిన్‌కోడ్‌ను ఎవరు పరిగణలోకి తీసుకోవడం లేదు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొత్త పిన్‌కోడ్ కొట్టినా.. మండలం పేరు ఎక్కడా చూపించడం లేదు. ఇక చివరికి దిక్కుతోచని స్థితిలో పాత పిన్‌కోడ్ '507114'పైనే ఉత్తరాలు, పలు కీలక సేవలు కొనసాగుతున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీ షోలలో ఏదైనా వస్తువు ఆర్డర్ పెడదామన్నా..




పిన్‌కోడ్ గందరగోళం నెలకొనడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మనీ ఆర్డర్‌లు, ఇతరత్రా లావాదేవీలు పంపాలంటే.. చాలా అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యార్థులు కూడా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు.కాగా '50714' పిన్‌కోడ్ రాసి.. వయా బూర్గంపాడు అని చిరునామాతో అడ్రస్ పొందుపరిస్తేనే వచ్చే పరిస్థితి నెలకొంది. ఇక్కడ విచిత్రమేమిటంటే.. బూర్గంపాడు మండలం తెలంగాణలో ఉంది.



## పాల ఉత్పత్తిదారుల చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నిక

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) జూన్ 06 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కూరెళ్ల గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహాయక సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కాళీ ఏర్పడిన డైరెక్టర్ల స్థానంలో కంచర్ల విద్యాసాగర్ రెడ్డిని, భాషబోయిన కేతమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తదుపరి డైరెక్టర్లందరి సమావేశంలో మోతే పిచ్చి రెడ్డిని సంఘ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ డైరెక్టర్లకు మరియు సభ్యులకు మోతే పిచ్చిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా భాషబోయిన పాపయ్య యాదవ్ వ్యవహరించారు.

## ఇంటిని ఆక్రమించేందుకు యత్నం



**విశ్వంభర, బషీర్ బాగ్ జూన్ 06:** తమ పూర్వీకుల ఇంటిని ఆక్రమించేందుకు కొందరు నకిలీ పత్రాలు సృష్టించి దౌర్జనానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు రమేష్ శ్యామ్ సుందర్ పోలీసులను కోరారు. హైదరాబాద్ గౌలిగూడాలోని వందేళ్ల పురాతన ఇంటిని స్వాధీనం చేసుకొనేందుకు కబ్జాదారులు పోలీసులను, న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కబ్జాకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మద్దతు ఇస్తూ , పోలీసులను మ్యానేజ్ చేస్తున్నారని తెలియజేశారు. స్థానికులు కానీ అనురాధ, హిమబిందు అనే మహిళలు మరణించిన తమ పూర్వీకుల ఇంటిని 1971 లో అమ్మినట్లు పత్రాలు చూపెడుతూ, తమ ఆస్తిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తాము ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామని పేర్కొన్నారు. అయితే కేసు కోర్టులో ఉండగా, తమ ఇంటి తాళాలు పగలగొట్టి చట్టాన్ని అతిక్రమించారని అన్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక అఫ్జల్ గంజ్ పోలీసులు చూసి, చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాస్థానం ఎలాంటి తీర్పు ఇచ్చిన తాము అంగీకరిస్తామని, కానీ ఇలా దౌర్జన్యం చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తమ ఇంటి విషయంలో న్యాయస్థానం తీర్పు వచ్చే వరకు, ఇంటిని ఆక్రమించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

## డ్రైనేజీలను పరిశీలించిన పురపాలక కమీషనర్



**విశ్వంభర, ఆమనగల్లు జూన్ 06:** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీలను కమీషనర్ పరిశీలించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి 15వ వార్డులో అంతర్గత మురికి కాలువలు చెత్త ఇరుక్కుపోయి నీళ్లు పొంగిపోతున్నాయని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వసంత వార్డు కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ పరిశీలించి కాలువలను మున్సిపాలిటీ సిబ్బంది చేత మరమ్మత్తు చేయించడం జరిగింది. వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించవలసిందిగా వార్డు సభ్యులు కమిషనర్ వసంతను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగిళ్ల యాదయ్య, సోమరాజు గుండాలు, అబ్బాస్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్



**విశ్వంభర, పరిగి జూన్ 06:** వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్ ఫార్మర్ గత సంవత్సరం నుండి ప్రమాదకరంగా ఉందని, విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని పలువురు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్యను పరిష్కరించడం లేదని రైతులు వాపోయారు. వర్షాకాలంలో అటు నుండి మేత మేసే పశువులకు, రైతులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను, వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు.

## పొంచి ఉన్న ప్రమాదం

**విశ్వంభర, ఘట్కేసర్ 06:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ఎదులబాద్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి ఎదులాబాద్ పెట్రోల్ బంక్ వెళ్లే రహదారిలో ఒక చెట్టు పక్కకు ప్రమాదకర స్థితిలో ఒక వైపు ఒరిగి ఉండడంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు, కాలి నడకన వెళ్లే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షాకాలం కావడంతో ఈ చెట్టు ఎప్పుడు విరిగి మనుషుల మీద పడుతుందో అని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరగా స్పందించి చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.





# నాంపల్లిలో అగ్నిప్రమాదం ఫర్నీచర్ గోదాం దగ్ధం

**విశ్వంభర, నాంపల్లి :**

ఓ ఫర్నీచర్ గిడ్డంగిలో మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం గుర్తించిన వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది శకటాలతో హుటాహుటిన తరలివచ్చి, మంటలను ఆర్పేశారు.ఫర్నీచర్ షాపు కావడంతో మంటలు ఉవ్వెత్తున్న ఎగిసిపడ్డాయి. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాద కారణాలు ఇంకా తెలియలేదు. షార్ట్ సర్క్యూటే ప్రమాద ప్రమాదకారణంగా కావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఫర్నీచర్ గోదాం జనావాసం మధ్యలో ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ముందుజాగ్రత్తగా అధికారులు గోదాం ఆనుకుని ఉన్న ఇళ్లలోని ప్రజలను ఖాళీ చేయించారు. ఈ ప్రమాదంలో ప్రాణాపాయం తప్పింది. అగ్నిప్రమాద కారణాలు, నష్టంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎన్డీఏ సమావేశం



**విశ్వంభర, ఢిల్లీ:** బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) కొత్తగా ఎన్నికైన ఎంపీల సమావేశము శుక్రవారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరగనుంది.ఈ సమావేశాలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎంపీలు పాల్గొంటారు. కూటమి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అంశంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో అధికార బీజేపీ 240 సీట్లకు పరిమితం అయిన నేపథ్యంలో భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం పార్టీ, జేడీయూ పార్టీల సహకారం తప్పనిసరి అయింది. అంతకుముందు బుధవారం ఎన్డీయేలోని పార్టీల నేతలు సమావేశమై ప్రధాని నరేంద్ర మోడీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి ఎన్డీఏ కృషి చేస్తుందని అన్నారు. మోడీని ఎన్నుకునే తీర్మాన ప్రతిని సంకీర్ణ నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేయనున్నారు.కాగా, జూన్ 9 వ తేదీన నరేంద్ర మోడీ వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## వైసీపీ ఈవీఎం ట్యాంపరింగ్ చేశారనడం సిగ్గుచేటు : ఎమ్మెల్యే సత్యప్రసాద్

**విశ్వంభర, ధర్మవరం:** ఆంధ్ర ప్రదేశ్ లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి 165 సీట్లను గెలుచుకుని విజయం సాధించింది. 2019లో 151 సీట్లను గెలుచుకున్న వైసీపీ ఈ ఎన్నికల్లో కేవలం 11 సీట్లలో మాత్రమే గెలుపొంది ఘోర పరాజయమ పాలైంది.అయితే, వైసీపీ అధికారంలో ఉన్న నాడు ప్రతిపక్ష నాయకులపై జరిగిన అవమానాలపై పలువురు నాయకులు స్పందిస్తున్నారు. ఈ క్రమంలోనే ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యే సత్యప్రసాద్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న నాడు చేసిన తప్పులకు ఇప్పుడు వైసీపీ భయపడుతోందని , ముందు కక్ష సాధింపు చర్యలు మొదలు పెట్టిందే జగన్ అని ఆరోపించారు. ప్రజాగ్రహానకి గురైన వైసీపీ ఈవీఎం ట్యాంపరింగ్ చేశారంటూ ఆరోపించడం సిగ్గుచేటుగా ఉందని ఎద్దేవ చేశారు. ప్రజా తీర్పును వైసీపీ నేతలు తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో వైసీపీ ఎమ్మెల్యేను బీజేపీ గడప కూడా తొక్కనివ్వదని సత్యకుమార్ అన్నారు.



## హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ రైస్ సమ్మిట్..: మంత్రి తుమ్మల

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ లో శుక్రవారం, శనివారం ఇంటర్నేషనల్ రైస్ సమ్మిట్ జరుగుతోందని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 22 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో సదస్సులు నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కమిడిటీ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ సమ్మిట్ జరుగుతోంద ఆయన తెలిపారు. మొట్టమొదటి సారిగా భారతదేశంలో మన హైదరాబాదులో ఈ సమ్మిట్ నిర్వహించటానికి నిర్ణయించుకున్నారని, ఇది తెలంగాణకు గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 150 ప్రతినిధులు ఈ సమ్మిట్ లో పాల్గొనబోతున్నారని, వివిధ దేశాల వరి ఎగుమతి దిగుమతి దారులతోపాటు వరి వంగడాల పరిశోధకులు ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. భారతదేశం నుంచి సీడ్ కంపెనీల ప్రతినిధులు,రైస్ మిల్లర్లు అభ్యుదయ రైతులు, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ పాల్గొనబోతున్నారని, ఈ సదస్సు వల్ల తెలంగాణలో వరి పండించే రైతులకు మేలు జరిగే విధంగా దిగుబడినిచ్చే వంగడాలపై పలు సూచనలు చేయనున్నారని ఆయన



అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏ రకం వరి ధాన్యనికి డిమాండ్ ఉందో రైతులకు అవగాహన కల్పించనున్నారని, విత్తనోత్పత్తిలో ఆధునిక పరిజ్ఞానంపై చర్చించనున్నారని మంత్రి తుమ్మల అన్నారు. ప్రపంచంలో 100 దేశాలకు భారత్ నుంచి రైస్ ఎగుమతి జరుగుతుందని, రేపు ఉదయం తాజ్ కృష్ణ హోటల్లో 9 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కార్యక్రమం జరగబోతోందన్నారు మంత్రి తుమ్మల అన్నారు. ఈ సదస్సులో నాతో పాటు సివిల్ సప్లై అండ్ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పాల్గొనబోతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యే అవకాశం ఉందన్నారు.

## 15 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

**విశ్వంభర, పరిగి జూన్ 06:** అక్రమంగా తరలిస్తున్న 115 క్వింటల్లా రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు గురువారం వికారాబాద్ జిల్లా పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ తెలియజేశారు. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిరాల ప్రకారం పరిగి మండలం రాఘవపూర్ గేట్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు రాఘవపూర్ గేట్ చెక్ పోస్ట్ దగ్గర షాధ్ నగర్ నుండి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న డీసీఎం నెంబర్ కేఏ 33ఏ 8756 వాహనంలో 115 క్వింటల్లా రేషన్ బియ్యాన్ని పట్టుకోవడం జరిగింది. అనంతరం పంచనామ నిర్వహించి స్వాధీనం చేసుకొని డ్రైవర్ కాశీనాథ్, డీసీఎం వాహనం ఓనర్ శంకర్ పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, పరిగి జూన్ 06:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కార్యవర్గ సభ్యులు సాయి గణేష్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి ప్రాంతంలో మధ్యతరగతి విద్యార్థులు పుస్తకాలు కోనాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా ప్రైవేటు పాఠశాలలు ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నాయని అన్నారు. ఈ ప్రైవేటు దందాపై అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ తరుపున డిమాండ్ చేశారు.

## పెద్దపల్లి జిల్లా పొత్కపల్లి గ్రామంలో సంచారం



**విశ్వంభర, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో చిరుత సంచారం కలకలం రేపుతోంది. పొత్కపల్లి గ్రామంలోని రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు సీసీ పుటేజ్ ఆధారంగా స్థానికులు గురువారం గుర్తించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో రైలు గేటు పడిన తర్వాత ప్రజలెవరూ లేకపోవడంతో రహదారిపై నుంచి వ్యవసాయ క్షేత్రాల్లోకి చిరుత పులి వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో దృశ్యాలు నమోదు అయ్యాయి. చిరుత సంచారంతో గ్రామస్థులు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. వెంటనే ఈ విషయంపై గ్రామస్థులు పెద్దపల్లి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. చిరుత పులి సంచరించిన ప్రాంతంలో అటవీ సిబ్బంది బుధవారం సాయంత్రం పాదముద్రలు సేకరించే పనిలో పడ్డారు. కానీ చిరుత పాదముద్రలు లభించలేదని అధికారులు తెలిపారు. అయినా గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా అటవీ ప్రాంతం నుంచి చిరుతలు జనావాసాల్లోకి రావడం పరిపాటిగా మారిపోయింది.

## మోదీ, షా స్టాక్ మార్కెట్ల స్కాం..బీజేపీ ఎంపీ కౌంటర్

**విశ్వంభర, ఢిల్లీ:** మోదీ, షా స్టాక్ మార్కెట్ల స్కాంకు పాల్పడ్డారన్న రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ పియూష్ గోయల్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందనే భయంతో స్టాక్ మార్కెట్ పడిపోయిందని అన్నారు. తిరిగి మోదీ ప్రభుత్వమే రావడంతో కుదురుకుంటోందని అన్నారు.మరోవైపు కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలోని ప్రతి మహిళకు రూ. లక్ష ఇస్తామనే హామీని ఎప్పుడు నెరవేరుస్తారంటూ కాంగ్రెస్ను ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. కాగా, ప్రధాని మోదీ, అమిత్ షా స్టాక్ మార్కెట్ల స్కాంకు పాల్పడ్డారని ,జేపీసీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'షేర్లు కొనాలని పిలుపునిచ్చి మోదీ, షా విధులను దుర్వినియోగం చేశారు. జూన్ 3న స్టాక్ మార్కెట్లు పెరుగుతాయని షాకు ఎలా తెలుసు. ఎగ్జిట్ పోల్స్తో ఆ రోజు పెరిగిన స్టాక్ మార్కెట్లు జూన్ 4న పతనమయ్యాయి. ఇందులోనూ వారి ప్రమేయముంది' అని రాహుల్ విమర్శించారు.





## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా శివరాజ్ సింగ్ చౌహాన్...?

విశ్వంభర, ఢిల్లీ : 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన విధంగా ఫలితాలు రాకపోవడంతో బీజేపీ అధిష్టానం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ నెల 9 ఎన్డీయే కూటమి అభ్యర్థిగా మోడీ మరోసారి ప్రధానిగా ప్రమాణం చేయనున్నారు. ఈ క్రమంలో దేశంలోని కీలక నేతలందరినీ ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపునిస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను మార్చలనే ఆలోచనలో ఆ పార్టీ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మధ్యప్రదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో 29 సీట్లను గెలిపించి క్లీన్ స్వీప్ చేసిన మాజీ సీఎం, మామాజీ గా మంచి పేరును సంపాదించుకున్న శివరాజ్ సింగ్ చౌహన్‌కి బీజేపీ జాతీయ అధ్యక్షుడి బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోపక్క చౌహన్‌కు కేంద్ర క్యాబినెట్‌లో అత్యంత కీలక మంత్రిగా తీసుకొనున్నారని కూడా జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. వీటిపై క్లారిటీ రావాలంటే.. రేపటి మీటింగ్ ముగిసే వరకు వేచి చూడాల్సిందే మరి.



## జీవితంలో గెలుపు ఓటములు సహజం : నవీన్ పట్నాయక్

విశ్వంభర, ఒడిశా: దాదాపు పాతిక సంవత్సరాలుగా ఒడిశాలో తిరుగులేని నేతగా ఉన్న నవీన్ పట్నాయక్ ఈసారి ఓటమిని చవి చూడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ఆ పార్టీ స్థానంలో బీజేపీ బలమైన రాజకీయ శక్తిగా అవతరించింది. ఒడిషాలో బీజేపీ ఫస్ట్ టైమ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఐదు టర్ములుగా పవర్‌లో ఉన్న బిజూ జన తాదళ్ కేవలం 53 స్థానాల దగ్గరే ఆగిపోయింది. తాజాగా ఓటమిపై నవీన్ పట్నాయక్ స్పందించారు. ఆయన పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ జీవితంలో గెలుపు ఓటములు సహజం అని అన్నారు. ఓడిపోయామని సిగ్గు పడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని చెప్పారు. తాను తొలిసారి సీఎం అయినప్పుడు రాష్ట్రంలో 70 శాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవారని గుర్తుచేశారు. తన 24 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో దానిని 10 శాతానికి తగ్గించానని ధీమా వ్యక్తం చేశారు. బీజేడీ సేవలు ఇక్కడితో ఆగిపోవని.. ఇకపైనా కొనసాగుతాయని అన్నారు. కాగా, ఈ ఎన్నికల్లో బీజేపీకి 78, బీజేడీకి 51 సీట్లు వచ్చాయి.



## నరేంద్ర మోదీ ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తారా?: జైరాం రమేశ్

విశ్వంభర, ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక హోదా ఇస్తారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏపీతో పాటు బీహార్ రాష్ట్రానికి హోదా ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని మోదీ నెరవేరుస్తారా? అని నిలదీశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా నాలుగు ప్రశ్నలు సంధిస్తూ పోస్ట్ చేశారు. ఏపీకి హోదా ఇస్తామని ఏప్రిల్ 30, 2014న తిరుపతి వేదికగా మోదీ హామీ ఇచ్చారు... దీంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికి పదేళ్లయినా హోదా ఇవ్వలేదని... ఇప్పుడు ఏం చేస్తారో చెప్పాలన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అన్ని పార్టీలు వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ ప్రైవేటీకరణను ఆపేస్తారా? అని ప్రశ్నించారు. ఎన్డీయే కూటమిలో ఉన్న నితీశ్ కుమార్ ఎంతో కాలంగా బీహార్‌కు ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తున్నారని... ఇప్పుడు ప్రధాని మౌనం వీడాలన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీయూలతో కొనసాగిన మహాఘట్‌బంధన్ హయాంలో రాష్ట్రంలో కులగణన చేపట్టామని... దీనిని దేశవ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నితీశ్ కూడా ఇందుకు మద్దతు తెలుపుతున్నారని... మరి ప్రధాని కులగణన చేస్తారా? అని ప్రశ్నించారు.

# మారిన చంద్రబాబును చూస్తారు

- ఇకపై బ్యూరోక్రాట్స్ పాలన ఉండదు
- ఎంపీలందరూ తరచూ వచ్చి కలవాలి
- టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రాణాలు ఇచ్చారు
- ఇకపై రాజకీయ పాలనే కొరసాగిస్తా
- ఎంపీలతో జరిగిన భేటీలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, విజయవాడ:** 'చంద్రబాబు మారరు అనే అపవాదు నాపై ఉంది... కానీ మీరు మారిన చంద్రబాబును చూస్తారు. ఇక అలా ఉండదు... మీరే ప్రత్యక్షంగా చూస్తార'ని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ ఎంపీలతో జరిగిన భేటీలో టీడీపీ అధినేత కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై బ్యూరోక్రాట్స్ పాలన ఎంతమాత్రమూ ఉండదన్నారు. రాజకీయ పరిపాలన సాగుతుందని స్పష్టం చేశారు. ఎంపీలు అందరూ తరుచూ తనను వచ్చి కలవాలని సూచించారు. బిజీగా ఉన్నప్పటికీ మీతో మాట్లాడుతానని స్పష్టం చేశారు. తన కోసం ఈ ఐదేళ్లు నేతలు, కార్యకర్తలు ప్రాణాలు ఇచ్చారన్నారు. కత్తి మీద పెట్టినా జై టీడీపీ, జై చంద్రబాబు అన్నారని గుర్తు చేసుకున్నారు. అధికార పార్టీ ఒత్తిడికి ఎవరూ తలొగ్గలేదని పేర్కొన్నారు. ఇకపై ప్రతి అంశాన్ని వింటాను... నేనే స్వయంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ కలిసి పని చేయాలని సూచించారు. అందరూ ఎవరి పరిధిలో వారు పని చేయాలన్నారు. ఈ అయిదేళ్లు నేతలు, కార్యకర్తలు పడిన ఇబ్బందులు తనకు మనోవేదన కలిగించాయని భావోద్వేగానికి లోనయ్యారు.

## స్మృతి ఇరానీపై కిషోర్ లాల్ శర్మ కూతురు ఫైర్



**విశ్వంభర, ఢిల్లీ:** కాంగ్రెస్ కంచుకోట అమేథీలో గాంధీ కుటుంబానికి నమ్మకస్తుడు అయిన కిషోరి లాల్ శర్మ, స్మృతి ఇరానీపై 1,60,000 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.ఈ నేపథ్యంలో కిషోరి లాల్ కూతురు అంజలి, స్మృతి ఇరానీపై విమర్శలు చేశారు. "స్మృతి ఇరానీ మా నాన్నను, ప్యూన్, ప్రాక్సీ, సేవకుడు, చీమ అని ఎలాగైనా పిలవవచ్చు.. మేము వాటిని పట్టించుకోము.. దానికి సమాధానంగా ఈ నంబర్లే మాట్లాడుతాయి అని అన్నారు. ఆమె ప్రియాంక గాంధీ గారిని అనుకరించింది.. అది చాలా బాగుంది, స్మృతి ఇరానీ మంచి నటి" అని అంజలి ఎద్దేవ చేశారు. అంతకు ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా స్మృతి ఇరానీ ఒక సమావేశంలో కిషోరి లాల్ శర్మను "ప్యూన్" అని "ప్రియాంక గాంధీ "గుమాస్తా" అని విమర్శలు చేసింది. ఈ వ్యాఖ్యలకు కౌంటర్‌గా కిషోర్ లాల్ శర్మ చిన్న కుమార్తె అంజలి ఇరానీపై అన్న వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎన్నికల్లో గెలిచిన అనంతరం శర్మ మాట్లాడుతూ, ఇది అమేథీ ప్రజలు, గాంధీ కుటుంబం విజయమని, అమేథీ నియోజకవర్గం గాంధీ కుటుంబానికి చెందింది. వారు నాపై ఉంచిన నమ్మకానికి ఎలాంటి భంగం కలగకుండా చూసుకుంటానని తెలిపారు.



## ముగ్గురు బీజేపీ ఎంపీలు టచ్‌లో ఉన్నారు : టీఎంసీ

**విశ్వంభర, కోల్ కత్తా :** పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ పార్టీ సంచలన వ్యాఖ్యలు చేసింది. బీజేపీ నుంచి గెలుపొందిన ముగ్గురు ఎంపీలు తమతో టచ్‌లో ఉన్నారని పేర్కొంది. కానీ టీఎంసీ ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఇది తప్పుడు ప్రచారమంటూ విమర్శలు చేసింది. ఇదిలా ఉండగా.. బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో మమతా బెనర్జీ సర్కార్ కంటే బీజేపీకి ఎక్కువగా సీట్లు వస్తాయని అంచనా వేశాయి. చివరికి ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పయ్యాయి. గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ సీట్లు సాధించింది. 2019లో టీఎంసీ 22 ఎంపీ సీట్లు గెలుచుకోగా.. ఈసారి 29 స్థానాల్లో గెలిచింది. ఇక బీజేపీ 2019లో 19 సీట్లు గెలుచుకోగా.. ఈసారి మాత్రం 12 స్థానాల్లో విజయం సాధించింది.

## యూపీ ప్రజలు సత్యాన్ని అర్థం చేసుకున్నారు : ప్రియాంక గాంధీ



**విశ్వంభర, ఢిల్లీ :** ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి అత్యధిక స్థానాల్లో గెలుపు అందించిన ఉత్తరప్రదేశ్ ప్రజలపై కాంగ్రెస్ అగ్రనేత ప్రశంసల వర్షం కురిపించారు. ఈ దేశంలో సత్యాన్ని అర్థం చేసుకున్నారని, వారు చూపిన విశ్వాసం పట్ల గర్వపడుతున్నానని కొనియాడారు. రాజ్యాంగాన్ని రక్షించడానికి చేసే ప్రయత్నంలో గట్టి సందేశాన్ని పంపారని తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రియాంకా ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'యూపీ కాంగ్రెస్ శ్రేణులందరికీ నా వందనం. మీరు ఎండలో, దుమ్ములో కష్టపడి పనిచేయడం చూశాను. మీపై ఫేక్ కేసులు పెట్టారు, పదే పదే గృహ నిర్బంధంలో ఉంచారు. కానీ దేనికీ భయపడి పారిపోలేదు. అంతేగాక ఎంతో దృఢంగా నిలబడ్డారు. ఈ కష్టానికి తగిన ఫలితాన్ని యూపీ ప్రజలు అందించారు' అని పేర్కొన్నారు. నేటి రాజకీయాల్లో పాత ఆదర్శాలను యూపీ ప్రజలు మళ్లీ నెలకొల్పారని వెల్లడించారు. ప్రజల సమస్యలే ప్రధానమని, వాటిని విస్మరిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే పై చేయి సాధించారన్నారు. కాగా, యూపీలోని 80 స్థానాలకుగాను ఇండియా కూటమి 43 సీట్లు కైవసం చేసుకుంది. మరోవైపు కేరళలోని వయనాడ్, యూపీలోని రాయ్ బరేలీ లోక్ సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన రాహుల్ గాంధీ రెండు స్థానాల్లో గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే వయనాడ్ నుంచి ఎంపీగా కొనసాగడానికి రాహుల్ సుముఖంగా ఉన్నారని, రాయ్ బరేలీ నుంచి ఉప ఎన్నిక నిర్వహిస్తే అక్కడ నుంచి ప్రియాంక బరిలోకి దిగుతుందనే ఊహాగానాలు వెలువడుతున్నాయి.

## ఫడ్నవీస్ ఓ విలన్.. సంజయ్ రౌత్ తీవ్ర విమర్శలు



**విశ్వంభర, ముంబై:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ పై శివసేన (యూబీటీ) నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మహారాష్ట్ర రాజకీయాల్లో ఫడ్నవీస్ ఒక విలన్ లాంటి వారని అభివర్ణించారు. ఎన్నో కుటుంబాలను ఆయన నాశనం చేశారని, ప్రతీకార రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఢిల్లీలో గురువారం సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో విలన్ ఎవరైనా ఉన్నారంటే అది ఫడ్నవీస్ అని, లోక్సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కూడా ఆయనే కారణమని నొక్కి చెప్పారు. 2014, 2019 లోక్సభ ఎన్నికల్లో బీజేపీకి బ్రూట్ మెజారిటీ వచ్చిన తర్వాత మోడీ, అమిత్ షా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ను బానిసలుగా మార్చేందుకు ప్రయత్నించారని, అయితే ఆర్ఎస్ఎస్ ఇప్పుడు మోడీని ఇంటికి పంపే స్థితిలో ఉందన్నారు. 2024 లోక్సభ ఎన్నికల్లో ఓటమి పాలైనందున మోడీ ప్రధాని కాలేరని అన్నారు. ఒకవేళ మూడోసారి బలవంతంగా ప్రధాని కావాలని ప్రయత్నిస్తే ఆయన ప్రభుత్వం కొనసాగదని, ప్రత్యామ్నాయం కోసం ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని తెలిపారు. మోడీపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. ఎన్నికలు మొత్తం మోడీ ఆధ్వర్యంలోనే జరిగినప్పటికీ మెజారిటీ రాలేదని చెప్పారు.. మోడీ నాయకత్వాన్ని అంగీకరించడానికి దేశ ప్రజలు సిద్ధంగా లేరని అర్థమైందన్నారు. ఫడ్నవీస్ డిప్యూటీ సీఎం పదవి నుంచి వైదొలగాలని ప్రతిపాదించిన మరుసటి రోజే సంజయ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు : ఆప్



**విశ్వంభర, ఢిల్లీ:** వచ్చే ఏడాది జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్‌తో పొత్తు కేవలం లోక్‌సభ ఎన్నికలకు మాత్రమేనని ఆ పార్టీ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ గురువారం వెల్లడించారు. ఆప్ ఎమ్మెల్యేలతో గురువారం భేటీ నిర్వహించిన అనంతరం రాయ్ ఈ ప్రకటన చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని తొలిరోజే స్పష్టం చేశామని గోపాల్ రాయ్ ప్రస్తావించారు. ఆప్ తన సంపూర్ణ బలంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడుతుందని అన్నారు. కాగా 2025 ప్రారంభంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఢీకొట్టేందుకు ఆప్ పార్టీ ఇండియా కూటమిలో చేరిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాలు ఉండగా పొత్తులో భాగంగా నాలుగు సీట్లలో ఆప్, మూడు స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేశాయి. అయితే అనూహ్య రీతిలో మొత్తం స్థానాలను బీజేపీ గెలుచుకుంది. కాంగ్రెస్, ఆప్ కనీసం ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఢిల్లీ, పంజాబ్, గుజరాత్‌లలో కూడా కాంగ్రెస్, ఆప్ సహకరించుకున్న విషయం తెలిసిందే.

## లోక్ సభ విపక్ష నేతగా రాహుల్ గాంధీ: డీకే శివకుమార్




**విశ్వంభర, బెంగళూరు :** కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లోక్సభలో విపక్ష నేతగా రాహుల్ వ్యవహరించబోతున్నారని అన్నారు. మోడీ సర్కార్ను రాహుల్ గాంధీ కంటే బలంగా ఎవరు ప్రశ్నించలేరు అని అభిప్రాయపడ్డారు. మోడీ సర్కార్ను దేశ వ్యాప్తంగా ప్రజలు తిరస్కరించారని విమర్శలు చేశారు. 400 సీట్లు అని గొప్పలకు పోయి కూటమికి కూడా 293 సీట్లే వచ్చాయని ఎద్దేవా చేశారు. మరోవైపు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్కు ఆదరణ పెరిగిందని వెల్లడించారు. బీజేపీ రాజకీయ ఎత్తుగడలను ప్రజలు కూడా పసిగట్టారని అన్నారు. మతం, కులం పేరుతో ఓట్లు రాబట్టుకోవడం అన్నిసార్లు సాధ్యం కాదని తెలిపారు. కాగా, ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైనన్నీ సీట్లు సాధించినా.. ఏ పార్టీకి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత మెజారిటీ మాత్రం దక్కలేదు. ఈ నేపథ్యంలో సంకీర్ణ సర్కారు ఏర్పాటుకు ఎన్డీఏ సిద్ధమవుతోంది.



## గాజాలోని పాఠశాలపై ఇజ్రాయెల్ దాడి.. 39మంది మృతి!

**గాజా:** ఇజ్రాయెల్ హమాస్ మధ్య యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. గాజాపై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడుతూనే ఉంది. తాజాగా గాజా పట్టీలో దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ ఒక పాఠశాల ప్రాంగణంలో ఉన్న హమాస్ శిబిరంపై దాడి చేసింది. ఐక్యరాజ్యసమితి సాయంతో నడుస్తున్న పాఠశాలపై తమ యుద్ధవిమానాలు దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం అధికారికంగా ప్రకటించింది. ఈ బడిని తమ ఆపరేషన్లకు రక్షణగా హమాస్, ఇతర ఉగ్రసంస్థలు ఉపయోగిస్తున్నారని ఐడీఎస్ పేర్కొంది. దాడికి ముందు పౌరులకు ఎలాంటి హాని జరగకుండా వీలైనంత వరకూ జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపింది. అయితే హమాస్ అనుబంధ మీడియా అల్అక్సా టెలివిజన్ మాత్రం ఇజ్రాయెల్ దాడిలో 39 మంది... చనిపోయినట్లు తెలిపింది. పాలస్తీనా మీడియా వాఫా మాత్రం 32 మంది మృతి చెందారని వెల్లడించింది. డజన్ల సంఖ్యలో గాయపడినట్లు తెలిపింది.



## బర్డ్ ఫ్లూతో తొలి మరణం.. డబ్ల్యూహెచ్‌ఓ ధ్రువీకరణ



**విశ్వంభర, ఢిల్లీ:** కొన్ని రోజులుగా ప్రపంచాన్ని కలవరపెడుతున్న బర్డ్ ఫ్లూ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. సాధారణంగా పక్షులకు మాత్రమే పరిమితం కాలేదు. తాజాగా ప్రపంచంలో తొలి బర్డ్ ఫ్లూ మరణం సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకూ ఈ వేరియంట్ మనుషులకు సోకడం దాదాపు అసాధ్యంగా భావించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. అయితే బర్డ్ ఫ్లూ ఇప్పుడు పక్షులు, జంతువులతో పాటు మనుషులకూ వ్యాపిస్తోంది. అంతేకాదు తాజాగా బర్డ్ ఫ్లూ కారణంగా ప్రపంచంలో తొలి మరణం సంభవించింది. మెక్సికో దేశంలో హెచ్5ఎన్2 బర్డ్ ఫ్లూ వేరియంట్ బారినపడిన 25ఏళ్ల ఓ వ్యక్తి ఇటీవల మరణించినట్లు డబ్ల్యూహెచ్‌వో ధ్రువీకరించింది. జ్వరం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు, విరేచనాలు, కడుపులో తిప్పడం తదితర సమస్యలతో బాధపడ్డ రోగి ఏప్రిల్ 24న కన్నుమూశాడు. బాధితుడు బర్డ్ ఫ్లూ బారిన పడిన విషయాన్ని మెక్సికో అధికారులు మే 23న ప్రపంచ ఆరోగ్య సంస్థకు సమాచారం అందించారు. అయితే రోగికి వ్యాధి ఎలా సోకిందనే దానిపై సమాచారం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అయితే, మెక్సికోలోని కోళ్లల్లో హెచ్5ఎన్2 ఇన్ఫెక్షన్లు వెలుగు చూసినట్లు పేర్కొంది. అయితే, కోళ్ల నుంచి మనిషికి ఈ వ్యాధి ఎలా వ్యాపించిందో నిర్ధారించడం కష్టంగా మారిందని డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించింది. మరోవైపు, అమెరికాలో బర్డ్ ఫ్లూకు చెందిన కొత్త వేరియంట్ వ్యాపిస్తోంది. అయితే, ఇది రోగుల నుంచి ఇతరులకు వ్యాపిస్తోందనేందుకు ఇంతవరకూ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని అధికారులు పేర్కొన్నారు.





## కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం..

**ఏడాదిలో ఇది 11వ ఘటన!**



**విశ్వంభర, ముంబై :** ప్రవేశ పరీక్షలు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల వరుస బలవన్మరణాలు కొనసాగుతున్నాయి. చదువులో ఒత్తిడి కారణంగా ఇప్పటికే పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో విద్యార్థిని తనువు చాలించింది. కాగా, ఈ ఘటనతో కలిపి ఈ ఏడాది కోటాలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఇది 11వ ఘటన. ఇక గతేడాది ఏకంగా 30 మంది వరకు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇక తాజా ఘటన వివరాల్లోకి వెళితే.. మధ్య ప్రదేశ్‌లోని రేవాకు చెందిన బగీషా తివారీ (18) అనే యువతి తన తల్లి, సోదరుడితో కలిసి కోటాలోని జవహర్ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటోంది. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (యూజీ) కు సిద్ధమవుతున్న ఆమె కోటాలో కోచింగ్ తీసుకుంటోంది. అయితే, ఆమె మంగళవారం నీట్–యూజీ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత బుధవారం సాయంత్రం బలవన్మరణానికి పాల్పడింది. తాను నివాసం ఉంటున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మహారావ్ భీమ్ సింగ్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విద్యార్థి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు



## గూడ్స్‌ను ఢీకొన్న ప్యాసింజర్ రైలు.. నలుగురు దుర్మరణం

**విశ్వంభర, నేషనల్ :** ఐరోపా దేశమైన చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రాగ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున ఓ గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 23 మంది తీవ్రగాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రాగ్‌కు తూర్పున 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్దుబిస్ నగరంలో ప్రైవేట్ రెజియోజెట్ కంపెనీకి చెందిన ప్యాసింజర్ రైలు గూడ్స్ రైలును ఢీకొంది. స్లోవేకియా సరిహద్దుకు దగ్గరగా ఉన్న పశ్చిమ ఉక్రేనియన్ నగరమైన చాప్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ప్యాసింజర్ రైలులో 300 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. వీరిలో చాలా మంది విదేశీయులు ఉన్నారు. ఈ ఘటనతో తూర్పు భాగం గుండా ఒక ప్రధాన ట్రాక్ మూసివేయవలసి వచ్చిందని ఆ దేశ మంత్రి విట్ రాకుసన్ తెలిపారు. ప్రైవేట్ ట్రెరెజియోజెట్ కంపెనీ నిర్వహించే ఈ రైలు వెళ్తుండగా పార్దుబిస్ మెయిన్ స్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగిందని చెక్ రిపబ్లిక్ దేశ రవాణా శాఖ మంత్రి మార్టిన్ కుప్కా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఘటనపై అధికారులు విచారణ కొనసాగుతుందన్నారు. ఇక, గూడ్స్ రైలు కాల్షియం కార్బైడ్ ను తీసుకువెళుతుందని స్థానిక అగ్నిమాపక శాఖ ప్రతినిధి వెందుల హోరకోవా పేర్కొన్నారు.

# షర్మిల పార్టీ ఫండ్ నొక్కేసింది : సుంకర పద్మశ్రీ



**విశ్వంభర, విజయవాడ :** ఏపీ కాంగ్రెస్ లో గొడవలు మొదలయ్యాయి. అప్పుడే షర్మిల మీద తిరుగుబాటు చేస్తున్నారు ఆ పార్టీ నేతలు. తాజాగా షర్మిల మీద ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ సంచలన ఆరోపణలు చేశారు. ఇన్నిరోజులు రాహుల్ గాంధీమీదున్న అభిమానంతో షర్మిలను ఏమీ అనలేకపోయామని.. కానీ షర్మిల మాత్రం కక్షపూరిత చర్యల కోసమే కాంగ్రెస్ లోకి వచ్చిందని మండిపడ్డారు. మొన్న ఎలక్షన్లలో పార్టీ ఇచ్చిన ఫండ్ ను షర్మిల ఒక్కతే కాజేసిందని సంచలన ఆరోపణలు చేశారు. పీసీసీ ప్రెసిడెంట్‌గా పని చేసిన షర్మిల నైతిక బాధ్యతగా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలకు కనీసం జెండాలు కూడా ఇవ్వకుండా.. ఆ డబ్బులు కూడా కాజేసిందని ఆరోపించారు పద్మ శ్రీ. పార్టీలో సీనియర్లను చెత్తబుట్టల్లాగా చూసిందని.. కనీసం ఏ ఒక్కరికీ కూడా విలువ ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించిందని షర్మిలపై ఆమె మండిపడ్డారు. షర్మిల తప్ప కాంగ్రెస్ లో ఏ ఒక్కరూ మాట్లాడే పరిస్థితి లేదన్నారు. మాణిక్కం ఠాగూర్ కూడా షర్మిలకే వత్తాసు పలికారని.. రాహుల్ గాంధీని కూడా ఎన్నికల ప్రచారానికి రప్పించలేకపోయారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే షర్మిల సంగతి ఢిల్లీలో చూసుకుంటామని.. ఆమెను పదవి నుంచి తీయించేస్తామని వార్నింగ్ ఇచ్చారు పద్మశ్రీ. ఈ సమావేశంలో కొందరు ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా పాల్గొన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు.. షర్మిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





# ఏపీ నుంచి కేంద్ర మంత్రులు వీరేనా..?

- లిస్ట్‌లో టీడీపీ, జనసేన ఎంపీలు
- బీజేపీ నుంచి పురంధరేశ్వరి
- టీడీపీ నుంచి రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని
- జనసేనలో నుంచి ఎంపీ బాలశౌరి
- నేడో, రేపో కొలిక్కి రానున్న జాబిత

**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అటు కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. రెండు చోట్లా చంద్రబాబుకు తిరుగులేని పవర్ దక్కింది. అటు కేంద్రంలో కూడా ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే చంద్రబాబు దయతలిచే పరిస్థితి వచ్చింది. అందుకే ఇప్పుడు ఏపీ నుంచి కేంద్రమంత్రులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందంటున్నారు.ఈ సారి ఏపీ కోటాలో టీడీపీ నుంచి రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు ఇంకొందరు కూడా పోటీలో ఉన్నారు. చంద్రబాబు కనీసం నాలుగు కేంద్రమంత్రి పదవులు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. అటు జనసేనలో ఇద్దరు ఉన్నారు కాబట్టి.. ఒకరికి అయినా ఇస్తారని అంటున్నారు. ఆ ఛాన్స్ వస్తే జనసేనలో సీనియర్ అయిన మచిలీపట్నం ఎంపీ బాలశౌరికి అదృష్టం వరిస్తుంది. ఇక ఏపీ నుంచి బీజేపీ తరఫున పురందేశ్వరి పేరు కచ్చితంగా ఉంటుంది. ఆమెతో పాటు సీఎం రమేష్, శ్రీనివాసవర్మల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఏపీ కోటాలో టీడీపీకే ఎక్కువ ప్రాధాన్యత దక్కే అవకాశం ఉండటంతో.. ఏపీ బీజేపీ కోటాలో పురంధేశ్వరికి మాత్రమే కేంద్రమంత్రి పదవి వరిస్తుందని తెలుస్తోంది. ఆమెకు మోడీ దగ్గర మంచి పట్టు ఉంది కాబట్టి.. ఆమె రికమండేషన్ తో సీఎం రమేశ్ కు కూడా మంత్రి పదవి వచ్చేఛాన్స్ ఉందంటున్నారు. కాకపోతే ఏపీలో బీజేపీని రాబోయే రోజుల్లో విస్తరించాలని కేంద్రం భావిస్తే గనక.. ఎక్కువ పదవులు కేటాయించే అవకాశం కూడా లేకపోలేదు. చూడాలి మరి ఎవరికి పదవులు వరిస్తాయో.



# టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా కొణిదెల నాగబాబు?

**విశ్వంభర, విజయవాడ:** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి సంబంధించి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ తన కుటుంబసభ్యులతో పాటు పార్టీలో కీలకంగా వ్యవహరించిన పలువురికి కీలక పదవులను కట్టబెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ సోదరుడు, నటుడు కొణిదెల నాగబాబుకు టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా నియమించే అవకాశాలున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. అన్నకు పార్లమెంట్ సీట్ ఇవ్వనందుకు టీటీడీ ప్రక్షాళనకు పవన్ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వామ్యం కానున్నారు జనసేనాని. ఇప్పటికే కీలక మంత్రి పదవులు సాధించేందుకు పవన్ కల్యాణ్ మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రి పదవులతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవి, రాష్ట్రంలో కీలక శాఖలు, రాజ్యసభ స్థానాలు, నామినేటెడ్ పోస్టులపైనా పవన్ గురిపెట్టినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల్లోనూ జన శ్రేణులకు ప్రాధాన్యం కల్పించే అవకాశాలు ఉన్నాయి. విజయవాడ కనకదుర్గ గుడి ఛైర్మన్ పోస్టుకు తనను గెలిపించిన జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్‌ను సిఫారసు చేయనున్న సుజన, చిన్నిలకు కట్టబెడతారని చర్చ సాగుతోంది. దశాబ్ద కాలంగా జనసేన నమ్మకున్న వారందరికీ న్యాయచేసే దిశగా పవన్ అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

### ఆ వార్తలన్నీ ఫేక్.. టీటీడీ ఛైర్మన్ పదవిపై నాగబాబు క్లారిటీ

**ఏపీలో కూటమి భారీ విజయం సాధించింది. అయితే ఈ ఎన్నికల్లో మెగా ఫ్యామిలీదే కీలక పాత్ర అయిపోయింది. ఇందులో భాగంగానే ఆయనకు టీటీడీ ఛైర్మన్ పదవి వస్తుందని గురువారం ఉదయం నుంచి ప్రచారం జరుగుతోంది. మీడియాలోనూ వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై ఆయన స్పందించారు. తనకు టీటీడీ ఛైర్మన్ పదవి అంటూ వస్తున్న వార్తలన్నీ ఫేక్ అంటూ కొట్టి పారేశారు. తన నుంచి గానీ, పార్టీ నుంచి గానీ ప్రకటన వస్తేనే నమ్మాలంటూ ఆయన చెప్పారు.**

## ప్రభుత్వం ఏర్పడకముందే
# టీడీపీ మూకలు స్వైరవిహారం

- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం
- వైసీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేదు
- అధికారపార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజం
- ఐదేళ్లుగా పటిష్ఠంగా ఉన్న శాంతి భద్రతలకు విఘాతం
- గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలి
- ఎక్స్‌లో వైఎస్ జగన్ సంచలన ట్వీట్



**విశ్వంభర, తాడేపల్లిగూడెం :** ఏపీలో ఎన్నికల ఫలితాల తర్వాత అక్కడక్కడా విధ్వంసకర పరిస్థితులు నెలకొన్నాయి. రెండు రోజులుగా ప్రభుత్వ కార్యాలయాల్లో టీడీపీ శ్రేణులు విగ్రహాలు, శిలాఫలకాలు ధ్వంసం చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారు. వాహనాలను ధ్వంసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంచలన ట్వీట్ చేశారు. టీడీపీ నేతల దాడులతో ఏపీలో భయానక వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన ఈ విధంగా ట్వీట్ చేశారు. 'రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైయస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికారపార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. వెరసి ఐదేళ్లుగా పటిష్టంగా ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి.' అని పేర్కొన్నారు. అదేవిధంగా గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని పచ్చమూకల అరాచకాలను అడ్డుకోవాలని విన్నవించారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తిచేస్తున్నామని పేర్కొన్నారు. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చారు.

# రోజా ఓటమితో వైసీపీ నేతల సంబురాలు



**విశ్వంభర, నగరి :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాభవాన్ని చూసింది. కీలక పదవుల్లో ఉన్న నేతలు సైతం కనీసం డిపాజిట్లనూ సాధించలేకపోయారు. పలువురు మంత్రులు ఓటమి పాలయ్యారు. నగరి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీమంత్రి రోజా ఈసారి ఎన్నికల్లో ఓటమిపాలైన విషయం తెలిసిందే. అయితే ఆమె ఓటమితో స్థానిక వైసీపీ నేతలు కొందరు సంబురాలు చేసుకుంటున్నారు. దీనికి కారణం రోజా అధికారంలో ఉన్న సమయంలో అక్రమాలు, అరాచకాలకు అడ్డూ అదుపూ లేకపోవడమేనని స్థానిక వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రజలు ఎన్నికల్లో రోజాకు తగిన బుద్ధి చెప్పారని నగరి మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కేజే శాంతి అన్నారు. బయటి నుంచి వచ్చి ఈ ప్రాంతం తన అడ్డా అన్నట్లు వ్యవహరించారని మండిపడ్డారు. నగరికి పట్టిన పీడ వదిలిందంటూ కేజే శాంతి హర్షం వ్యక్తం చేశారు. రోజాకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోయి ఉంటే ఇప్పుడు పార్టీకి ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. రోజా ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. కాగా మొదటి నుంచి పొసగని రోజా, శాంతి మధ్య సయోధ్య కుదర్చడానికి మాజీ సీఎం జగన్ ప్రయత్నించారు. అయినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాల్లో రోజా ఓటమి పాలయ్యారు.



# ఆంధ్రప్రదేశ్ కొత్త సీఎస్‌గా విజయానంద్?

**విశ్వంభర, అమరావతి:** ఏపీలో వైసీపీ సర్కార్ దిగిపోయిన వెంటనే కొత్త ప్రభుత్వంలో అనేక మార్పులు చేర్పులు చోటుచేసుకునేలా కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా కీలక పదవులతో పాటు ప్రభుత్వ ఉన్నత అధికారుల పోస్టింగుల్లో కీలక మార్పులు చేయనున్నారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి పదవీకాలం జూన్ నెలాఖరుకు ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సీఎస్(చీఫ్ సెక్రెటరీ)గా కె.విజయానంద్‌ను నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె.విజయానంద్ గత ప్రభుత్వంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అదనపు బాధ్యతల్లో భాగంగా ఆయనకు ఆ బాధ్యతలు అప్పగించారు. బీసీ (యాదవ) సామాజిక వర్గానికి చెందిన విజయానంద్ ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలో కలెక్టర్‌గా, ఏపీ ట్రాన్స్ కో, ఏపీ జెన్ కో సీఎండీగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఎనర్జీ, ఐటి మంత్రిత్వ శాఖల ముఖ్యకార్యదర్శి(ప్రిన్సిపల్ సెక్రెటరీ)గా పనిచేయడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోగా బాధ్యతలు నిర్వహించారు. విజయానంద్ ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. త్వరలో ఎన్డీఏ కూటమి నిర్ణయం మేరకు ఆయన ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీగా నియామం చేపట్టే అవకాశాలు ఉన్నాయని టీడీపీ–జనసేన–బీజేజేపీ కూటమి శ్రేణులు చర్చించుకుంటున్నారు.

# 'థాంక్యూ అమ్మా..' ఎన్టీఆర్ ట్వీట్‌కు బాబు స్పందన

**విశ్వంభర, విజయవాడ:** ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఎక్స్ వేదికగా బుధవారం శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా తారక్ ట్వీట్‌కు చంద్రబాబు నాయుడు స్పందించారు. 'థాంక్యూ వెరీ మచ్ అమ్మ' అంటూ జూనియర్ ఎన్టీఆర్‌కు గురువారం బదులిచ్చారు. అదేవిధంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన రామ్‌చరణ్, మహేశ్‌బాబు, ఇతర రాజకీయ, సినీ ప్రముఖులకు సైతం ఆయన ధన్యవాదాలు తెలిపారు చంద్రబాబు. ఎన్టీఆర్ బుధవారం తన ట్వీట్‌లో "ప్రియమైన చంద్రబాబు మామయ్యకి.. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించినందుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీరు సాధించిన ఈ విజయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తుందని ఆశిస్తున్నాను. అద్భుతమైన మెజారిటీతో గెలిచిన నారా లోకేశ్ కి, మూడోసారి విజయం సాధించిన బాలకృష్ణ బాబాయికి, ఎంపీలుగా గెలిచిన పురందేశ్వరి అత్తకి, మతుకుమిల్లి శ్రీభరత్‌కు నా శుభాకాంక్షలు" ని పేర్కొన్నాడు. ఇక ఏపీలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి సునామీ సృష్టించిన విషయం తెలిసిందే. కూటమికి 164 అసెంబ్లీ స్థానాలు రాగా, అందులో టీడీపీ సొంతంగా 135 స్థానాల్లో విజయాన్ని సొంతం చేసుకుంది. అదేవిధంగా 16 ఎంపీ స్థానాలను కూడా టీడీపీ వశమయ్యాయి. దీంతో వైసీపీ 11 అసెంబ్లీ, 4 ఎంపీ స్థానాలకే పరిమితమైంది. అటు జనసేన, బీజేపీ కూడా దూకుడు ప్రదర్శించాయి. జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయఢంకా మోగించడంతో పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.





# కొడుకు అకిరాను మోదీకి పరిచయం చేసిన పవన్ కల్యాణ్

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. కూటమి విజయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రధాన పోషించారు. కాగా.. ఎన్డీఏ సమావేశంలో పాల్గొనేందుకు తన భార్య అన్నా లెజినోవా, కుమారుడు అకిరా నందన్‌తో కలిసి పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లారు. ప్రధాని నివాసంలో నరేంద్ర మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ తన కుమారుడు అకిరా నందన్‌ను మోదీకి కి పరిచయం చేశారు. అకిరా కూడా ప్రధానికి చేతులు జోడించి నమస్కరించాడు. ఈ సందర్భంగా మోదీ అకిరా నందన్ మీద చేయి వేసి మాట్లాడుతున్న ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2014లో జనసేనను స్థాపించారు పవన్. 2019లో మొదటి సారి ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లారు. ఆ సమయంలో ఆయనకు దారుణ పరాజయం ఎదురైంది. అయితే.. 2024లో 21 సీట్లలో పోటీ చేసి 21 మందిని గెలిపించుకుని సగర్వంగా అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. దీనికి రెండు పార్లమెంట్ స్థానాలు కూడా అదనం. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఏర్పాటు కావడంలో పవన్ చొరవే కారణం అని అంతా అనుకుంటున్నారు.

# చిరంజీవి ఇంటికి పవన్.. ఆనంద భాష్పాలతో మెగాస్టార్ స్వాగతం

**విశ్వంభర, హైదరాబాద్ :** ఏపీ ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భారీ మెజార్టీతో పిఠాపురంలో గెలవడమే కాక జనసేన తరపున నిల్చున్న 21 మంది ఎమ్మెల్యేలు, రెండు ఎంపీలు గెలిచారు. దీంతో అభిమానులు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ఇక పవన్ కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ ఎన్నికల్లో గెలిచాక పవన్ ఇప్పటికే చంద్రబాబుని, నరేంద్రమోదీని కలవగా తాజాగా అన్నయ్య మెగాస్టార్ చిరంజీవి ఇంటికి వచ్చారు.పవన్ కళ్యాణ్ తన భార్య అన్నా లెజనోవా, తనయుడు అకిరా నందన్ తో కలిసి అన్నయ్య మెగాస్టార్ ఇంటికి వెళ్లారు. మెగా ఫ్యామిలీ అంతా పూలు జల్లి స్వాగతం తెలిపారు. అన్నయ్యను చూడగానే పవన్ చిరంజీవి కాళ్లకు నమస్కరించాడు. చిరంజీవి ఆనందభాష్పాలతో పవన్ ని హత్తుకున్నాడు. అనంతరం చిరంజీవి భార్య సురేఖ పవన్ కి, అకిరాకు, అన్నా లేజనోవాకు బొట్టు పెట్టి హారతి ఇచ్చింది. పవన్ తన తల్లి అంజనా దేవిని హత్తుకున్నారు. చిరంజీవి పవన్ కు పెద్ద గజమాల వేసి పూల గుచ్చం ఇచ్చి స్వాగతం తెలిపారు. మెగా ఫ్యామిలీ అందరూ ఈ సంబరాల్లో పాల్గొన్నారు.



# ఏపీకి ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేయండి

**సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచన**



**విశ్వంభర, విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మార్పుపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి లక్ష కోట్లకు పైగా బడ్జెట్ కావాలన్నారు. అన్ని హామీలు నెరవేరాలంటే ప్రత్యేక హోదానే మార్గమని సూచించారు. కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజార్టీ ఉన్నందున హోదాను డిమాండ్ చేయలేకపోతున్నామని గతంలో జగన్ పలుమార్లు చెప్పారని... కానీ ఇప్పుడు కొత్త ప్రభుత్వానికి డిమాండ్ చేసే అవకాశం వచ్చిందన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేంద్రంలో ప్రస్తుతం బీజేపీకి 240 సీట్లు మాత్రమే ఉన్నాయని... ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకొని ఏపీకి ప్రత్యేక హోదాను సాధించాలని సూచించారు. విశాఖ రైల్వే జోన్ వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని సూచిం చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేయాలని కోరారు. ఈ ఐదేళ్లు చాలా కీలకమని... ఇప్పుడు అభి వృద్ధి చేయకపోతే రాష్ట్రం బాగుపడదని హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయం పెరిగితేనే అభివృద్ధితో పాటు సంక్షేమానికి వీలవుతుందన్నారు. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడానికి... గత ప్రభుత్వం చేసిన అప్పుల కంటే ఎక్కువగా చేయాల్సి వస్తుందన్నారు.



## క్రిస్ గేల్ రికార్డు బద్దలు కొట్టిన ఆస్ట్రేలియా బ్యాట్స్ మెన్!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఆస్ట్రేలియా వెటరన్ బ్యాట్స్ మెన్ డేవిడ్ వార్నర్ తాజాగా ఓ అరుదైన రికార్డ్ నెలకొల్పాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా ఒమన్‌తో గురువారం (జూన్ 6) జరిగిన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో (51 బంతుల్లో 56; 6 ఫోర్లు, సిక్సర్) అదరగొట్టిన వార్నర్.. టీ20ల్లో అత్యధిక 50+ ప్లస్ స్కోర్ల రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో వెస్టిండీస్ స్టార్ క్రికెటర్ క్రిస్ గేల్ రికార్డును బ్రేక్ చేసాడు. ఒమన్‌పై హాఫ్ సెంచరీ కలుపుకుని వార్నర్ ఖాతాలో 111 ఫిఫ్టి ప్లస్ స్కోర్లు ఉండగా.. క్రిస్ గేల్ పేరిట 110 50+ ప్లస్ స్కోర్లు నమోదై ఉన్నాయి. అయితే వార్నర్ కేవలం 378 ఇన్నింగ్స్‌ల్లో 111 50+ ప్లస్ స్కోర్ల మార్కు అందుకోగా.. గేల్‌కు 110 50+ప్లస్ స్కోర్లు చేసేందుకు 455 ఇన్నింగ్స్‌లు అవసరమయ్యాయి. ఇక రానున్న రోజుల్లో జరిగే T 20 మ్యాచుల్లో డేవిడ్ వార్నర్ ఇంకెలాంటి రికార్డులు సృష్టిస్తాడో చూడాలి.







# అమెరికా X పాకిస్థాన్ మ్యాచ్ టై

**విశ్వంభర, స్పోర్ట్స్ :** 2024 టీ20 వరల్డ్ కప్‌లో పసికూన అమెరికాతో పాకిస్థాన్ గురువారం తలపడింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (44 పరుగులు, 43 బంతుల్లో; 3x4, 2x6), షాదాబ్ ఖాన్ (40 పరుగులు, 25 బంతుల్లో; 1x4, 3x6) రాణించారు. అమెరికా బౌలర్లలో నోష్తుశ్ కెంజిగె 3, సౌరభ్ నేత్రవాల్కర్ 2, అలీ ఖాన్, జస్దీప్ సింగ్ తలో వికెట్ పడగొట్టారు.తొలుత బ్యాటింగ్ చేసిన పాక్‌కు మంచి ఆరంభం దక్కలేదు. పసికూన అమెరికా పాకిస్థాన్‌ను బాగానే కట్టడి చేసింది. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై బౌలర్లు చెలరేగిపోయారు. స్టార్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ (9), ఉస్మాన్ ఖాన్ (3), ఫకర్ జమాన్ (11) కీలక 3 వికెట్లు పవర్ ప్లేలోనే కోల్పోయింది. ఈ సమయంలో షాదాబ్‌తో కలిసి బాబర్ స్కోర్ బోర్డును నడిపించాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 72 పరుగులు జోడించారు. ఈ జోడీని కెంజిగె విడగొట్టాడు. ఆ తర్వాత కూడా పాక్ టపటపా వికెట్లు కోల్పోయింది. అజామ్ ఖాన్ (0) డకౌట్ కాగా, బాబర్, ఇఫ్తికార్ అహ్మద్ (18) కూడా ఔటయ్యారు. చివర్లో షహీన్ అఫ్రిదీ (22*, 16 బంతుల్లో పరుగులు) రాణించడం వల్ల పాక్ 150 స్కోర్ దాటగలిగింది.ఇక యూఎస్ఏ విజయానికి 120 బంతుల్లో 160 పరుగులు కావాలి. కాగా, ఈ మ్యాచ్ టై అయింది.



# కోహ్లీ ఔట్ కావడం 8 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి

### ఐర్లాండ్‌పై ఒకే ఒక్క పరుగు చేసి ఔటైన విరాట్

### టీ20 వరల్డ్ కప్ భారత ఛేజింగ్‌లో ఫస్ట్ టైం

### 2016లో న్యూజిలాండ్‌పై 23 పరుగులకే ఔట్

### టీ20 వరల్డ్ కప్‌లో విరాట్‌కు అద్భుతమైన ట్రాక్ రికార్డు



**విశ్వంభర, స్పోర్ట్స్ :**
ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ 2024లో భాగంగా న్యూయార్క్‌లోని నసావు కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా బుధవారం రాత్రి ఐర్లాండ్‌పై భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. బౌలర్లు అద్భుతంగా రాణించడంతో టీమిండియా 8 వికెట్ల తేడాతో వరల్డ్ కప్‌లో బోణీ కొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ కేవలం 96 పరుగులకే ఆలౌట్ అవ్వగా.. కెప్టెన్ రోహిత్ శర్మ హాఫ్ సెంచరీ, రిషబ్ పంత్ రాణించడంతో భారత్ సునాయాస విజయం సాధించింది. అద్భుతమైన విజయం సాధించినప్పటికీ విరాట్ కోహ్లీ ప్రదర్శన మాత్రం భారత ఫ్యాన్స్‌ను నిరాశకు గురిచేసింది. ఐదు బంతులు ఎదుర్కొన్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కేవలం ఒకే ఒక్క పరుగు కొట్టి వెనుదిరిగాడు. మార్క్ అడైర్ ఓవర్‌లో క్యాచ్ రూపంలో ఔట్ అయ్యాడు. అయితే విరాట్ కోహ్లీ సింగిల్ డిజిట్ పరుగులకే ఔట్ కావడం చాలా కాలం తర్వాత నమోదయింది. టీ20 వరల్డ్ కప్‌లో భారత్ ఛేజింగ్‌లో విరాట్ కోహ్లీ 50 కంటే తక్కువ పరుగులు సాధించడం 8 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. 2016లో న్యూజిలాండ్‌పై జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ 23 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఎప్పుడూ 50 కంటే తక్కువ పరుగులు చేయలేదు. తిరిగి 8 ఏళ్ల తర్వాత ఇప్పుడు కేవలం 1 పరుగుకే పెవిలియన్ చేరాడు. టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో కోహ్లీ బ్యాటింగ్ రికార్డు అద్భుతంగా ఉంది. ఛేజింగ్‌లో అతడి సగటు ఏకంగా 180.66గా ఉంది. టీ20 వరల్డ్ కప్‌లో ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ ఏకంగా 542 పరుగులు బాదాడు. ఇందులో 7 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 82 పరుగులుగా ఉంది. ఇక స్ట్రైక్ రేట్ 134.49గా ఉంది. ఇందులో 49 ఫోర్లు, 14 సిక్సర్లు ఉన్నాయి.

# భారత్-పాక్ మ్యాచ్ వేదికను మారుస్తారా?

**విశ్వంభర, స్పోర్ట్స్ :**
టీ20 ప్రపంచకప్ 2024లో భారత్ శుభారంభం చేసింది. న్యూయార్క్ వేదికగా నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో బుధవారం ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 16 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. టీమ్ ఇండియా బౌలర్లలో హార్దిక్ పాండ్య మూడు వికెట్లు తీశాడు. బుమ్రా, అర్షదీప్ సింగ్ చెరో రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 12.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రోహిత్ శర్మ (37 బంతుల్లో 52) హాఫ్ సెంచరీ బాదాడు. కాగా.. పాకిస్తాన్‌తో మ్యాచ్‌ను కూడా భారత్ ఇదే స్టేడియంలో ఆడనుంది. అయితే.. ఈ పిచ్ పై ఆందోళన వ్యక్తం అవుతోంది. మ్యాచ్ వేదికను మార్చాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలోని డ్రాప్ ఇన్ పిచ్‌లపై అస్థిర బౌన్స్ లభిస్తోంది. బ్యాటర్లు పరుగులు చేసేందుకు కష్టపడుతున్నారు. అస్థిర బౌన్స్ కారణంగా బ్యాటర్లకు గాయాలు అవుతున్నాయి. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో రోహిత్ గాయపడ్డాడు. దీంతో దాయాదుల పోరు ఫలితం ఎలా ఉంటుందోనని ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఐసీసీ స్పందించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాచ్‌ను న్యూయార్క్‌లోని స్టేడియం నుంచి తరలించే అవకాశం లేదని తేల్చి చెప్పినట్లుగా కథనాలు వస్తున్నాయి. జూన్ 9న జరిగే భారత్ పాక్ మ్యాచ్ కోసం ఇప్పటి వరకు ఉపయోగించిన పిచ్‌లు కాకుండా కొత్త పిచ్‌ను ఉపయోగించనున్నట్లు వెల్లడించింది. అయితే.. మిగిలిన పిచ్‌లపై మ్యాచ్‌ల ఫలితాలను బట్టి నిర్ణయం ఉంటుందని ఐసీసీ అధికారులు చెప్పినట్లు పలు రిపోర్టులు వచ్చాయి.

**10 గ్రాస్ పిచ్‌లు..**
న్యూయార్క్ స్టేడియంలో మొత్తం 10 టహోమా గ్రాస్ పిచ్‌లు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో పెరిగే గడ్డిని సముద్ర మార్గంలో ఫ్లోరిడాకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి ట్రక్కుల్లో న్యూయార్క్‌కు తరలించారు. పొట్టి ప్రపంచకప్ ఆరంభం కావడానికి కొన్ని వారాల ముందు ఈ డ్రాప్ ఇన్ పిచ్‌ల ఏర్పాటు చేశారు. ఈ పిచ్‌కు ఫాస్ట్ బౌలింగ్‌కు సహకరిస్తున్నప్పటికీ అస్థిర బౌన్స్‌తో బ్యాటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ షేర్ల

# పెరుగుదల

### నాలుగు రోజులుగా పెరుగుతోన్న షేర్లు

### గురువారం గరిష్టంగా 10 శాతం దాటిన షేర్లు

### 30 రోజుల సగటు కంటే 8.1 రెట్లు ఎక్కువగా నమోదు

### టీడీపీ విజయంతో రూ.601.15లకు ఎగబాకిన షేరు ధర

**విశ్వంభర, బిజినెస్ :**
ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అధిక సంఖ్యలో అసెంబ్లీ సీట్లను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చంద్రబాబు నాయుడు స్థాపించిన హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ షేర్లు గత 4 రోజులుగా రికార్డు బలమైన పెరుగుదలను నమోదు చేస్తున్నాయి. గురువారం దాని రోజువారీ గరిష్ట పరిమితి 10 శాతం దాటింది. 1992లో చంద్రబాబు స్థాపించిన ఈ డెయిరీ కంపెనీ దేశవ్యాప్తంగా 10కి పైగా రాష్ట్రాల్లో మార్కెట్ ఉనికిని కలిగి ఉంది. కంపెనీలో 24.37 శాతం వాటా ఎన్. చంద్రబాబు భార్య నారా భువనేశ్వరిదే. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ లో రోజు ట్రేడింగ్ సమయంలో హెరిటేజ్ ఫుడ్స్ షేర్లు 10 శాతం పెరిగి ఒక్కో షేరుకు ₹601.15కి చేరుకున్నాయి. ఉదయం 10:10 గంటలకు ఈ స్టాక్




నిఫ్టీలో 0.62 శాతం అడ్వాన్స్‌తో పోలిస్తే 7.22 శాతం పెరిగి ₹ 585.95 వద్ద ట్రేడవుతోంది. గత 4 రోజుల్లో కంపెనీ మొత్తం 37.25 శాతం లాభము రాగ, గత 12 నెలల్లో షేరు ధర 183.3% పెరిగింది. గురువారం నాటి మొత్తం ట్రేడింగ్ పరిమాణం 30 రోజుల సగటు కంటే 8.1 రెట్లు ఎక్కువగా నమోదు అయ్యింది. రిలేటివ్ స్ట్రెంత్ ఇండెక్స్ 92.63 వద్ద ఉంది. అంటే స్టాక్ ఓవర్‌బాట్ చేయబడింది.

# మీ క్రెడిట్ కార్డు బకాయి తీర్చలేకపోతున్నారా?

## నో టెన్షన్.. ఇలా చేయండి




**విశ్వంభర, బిజినెస్ :** ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు వాడేవారు చాలా మందే ఉన్నారు. బ్యాంకులు కూడా సులభంగా క్రెడిట్ కార్డులను జారీ చేస్తున్నాయి. ఒకప్పుడు కార్డు జారీ చేయాలంటే ఎంతో ప్రాసెస్ ఉండేది. పూర్తిగా ఎంక్వైరీ చేసిన తర్వాతే కార్డు జారీ చేసేవి బ్యాంకులు. అందుకు సమయం కూడా పట్టేది. కానీ ఇప్పుడు డిజిటల్ యుగంలో క్రెడిట్ కార్డులను సులభంగా జారీ చేస్తున్నాయి. కేవలం ఫోన్‌ల ద్వారానే వివరాలు పూర్తి చేసి కార్డులను అందిస్తున్నాయి. అయితే క్రెడిట్ కార్డు వాడకంలో అవగాహన ఉండటం తప్పనిసరి లేకుంటే అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. అయితే చాలా మంది క్రెడిట్ కార్డు బిల్లును సమయానికి చెల్లించరు. గడువులోగా చెల్లించకుంటే భారీగా పెనాల్టీ పడుతుంది. మరి బాకీ ఉన్న బిల్లును చెల్లించకుంటే ఏవమతుంది? అలాంటి సమయంలో ఏం చేయాలో తెలుసుకుందాం.

మీ కార్డును ఉన్న బకాయినీ నెలవారీ పద్దతుల్లో అంటే ఈఎంఐ రూపంలో చెల్లించవచ్చు. మీ బిల్లును ఈఎంఐలోకి మార్చుకోవచ్చు. దీని వల్ల మీ క్రెడిట్ కార్డు బకాయిని చెల్లించడంలో సులభం అవుతుంది. లేదా ఆ బకాయిని వేరే కార్డుకు బదిలీ చేసుకుని వ్యక్తిగత రుణంగా చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుంది.

**తక్కువ వడ్డీ రేట్లు:**
వ్యక్తిగత రుణాలతో క్రెడిట్ కార్డులను పోల్చినట్లయితే వడ్డీ తక్కువగానే ఉంటుంది. అందుకే కాలక్రమేణా వడ్డీపై డబ్బు ఆదా అవుతుంది. అంతేకాకుండా బాకీని వేగంగా తీర్చేందుకు సులభమవుతుంది. మీ క్రెడిట్ కార్డు బిల్లు మొత్తం తీర్చడంలో ఇబ్బంది ఉంటే మీరు బ్యాంకు నుంచి లేదా ఇతర సంస్థల నుంచి వ్యక్తగత రుణం తీసుకుని క్రెడిట్ కార్డు బకాయిని తీర్చుకోవచ్చు.

**క్రెడిట్ స్కోరు:**
బిల్లును తీర్చకుండా విఫమైలే క్రెడిట్ స్కోరు పడిపోతుంది. క్రెడిట్ వినియోగ నిష్పత్తీ పెరుగుతుంది. దీనికి బదులుగా రుణంతో ఒకేసారి బాకీ తీరిస్తే, క్రెడిట్ స్కోరు మెరుగయ్యే అవకాశం ఉందంటున్నారు నిపుణులు.

**ఫీజుల బాధ:**
గడువు సమయంలోగా క్రెడిట్ కార్డు బల్లు చెల్లించకుంటే భారీ పెనాల్టీ ఛార్జీలు పడతాయి. రుణం తీసుకొని, చెల్లిస్తే.. వీటి బాధ ఉండదు. రుణం తీసుకునే ముందు కూడా కొన్ని విషయాలను పరిశీలించుకోవాలి. మీ క్రెడిట్ కార్డు బిల్లును తీర్చేందుకు వ్యక్తిగత రుణం తీసుకునేందుకు మీకు అర్హత ఉందా అనేది ముందుగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. దీనికోసం ముందుగా మీ బ్యాంకును సంప్రదించాలి. క్రెడిట్ స్కోరు, ఆదాయం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని బ్యాంకులు మీరు రుణాన్ని అందిస్తాయి.

కొన్ని బ్యాంకులు 12 నుంచి 84 నెలల వరకూ వ్యవధితో రుణాలను ఇస్తున్నాయి. రుణాన్ని సులభంగా చెల్లించే విధంగా వాయిదాలను నిర్ణయించుకోండి. కానీ బ్యాంకు నుంచి రుణం తీసుకుని క్రెడిట్ కార్డు బిల్లు చెల్లిస్తే సరిపోదు.. మీరు తీసుకున్న లోన్ ఈఎంఐ సరిగ్గా చెల్లించడం చాలా ముఖ్యం. లేకుంటే తర్వాత మీరు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

## జియో కొత్త సోలార్ సిస్టమ్

### 95 శాతం కరెంటు బిల్లు తగ్గింపు

### తక్కువ ధరల్లోనే అందుబాటులోకి..

**విశ్వంభర, బిజినెస్:** నేటి కాలంలో సోలార్ సిస్టమ్ ఒక గొప్ప ఎంపిక. ఎందుకంటే మీరు 2 కిలోవాట్ల సోలార్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే, మీ విద్యుత్ బిల్లు నెలకు 95% తగ్గుతుంది. మీకు నాన్‌స్టాప్ కరెంటు లభిస్తుంది. మీరు జియో ఈ కొత్త సోలార్ సిస్టమ్‌ను కొనుగోలు చేయాలనుకుంటే, 2 kw 2000 వాట్ సోలార్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి మీరు జియో నుండి మోనో క్రిస్టల్ లైనర్ లేదా పాలీ క్రిస్టల్ లైనర్ సోలార్ ప్యానెల్‌లను పొందవచ్చు. రెండూ గొప్ప ఫీచర్లతో ఉంటాయి. ఈ సోలార్ ప్యానెల్స్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి మీకు 200 చదరపు అడుగుల స్థలం అవసరం. దీని కోసం మీరు ఎనిమిది ప్యానెల్‌లను కూడా ఉపయోగించవచ్చు. ఇందులో 335 వాట్ల 6 ప్యానెల్లు ఇన్‌స్టాల్ చేస్తారు. జియో ఆన్ గ్రిడ్ సోలార్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా మీరు అనేక ప్రయోజనాలను పొందుతారు. దాని ధరను కొద్దిగా సర్దుబాటు చేయవచ్చు. మీరు ప్రభుత్వం నుండి సబ్సిడీ మొత్తాన్ని పొందుతారు. ఒకసారి మీరు దీన్ని ఇన్‌స్టాల్ చేస్తే, మీకు 5 సంవత్సరాల వారంటీ లభిస్తుంది. అలాగే మొత్తం 25 ఏళ్ల పాటు ఎలాంటి టెన్షన్ ఉండదు. మీరు మీ ఇంటి వద్ద జియో ఆన్‌గ్రిడ్ సోలార్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయాలనుకుంటే ఇది సోలార్ ఇన్వర్టర్లు, సోలార్ ప్యానెల్‌లను ఉపయోగిస్తుంది. చౌక ధరలలో లభిస్తుంది. ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుంది.

# పెరగనున్న టీవీ ఛానెళ్ల ధరలు

**విశ్వంభర, బిజినెస్ :**
టీవీ చూసేవారికి వారికి ఇది చేదు వార్తే. మీ టీవీని చూడటం త్వరలో ఖరీదైనదిగా మారవచ్చు. చాలా పెద్ద OTT ప్లాట్‌ఫారమ్‌లు తమ ఫీజులను పెంచబోతున్నాయి. ఇది సామాన్యుల జేబుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. సమాచారం ప్రకారం.. డిస్నీ స్టార్, వయాకామ్ 18, జీ ఎంటర్‌టైన్‌మెంట్, సోనీ పిక్చర్ నెట్‌వర్క్ ఇండియా బ్రాడ్‌కాస్టర్లు తమ ఛానెల్ జాబితాను పెంచుకోవచ్చు. ఎందుకంటే ఎన్నికల ఫలితాల తర్వాత రేట్లు పెంచాలని భావించగా, ఎన్నికల ఫలితాలు వచ్చాయి కాబట్టి త్వరలో ఫీజులు పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

**టీవీ చూడటం చాలా ఖరీదైనది:**
నివేదిక ప్రకారం.. టీవీ సబ్‌స్క్రిప్షన్ రేట్లు 5 నుండి 8 శాతం వరకు పెరగవచ్చు. అంటే, మీరు ప్రస్తుతం టీవీని చూడటానికి నెలవారీ టీవీ సబ్‌స్క్రిప్షన్‌పై రూ. 500 వెచ్చిస్తే, మీ టీవీ సబ్‌స్క్రిప్షన్ రేటు దాదాపు రూ.40 పెరగవచ్చు. అదే సమయంలో మీరు టీవీ సబ్‌స్క్రిప్షన్‌పై ప్రతి నెలా రూ. 1000 ఖర్చు చేస్తే అది దాదాపు రూ. 80 వరకు పెరుగుతుంది. ఈటీ నివేదిక ప్రకారం.. సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు కొత్త టారిఫ్ ప్రకారం ఒప్పందంపై సంతకం చేయని డిస్ట్రిబ్యూటర్ ప్లాట్‌ఫాం ఆపరేటర్ల (DPOలు) సిగ్నల్‌లను స్విచ్ ఆఫ్ చేయవద్దని టెలికాం నియంత్రణ సంస్థ TRAI ప్రసారకర్తలను కోరింది.

**10 శాతం పెరుగుదల:**
జనవరిలో ప్రముఖ బ్రాడ్‌కాస్టర్ దాని బేస్ బొకే రేట్లను సుమారు 10 శాతం పెంచింది. నివేదికను ఉటంకిస్తూ, Viacom18 గరిష్టంగా 25 శాతం పెరుగుదల ఉంటుందని పేర్కొంది. అంటే దాదాపు రూ.500 నెలవారీ సబ్‌స్క్రిప్షన్‌లో దాదాపు రూ.125 పెరగనుంది.

**ధరలు ఎప్పుడు పెరుగుతాయి?**
క్రికెట్, వినోద ఛానెల్‌ల మార్కెట్ వాటా దాదాపు 25 శాతం. అదే సమయంలో సబ్‌స్క్రిప్షన్ రేటు పెరుగుదల కొత్త ధర ఫిబ్రవరిలో అమలులోకి వచ్చింది. కానీ ఎన్నికల కారణంగా దానిపై హోల్డ్ పడింది. అటువంటి పరిస్థితిలో జూన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, రేట్లు పెంచడానికి ప్రసారకర్తలు డీపీవోలపై ఒత్తిడి తీసుకురావచ్చని భావిస్తున్నారు. ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీ, కొన్ని డీపీవో ఇప్పటికే ధరలను స్వల్పంగా పెంచాయి.





# మా అసోసియేషన్ లో హేమ పదవి రద్దు..

నటి హేమ వ్యవహారం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిపోయింది. ఆమె నిత్యం వివాదాల్లో చిక్కుకుంటూనే ఉంది. ఇక తాజాగా ఆమె రేవ్ పార్టీలో అడ్డంగా దొరికిపోవడం, డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపణ కావడంతో ఆమెను కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేయగా.. కోర్టు ఆమెకు రిమాండ్ విధించింది. ప్రస్తుతం ఆమె జైల్లో ఉన్నారు. అయితే ఆమె మా అసోసియేషన్ సభ్యత్వం రద్దు చేయాలంటూ డిమాండ్ వస్తోంది. ఎందుకంటే మా అధ్యక్షుడు మంచు విష్ణు మొన్న మాట్లాడుతూ.. హేమ తప్పుచేసినట్టు నిరూపణ అయితే ఆమెపై చర్యలు తీసుకుంటామన్నారు. కాబట్టి ఇప్పుడు ఆమెపై చర్యలు తీసుకోవాలే డిమాండ్ బాగా వచ్చింది. దాంతో ఇప్పుడు ఆమెపై మా అసోసియేషన్ చర్యలు తీసుకుంది. ఆమెను మా నుంచి సస్పెండ్ చేయడమే కాదు ఆమె సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్టు మా అధ్యక్షుడు మంచు విష్ణు అధికారికంగా వెల్లడించారు. ఆమె గతంలో మా అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి ఇండిపెండెంట్ గా పోటీ చేసి గెలిచింది. మొన్న జరిగిన ఎలక్షన్లలో ప్రకాశ్ రాజ్ ప్యానెల్ నుంచి పోటీ చేసి ఓడిపోయింది. ఇప్పుడు ఆమెను సస్పెండ్ చేయడంతో ఆమె పదవి, సభ్యత్వం రెండూ పోయాయి.

# త్వరలో రాఘవ లారెన్స్ కాంచన-4

**విశ్వంభర, సినిమా:** ప్రముఖ కొరియోగ్రాఫర్, హీరో, డైరెక్టర్ రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ కాంచన. కోలీవుడ్‌లోనే కాకుండా తెలుగులోనూ ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సిరీస్‌లో మూడు సినిమాలు రాగా ఈ మూడు మూవీలు కూడా భారీ విజయాలను అందుకున్నాయి. కాగా.. తాజాగా ఈ సిరీస్‌లో నాలుగో మూవీని తెరకెక్కించనున్నట్లు చిత్ర బృందం తెలియజేసింది. ఈ మూవీకి కూడా లారెన్స్ దర్శకత్వం వహించనున్నట్లు వెల్లడించింది. ఓ సరికొత్త పోస్టర్ ద్వారా ఈ విషయాన్ని తెలియజేశారు. 'కాంచన 4' గా ఇది రానుంది. ఈ చిత్ర షూటింగ్‌ను సెప్టెంబర్‌లో మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది సమ్మర్‌లో ఈ మూవీని విడుదల చేసేందుకు ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. 2011లో కాంచన విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. 2015లో రెండో పార్టును రిలీజ్ చేయగా ప్రేక్షకాదరణ పొందింది. 2019లో కాంచన 3ను తీసుకురాగా విమర్శల ప్రశంసలు అందుకుంది. ఈ మూడు పార్టుల్లోనూ రాఘవ లారెన్స్, కోవై సరళల కామెడీ అందరిని అలరించింది. ఈ మూవీల్లో రాయ్ లక్ష్మీ, వేదిక, నిత్యా మీనన్, తాప్సీ పన్నులు కథానాయికలుగా నటించారు. మరీ కాంచన 4లో ఎవరు హీరోయిన్‌గా నటిస్తారు అన్న విషయాలను ఆసక్తిని రేకెత్తిస్తోంది.






# అతనితో లిప్ కిస్ తప్పనిపించలేదు..

ఒకప్పుడు హీరోయిన్లు మెరిసిన వారు.. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ లో కూడా రాణిస్తున్నారు. హీరోయినలకు అమ్మ, అత్త పాత్రలు చేస్తున్నారు. అలాంటి వారిలో నటి ఆమని కూడా వస్తుంది. ఆమె చాలా కాలం ఇండస్ట్రీకి దూరంగా ఉంది. కానీ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ లో వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతోంది. అయితే ఆమె సెకండ్ ఇన్నింగ్స్ లో సీనియర్ నటుడు నరేశ్ తో చందమామ కథలు సినిమాలో లిప్ కిస్ సీన్ చేసింది. ఈ వయసులో ఇలా చేయడం ఏంటని అప్పట్లో ఆమెపై దారుణమైన విమర్శలు వచ్చాయి. అయితే వాటిపై ఆమని మరోసారి స్పందించింది. నేను హీరోయిన్ గా ఉన్నప్పుడు కూడా బోల్డ్ సినిమాలు చాలానే చేశాను. నరేశ్ తో తొలినాళ్లలో కూడా క్లోజ్ గా నటించాను. అందుకే నాకు సెకండ్ ఇన్నింగ్స్ లో చేయడం తప్పనిపించలేదు. అవన్నీ సినిమాలో భాగం మాత్రమే. సినిమాల్లో రాణించాలంటే అన్నీ చేయాలి. అవి చేయను, ఇవి చేయను అని కూర్చుంటే నడవదు. ఇక్కడ రాణించాలంటే ప్రతి ఒక్కటీ సవాల్ గానే తీసుకోవాలని చెప్పుకొచ్చారు ఆమని. ప్రస్తుతం ఆమె వరుసగా సినిమాల్లో నటిస్తున్నారు.



# ఆ హీరోయిన్‌తో రొమాంటిక్ సీన్లలో నటించలేను

**విజయ్ సేతుపతి**

ఉప్పెన చిత్రంతోనే కృతి శెట్టి హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి డైరెక్ట్ తెలుగు చిత్రంలో నటించారు. బేబమ్మగా కృతి తండ్రి పాత్రలో విజయ్ నటించారు. ఈ ఇద్దరి మధ్య చాలా ఎమోషనల్ సీన్స్ ఉంటాయి. ఉప్పెన తర్వాత రెండు సినిమాల్లో కృతితో హీరోయిన్‌గా నటించే ఛాన్స్ వచ్చినా విజయ్ సేతుపతి తిరస్కరించారు. దీనికి కారణం ఆయన ఆమెతో ఉప్పెన సినిమాలో తండ్రిగా నటించడమేనని విజయ్ తెలిపాడు. విజయ్ ప్రస్తుతం విజయ్ సేతుపతి త్వరలోనే 'మహారాజ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. క్రైం, సస్పెన్స్ థ్రిల్లర్‌గా నిథిలన్ స్వామినాథన్ ఈ సినిమాను తెరకెక్కించారు. ప్యాషన్ స్టూడియోస్, ది రూట్‌పై సుధన్ సుందరం, జగదీష్ పళనిస్వామి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో అనురాగ్ కశ్యప్, భారతీరాజా, అభిరామి, మమత మోహన్ దాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. మహారాజ జూన్ 14న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్ కృతి శెట్టి గురించి మరోసారి విజయ్ సేతుపతి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'కూతురిగా భావించిన కృతి శెట్టికి జోడీగా నటించడం తన వల్ల కాదు.. నేను నటించిన డీఎస్పీ సినిమాలో కృతి శెట్టిని హీరోయిన్‌గా తీసుకుంటే చేయలేనని దర్శక నిర్మాతలకు చెప్పా. కుమార్తెగా నటించిన అమ్మాయితో రొమాంటిక్ సీన్స్ అస్సలు చేయలేను. 'ఉప్పెన' క్లైమాక్స్ సన్నివేశాల్లో నటిస్తున్నప్పుడు కృతి చాలా కంగారు పడింది. నాకు నీ వయసు ఉన్న కుమారుడు ఉన్నాడు, నన్ను నీ తండ్రిగా భావించు అని ధైర్యం చెప్పా. కూతురిగా భావించిన ఆమెకు జోడీగా ఎలా నటించాలి. అది నా వల్ల కాదు' అని విజయ్ తెలిపారు.





# 'మిస్ యూ' అంటూ సరికొత్త సినిమాతో వచ్చేస్తున్న సిద్ధార్థ్

బొమ్మరిల్లు, నువ్వొస్తానంటే నేనొద్దంటానా వంటి సూపర్ హిట్ సినిమాలతో టాలీవుడ్ ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు హీరో సిద్ధార్థ్. తెలుగు, తమిళ సినిమాల్లో తన నటనతో మెప్పించాడు. చాలా కాలం తర్వాత 'చిన్నా' అనే సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా విడుదలైన అన్ని భాషల్లో మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. సిద్ధార్థ్ ఆ తర్వాత కమల్‌హాసన్, శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటింగ్ మూవీ 'ఇండియన్ 2' సినిమాల్లో నటిస్తున్నాడు. తాజాగా సిద్ధార్థ్ తన కొత్త సినిమాను అనౌన్స్ చేశాడు. సిద్ధూ తాజా చిత్రం 'మిస్ యూ'. ఈ సినిమాకు ఎన్.రాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్నాడు. మ్యూజిక్ డైరెక్టర్ జిబ్రాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది. కరుణాకరన్, బాల, సాస్తిక రాజేంద్రన్ తదితరులు ఇందులో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను ఇవాళ (గురువారం) విడుదల చేశారు. ఈ మేరకు తమిళ్ హీరో శివ కార్తికేయన్ ఎక్స్ వేదికగా మిస్ యూ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశాడు. రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్‌పై సిద్ధార్థ్ నడుస్తున్న పోస్టర్ కొత్తగా ఉంది. చాలా రోజుల తర్వాత సిద్ధార్థ్ మంచి లుక్‌లో కనిపిస్తున్నాడు. ఈ ఫస్ట్ లుక్‌ను మరో హీరో మాధవన్ కూడా రిలీజ్ చేశాడు. 7 మైల్స్ పర్ సెకండ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శామ్యూల్ మాథ్యూ మిస్ యూ సినిమాను నిర్మిస్తున్నారు.

# భారత్‌లో 'సైలెంట్ కిల్లర్' టెన్షన్

- వేగంగా విస్తరిస్తున్న ప్రమాదకర వ్యాధి
- బాధితులు 20కోట్ల మందికి పైగానే..



**విశ్వంభర, ఫీచర్:** ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. పేలవమైన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారం, పని ఒత్తిడి.. ఇలా ఎన్నో విషయాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.. అయితే.. భారత్‌లో 'సైలెంట్ కిల్లర్'గా పిలిచే ప్రమాదకరమైన వ్యాధి వేగంగా విస్తరిస్తోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. ఆ వ్యాధి ఏంటంటే.. అధిక రక్తపోటు (హై బ్లడ్ ప్రెజర్ - హైపర్ టెన్షన్).. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) నివేదిక ప్రకారం, భారతదేశంలో దాదాపు 200 మిలియన్ల మంది (20 కోట్ల మంది) అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. వీరిలో కేవలం కోటి మందికి మాత్రమే రక్తపోటు అదుపులో ఉందట.. మిగతా వారికి రక్తపోటు అదుపులో ఉండటం లేదని పేర్కొంటున్నారు..

**ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం..**

'అధిక రక్తపోటు నేడు భారతదేశంలో తీవ్రమైన - పెరుగుతున్న ఆరోగ్య సమస్య.' అధిక రక్తపోటు ప్రారంభ దశల్లో నిర్దిష్ట లక్షణాలు కనిపించవని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. అందుకే దీన్ని 'సైలెంట్ కిల్లర్' అంటారు. చాలా సార్లు ఈ వ్యాధి కొన్ని తీవ్రమైన వ్యాధికి కారణం అయ్యే వరకు గుర్తించబడదు. అధిక రక్తపోటు గుండె జబ్బులు, స్ట్రోక్, మూత్రపిండాలు దెబ్బతినడం, కంటి చూపు కోల్పోవడం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.. అని ఐసీఎంఆర్ ట్వీట్ చేసింది..

**అధిక రక్తపోటుకు ప్రధాన కారణాలు**

- **అనారోగ్యకరమైన జీవనశైలి:** సరైన ఆహారం, వ్యాయామం లేకపోవడం, ధూమపానం, అధిక మద్యపానం అధిక రక్తపోటు ప్రమాదాన్ని పెంచుతాయి.
- **ఊబకాయం:** అధిక బరువు లేదా ఊబకాయం ఉన్నవారికి అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- **జన్యుపరంగా:** మీ కుటుంబంలో ఎవరికైనా అధిక రక్తపోటు లేదా గుండె జబ్బులు వంటి సమస్యలు ఉంటే, మీరు కూడా ఎక్కువ ప్రమాదంలో ఉంటారు.
- **ఒత్తిడి:** స్థిరమైన ఒత్తిడితో కూడిన పరిస్థితులు కూడా అధిక రక్తపోటుకు కారణం కావచ్చు.


**ఎలా నియంత్రించాలి**

- **ఆరోగ్యకరమైన ఆహారం:** పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలతో కూడిన తక్కువ ఉప్పుతో సమతుల్య ఆహారం తీసుకోండి. కొవ్వు, కొలెస్ట్రాల్ తీసుకోవడం తగ్గించండి.
- **రెగ్యులర్ వ్యాయామం:** వారానికి కనీసం 30 నిమిషాల పాటు మితమైన వ్యాయామం చేయండి.
- **బరువు తగ్గండి:** మీరు అధిక బరువుతో ఉంటే, బరువు తగ్గడానికి ప్రయత్నించండి.
- **ధూమపానం మానేయండి:** ధూమపానం రక్తపోటును పెంచుతుంది.. కాబట్టి ధూమపానం మానేయడానికి ప్రయత్నించండి.
- **ఆల్కహాల్ వినియోగాన్ని తగ్గించండి:** అధికంగా మద్యం సేవించడం వల్ల రక్తపోటు పెరుగుతుంది.
- **ఒత్తిడిని తగ్గించండి:** యోగా, ధ్యానం లేదా లోతైన శ్వాస వ్యాయామాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.
- **బ్లడ్ ప్రెజర్ చెక్:** డాక్టర్ సలహా మేరకు మీ రక్తపోటును ఎప్పటికప్పుడు చెక్ చేసుకోండి.

మీరు అధిక రక్తపోటుతో బాధపడుతుంటే లేదా దాని ప్రమాదం ఉన్నట్లయితే, వైద్యుడిని సంప్రదించండి. వారు మీ కోసం సరైన చికిత్స ప్రణాళికను రూపొందించగలరు. అధిక రక్తపోటును నియంత్రించడం ద్వారా, మీరు తీవ్రమైన ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.. ఇంకా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు.

# బ్రష్ చేసినా నోటి నుంచి దుర్వాసన వస్తుందా..?

- అయితే ఈ ప్రమాదకర వ్యాధులకు సంకేతమే..
- ముఖ్యంగా ఐదు రకాల వ్యాధులు వచ్చే అవకాశం



**విశ్వంభర, ఫీచర్:** మీ నోటిని క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోతే నోటి దుర్వాసన రావడం సహజం.. అయితే బ్రష్ చేసిన తర్వాత కూడా మీ నోటి నుండి వాసన వస్తుంటే, అది ఆందోళన కలిగించే విషయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నోటి దుర్వాసన సాధారణంగా ఏదైనా తీవ్రమైన కారణాన్ని సూచించదు. ఎందుకంటే ఈ వాసన ఆహారపు అలవాట్లు, నోటి పరిశుభ్రతపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల, దంతవైద్యులు రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలని, ప్రతి భోజనం తర్వాత నీటితో శుభ్రం చేయమని సిఫార్సు చేస్తారు. నోటి పరిశుభ్రతను పాటించిన తర్వాత కూడా మీ నోటి నుండి దుర్వాసన వస్తుంటే, అది శరీరంలో అభివృద్ధి చెందుతున్న కొన్ని తీవ్రమైన వ్యాధులకు సంకేతమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. హాప్కిన్స్ మెడిసిన్ ప్రకారం.. నోటి దుర్వాసన అనేక ప్రమాదకరమైన వ్యాధుల ప్రారంభ సంకేతంగా గుర్తించారు. ఆ 5 వ్యాధులు ఏంటో తెలుసుకోండి..

**శ్వాసకోశ సంక్రమణం:**

సైనసైటిస్, బ్రోన్కైటిస్, న్యుమోనియా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కారణంగా, శరీరంలో అస్థిర సల్ఫర్ సమ్మేళనాల (VSC) స్థాయి పెరుగుతుంది.. ఇది నోటి దుర్వాసనకు కారణమవుతుంది. దీనితో పాటు, ఈ ఇన్ఫెక్షన్లు సంభవించినప్పుడు, బ్యాక్టీరియా శ్వాసకోశంలో పెరుగుతుంది. దీని కారణంగా వాసన కలిగించే మూలకాలు ఏర్పడటం ప్రారంభమవుతాయి.. ఇవి ఉచ్ఛ్వాసంతో బయటకు వస్తాయి.

**జీర్ణక్రియ సమస్య:**

నోటి దుర్వాసన అనేది యాసిడ్ రిఫ్లక్స్, గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్ (GERD), కడుపు పూతల వంటి జీర్ణ రుగ్మతలకు సంబంధించినది. కడుపు ఆమ్లం అన్నవాహికలోకి తిరిగి ప్రవహించినప్పుడు యాసిడ్ రిఫ్లక్స్ సంభవిస్తుంది. దీని వలన నోటిలో పుల్లని త్రేపులతోపాటు వాసన వస్తుంది.

**మూత్రపిండ వ్యాధి:**

కిడ్నీ వ్యాధి వ్యర్థాలను తొలగించే శరీర సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అటువంటి పరిస్థితిలో, రక్తంలో అధిక మొత్తంలో టాక్సిన్ కారణంగా, శ్వాస అమ్మోనియా లాగా ఉంటుంది.. దీనిని యురేమిక్ బ్రీత్ అని కూడా పిలుస్తారు.

**మధుమేహం:**

శరీరంలో ఎక్కువ కాలం షుగర్ ఎక్కువగా ఉండటం వల్ల నోటి దుర్వాసన మొదలవుతుంది. మధుమేహం ఉన్నవారిలో ఇది చాలా సాధారణ సమస్య.. ఎందుకంటే వారి శ్వాసలో ఎక్కువ కీటోన్లు ఉంటాయి.. ఇది 'అసిటోన్ బ్రీత్' అని పిలువబడే ఫల వాసనను ఉత్పత్తి చేస్తుంది.

**కాలేయ రుగ్మతలు:**

సిర్రోసిస్ లేదా ఫ్యాటీ లివర్ డిసీజ్ వంటి కాలేయ సమస్యల వల్ల శరీరంలోని టాక్సిన్స్ సరిగా మెటబాలైజ్ చేయబడవు. కాలేయంలో సమస్య వచ్చినప్పుడు నోటి దుర్వాసన రావడానికి ఇదే కారణం.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com